

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా
మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 299

శుక్రవారం 12-7-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఫ్యాషన్





ఎవర్‌గ్రీన్ ఆర్ట్ వర్క్

ఫుల్కారీ కండువాలు, శాలువాలు, దుపట్టాలకు మాత్రమే పరిమితంగా ఉండేది. కానీ నేడు కుర్తాలు, లెహంగాలు, జాకెట్లు, స్టోల్స్, చీరలు, ఫ్రాక్‌లు, స్కర్ట్‌లు, కఫ్తాన్లు, ఫ్యూజన్ అవుట్‌ఫిట్‌లు, పాదరక్షలు, బెల్ట్‌లు, హెయిర్ బ్యాండ్స్, బ్యాగ్‌లు, పౌచ్‌లు, క్లచ్‌లు, గొడుగుల డిజైన్లలోనూ.. ఫుల్కారీ కళ కనిపిస్తోంది.



ఫుల్కారీ నక్షత్రాలు

మన దేశీయ సంప్రదాయ కళల ప్రాముఖ్యత ఎంతటిదో మనకు తెలిసిందే. పంజాబ్ 'ఫుల్కారీ కళ'కు ప్రసిద్ధి. వారి సంప్రదాయ వేడుకలలో ప్రధానంగా కనిపిస్తుంది. 'పూల కళ'గా పేరొందిన ఈ వర్క్ దుపట్టాలు, చీరలమీదనే కాదు ఆధునిక డ్రెస్సుల మీద, ఇతర యాక్సెసరీస్‌లోనూ కనువిందు చేస్తోంది. నక్షత్రాల్లా మెరిసిపోతూ ఆకర్షణీయంగా కనిపించే ఈ కళ పండగల వేళ మరింత ప్రత్యేకతను చాటుతోంది. ఫ్యాషన్ వేదికల మీదా కనువిందు చేస్తోంది.



● ఇండోవెస్టర్న్ డ్రెస్సులకీ కళ తెచ్చే ఫుల్కారీ

ఒక్కో ప్రాంతానికి ఒక్కో విశిష్టత ఉన్నట్టే ఒక్కో కళ కూడా తన ప్రత్యేకతను చూపుతుంటుంది. హిందీలో 'ఫూల్' అంటే పువ్వు అని అర్థం. వేదకాలంలోనూ ఈ జానపద కళ మూలాలున్నాయని చెబుతుంటారు. అయితే, 15వ శతాబ్దంలో పంజాబ్‌లోని మహిళల ద్వారా మొదలైందని తెలుస్తుంది. వివాహాలు ఇతర వేడుకలలో మహిళలు ఫుల్కారీలు ధరించడం, బహుమతులు ఇవ్వడం అక్కడి సంప్రదాయం. ఇది పూర్తిగా గృహసంబంధమైన దేశీయ కళ. ఖద్దరు క్లాత్‌పైన రంగు రంగుల సిల్క్, కాటన్ దారాలతో ఎంబ్రాయిడరీ చేస్తారు. రేఖాగణితంలోని జామెట్రీని ఈ డిజైన్లు పోలి ఉంటాయి.



● ఫుల్కారీ ఎంబ్రాయిడరీలో విభిన్న డిజైన్లు

విభిన్న డిజైన్లు

ఈ డిజైన్లలో బాగ్, ఛమాస్, నీలక్, చోప్.. వంటి 52 రకాల ఫుల్కారీలు ఉన్నాయి. అయితే, వీటిలో కొన్ని మాత్రమే ఇప్పుడు వాడుకలో ఉన్నాయి. గతంలో ఈ ఎంబ్రాయిడరీని స్త్రీలు చేతులతో చేసేవారు. ఇప్పుడు యంత్రాలు, ఆధునిక పద్ధతులలో కొత్త వస్తువులను ఉపయోగిస్తున్నారు. ఈ కళ టెక్నిక్స్‌ని చాలా మంది ఆధునిక డిజైనర్లు గ్లోబల్ మార్కెట్‌ను చేరుకోవడానికి ఎంచుకుంటున్నారు.

సంప్రదాయ రంగులు

ఫుల్కారీ కళలో రంగుల వాడకం చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. సాంప్రదాయకంగా నాలుగు రంగులు మాత్రమే ఉపయోగిస్తారు. కాబోయే వధువులకు ఎరుపు, రోజువారీ వాడకంలో నీలం, నలుపు, ముదురు షేడ్స్ ఉపయోగిస్తారు. ఉత్సాహాన్ని సూచించడానికి ఎరుపు, శక్తి కోసం నారింజ, సంతానోత్పత్తికి ఆకుపచ్చ రంగును వాడతారు.

ప్రకృతితో ప్రేమ

ఫుల్కారీ మూలాంశాలకు ప్రేరణ ప్రకృతియే. తల్లీ కూతుళ్ల అనుబంధం, జంతువులు, పక్షులు, ఉద్యాన వనాలు, బంతి, మల్లెలు, నెమలి, ఆవ పూలు... స్త్రీల భావోద్వేగాలకు అద్దం పడుతున్నాయా అన్నట్టు ఈ కళ సృజనాత్మకతకు అద్దం పడుతుంది.



● యాక్సెసరీస్‌లోనూ ఫుల్కారీ వర్క్



● ఫుల్కారీ ఎంబ్రాయిడరీతో డిజైన్ చేసిన దుపట్టా



ఆరోగ్యంలో మునగండి!

ఆషాడంలో గోరింటాకు పెట్టుకుని మురిసిపోతాం. మునగాకు తినాలని కూడా చెప్పారు పెద్దవాళ్లు. మహిళల ఆరోగ్యాన్ని సంప్రదాయాల పట్టికలో చేర్చారు. పెద్దవాళ్లు చెప్పిన పద్ధతులను పాటిద్దాం... ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.

కొబ్బరి మునగాకు వేపుడు



కావలసినవి: మునగాకు పావు కేజీ; పసుపు – పావు టీ స్పూన్; పచ్చి కొబ్బరి తురుము– పావు కప్పు; ఉల్లిపాయ ముక్కలు– పావు కప్పు; ఉప్పు – అర టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; నూనె – టేబుల్ స్పూన్; ఆవాలు– అర టీ స్పూన్; పచ్చి శనగపప్పు – టేబుల్ స్పూన్; వెల్లుల్లి రేకలు– 4; కరివేపాకు– 2 రెమ్మలు.

తయారీ: ● మునగాకులో పుల్లలు తీసివేసి, ఆకును శుభ్రంగా కడిగి నీరు పోయేటట్లు చిల్లుల పాత్రలో వేయాలి. అరగంటసేపు పక్కన ఉంచాలి. బాగా ఆరిన తర్వాత ఒక పాత్రలోకి తీసుకుని అందులో కొబ్బరి తురుము, పసుపు వేసి కలపాలి ● బాణలిలో నూనె వేడి చేసి ఆవాలు, ఎండు మిర్చి, పచ్చి శనగపప్పు వేసి అవి వేగిన తర్వాత వెల్లుల్లి రేకలు, ఉల్లిపాయ ముక్కలు, మిరప్పొడి, కరివేపాకు వేసి వేయించాలి. అవి వేగిన తర్వాత ముందుగా కలిపి సిద్ధంగా ఉంచుకున్న మునగాకు, కొబ్బరి మిశ్రమం, ఉప్పు వేసి కలిపి మూత పెట్టి సన్న మంట వేగనివ్వాలి. మధ్యలో మూత తీసి కలుపుతూ ఆకులో పచ్చిదనం, తేమ పోయే వరకు వేగనిచ్చి ఉప్పు సరిచూసుకుని ఆపేయాలి.

వంటిల్లు

మొరింగా ఆమ్లెట్



కావలసినవి: కోడిగుడ్లు – 2; మునగాకు – అర కప్పు; ఉప్పు – పావు టీ స్పూన్; మిరియాలపొడి– పావు టీ స్పూన్; వెన్న లేదా నెయ్యి– టేబుల్ స్పూన్.

తయారీ: ● మునగాకులో పుల్లలు ఏరివేసి ఆకును శుభ్రంగా కడిగి నీరంతా పోయేటట్లు చిల్లుల పాత్రలో వేయాలి. నీరు కారిపోయిన తర్వాత తరిగి ఒక పాత్రలో వేయాలి. అందులో ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి. ఆ తర్వాత కోడిగుడ్లు కొట్టి సొనవేసి కలపాలి ● పెనం వేడిచేసి వెన్న లేదా నెయ్యి వేసి కరిగిన తర్వాత మునగాకు, కోడిగుడ్ల మిశ్రమాన్ని వేయాలి. ఒకవైపు కాలిన తర్వాత తిరగేసి రెండోవైపు కూడా దోరగా కాలనిచ్చి స్టవ్ ఆపేయాలి.

గమనిక: కోడిగుడ్డు సొన కాలే సమయంలో మునగాకు కూడా మగ్గిపోతుంది. పచ్చివాసన వస్తుందని సందేహం ఉంటే మునగాకును పెనం మీద పచ్చివాసన పోయే వరకు వేయించి ఆ తర్వాత మిగిలిన దినుసులను కలిపి ఆమ్లెట్ వేసుకోవాలి.

న్యూస్‌మేకర్



కామన్‌వెల్త్ బహుమతి గెలిచిన అమ్మ కథ

ఆధునిక జీవితం అమ్మను ఎక్కడకు చేర్చింది? వృద్ధాశ్రమానికి. ఒకమ్మాయికి వృద్ధాశ్రమంలో నుంచి ఒక తల్లిని ఇంటికి తెచ్చుకోవాలని అనిపిస్తుంది. కాని వృద్ధాశ్రమంలో చూస్తే అందరు తల్లులూ అద్భుతంగా అనిపిస్తారు. ఇంత మంచి తల్లులను ఎందుకు పెట్టారోనని సంజనా ఠాకూర్ రాసిన కథ కామన్‌వెల్త్ ప్రైజ్ 2024 గెలుచుకుంది. సంజనా ఠాకూర్ పరిచయం.

'స్కూల్ టీచర్లకు నన్ను తిట్టాలని ఉండేది. కాని తిట్టలేకపోయేవారు. సంజనా బాగా చదువుతుంది... హోమ్ వర్క్ చేస్తుంది... కాని క్లాస్ జరుగుతుంటే టేబుల్ కింద కూచుని కథల పుస్తకం చదువుతోంది అని కంప్లయింట్ చేసేవారు. నాకు చిన్నప్పటి నుంచి పుస్తకాలంటే అంత పిచ్చి. మా అమ్మ రోజూ నాకు కథలు చదివి వినిపించేది. నేను మా ఫ్యామిలీ ఫంక్షన్లకు వెళ్లినా పార్టీలకు వెళ్లినా పుస్తకం పట్టుకుని మూలన కూచునేదాన్ని. చిన్నప్పుడే రాయడం మొదలెట్టాను. ఇప్పుడు ఈ గుర్తింపు రావడం సంతోషంగా ఉంది' అంటుంది 26 సంవత్సరాల సంజనా ఠాకూర్. ముంబైకి చెందిన సంజన ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ టెక్సస్‌లో ఎం.ఎఫ్.ఏ. ఫిక్షన్ చదువుతోంది. ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'కామన్‌వెల్త్ షార్ట్ స్టోరీ ప్రైజ్' పోటీల్లో పాల్గొని 2024 సంవత్సరానికి విజేత అయింది.

ఐదు లక్షల బహుమతి

కామన్‌వెల్త్ దేశాలలోని యువ రచయితలను ఉత్సాహపరచడానికి కామన్‌వెల్త్ ఫౌండేషన్ ఏటా కథల పోటీ నిర్వహిస్తుంది. 18 ఏళ్లు పైబడిన వారు దీనికి అర్హులు. నేరుగా ఇంగ్లిష్‌లో కాని లేదా ఇంగ్లిష్‌లో అనువాదమైన స్థానికభాష కథగాని పంపవచ్చు. 2500 పదాల నుంచి 5000 పదాల వరకూ కథ ఉండాలి. ఇందులో మళ్లీ ఐదు రీజియన్లకు (ఆఫ్రికా, ఆసియా, కెనడా–యూరప్, పసిఫిక్) ఐదుగురు రీజనల్ విన్నర్స్‌ను ప్రకటిస్తారు. వీరి నుంచి ఓవరాల్ విన్నర్‌ను ఎంపిక చేస్తారు. 2024కు ఆసియా రీజనల్ విన్నర్‌గా నిలిచిన సంజనా ఠాకూర్ ఓవరాల్ విన్నర్‌గా కూడా ఎంపికైంది. నగదు బహుమతిగా 5000 పౌండ్లు గెలుచుకుంది.

కథ పేరు ఐశ్వర్యారాయ్

'అమెరికాలో నేనొక బొమ్మల షాపులో తిరుగుతున్నప్పుడు కేవలం అమ్మ బొమ్మలు అమ్మే ఒక షాప్ ఉంటే ఎలా ఉంటుందా అనే ఆలోచన వచ్చింది. అక్కడినుంచి పిల్లలు అమ్మల్ని దత్తత తీసుకుంటే ఎలా ఉంటుందనే ఆలోచన కొనసాగింది. ఇండియాలో పట్టణ సంస్కృతి ఇప్పుడు ఇళ్లల్లో అమ్మకు చోటు లేకుండా చేస్తోంది. ఆమె వృద్ధాశ్రమంలో ఉండాల్సి వస్తోంది. నా కథలో అన్వి అనే అమ్మాయి ఒక వృద్ధాశ్రమానికి వెళ్లి ఒక అమ్మను దత్తత తీసుకోవాలనుకుంటుంది. కాని ఒక్కో అమ్మ ఒక్కో లక్షణంలో గొప్పగా కనిపిస్తుంది. అమ్మలందరూ తమ అనుబంధం రీత్యా ఐశ్వర్యారాయ్ కంటే తక్కువ సౌందర్యవతులు కాదు. ఏ అమ్మ సౌందర్యమైనా బంధం రీత్యా ఐశ్వర్యారాయ్ అంత అందమైనదే. అందుకే ఆ పేరుతోనే కథ రాశాను. వ్యంగ్యం, చెణుకులు ఉండటంతో నా కథను జడ్జిలు మెచ్చుకొని ఉండొచ్చు' అని తెలిపింది సంజనా.

త్వరలో పుస్తకం

'త్వరలో 15 కథలతో నేను పుస్తకం తెస్తాను. ఇప్పటికే రాశాను. అందులో అన్ని కథల్లోనూ తల్లులూ కూతుళ్లు కనిపిస్తారు. వారి భిన్న భావోద్వేగాలు చర్చకు వస్తాయి. ప్రస్తుతం నా థీసిస్‌లో భాగంగా ఈ కథలను సబ్మిట్ చేయగానే పుస్తకం పని మొదలెడతాను. ప్రపంచ సాహిత్యంలో చాలా మంచి రచనలు వస్తున్నాయి. మన దేశం నుంచి అరుంధతి రాయ్ శైలి నాకు బాగా నచ్చుతుంది' అందామె.

సాహిత్యాన్ని ఒక చదువుగా... రచనను ఒక ఉపాధిగా చేసుకోదలిచింది సంజన.

హెల్త్ ఫ్యాక్ట్

శాకాహారంతోనూ మంచి మజిల్స్!

మంచి శరీర సౌష్ఠవం కోరుతూ వ్యాయామాలు చేసేవారు తమ మజిల్స్ పెరగడానికి మాంసాహారాన్ని తీసుకుంటుంటారు. అయితే శాకాహారపు ప్రొటీన్లు సైతం మంచి కండరాలను ఇస్తాయంటున్నారు యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్‌కు చెందిన పరిశోధకులు. బలమైన కండరానికి ప్రొటీన్ కావాలి తప్ప... అది మాంసం నుంచా లేక శాకాహారం నుంచా అన్నది అంత ప్రధానాంశం కాదంటున్నారు వారు. కొందరు



ఎక్సర్‌సైజ్ ప్రియులను ఆరు గ్రూపులు గా విభజించి వారికి... కొవ్వులు ఎక్కువగా ఉండే పాలు–వాటి ఉత్పాదనలు, చేపలు, వేటమాంసం, చికెన్, కొవ్వు తక్కువగా ఉండే పాలు, బఠాణీల వంటి పప్పుధాన్యాలను అందించారు. దీనికి ముందూ... ఆ తర్వాత వారి మజిల్ మాస్, కండరాల సౌష్ఠవం వంటి వాటిని లెక్కించారు. ప్రొటీన్ ఏదైనప్పటికీ మజిల్‌మాస్, బలం, సౌష్ఠవం వంటి అంశాల్లో పెద్ద తేడాలేమీ కనిపించకపోగా.. శాకాహార ప్రొటీన్ తీసుకున్న వారిలో ప్రోస్టేట్‌కు సంబంధించిన కొన్ని అనర్థాల ఆనవాళ్లు లేవని తేలింది!

ఆచారం

ఆషాఢంలో అత్తాకోడళ్లు ఒక గడప దాటకూడదా?

ఆషాఢంలో అత్తాకోడళ్ళు ఒక గడప దాటకూడదని, అత్తా అల్లుళ్లు ఒకరికొకరు ఎదురు పడకూడదని, కొత్త దంపతులు కలవకూడదనీ అంటారు. ఎందుకంటే...

సాధారణంగా వ్యవసాయ పనులన్నీ ఈ మాసంలోనే రైతులు ప్రారంభిస్తారు. పూర్వం రోజుల్లో కొత్తగా పెళ్లయిన అబ్బాయి ఆరు నెలల కాలం అత్తగారింట్లో ఉండే సంప్రదాయం ఉండేది. వ్యవసాయపు పనులు చేయవలసిన యువకులు అత్తవారింట్లో ఉంటే, సకాలంలో పనులు జరగవు. వర్షాలకు తగినట్లుగా విత్తనాలు చల్లుకొనే రోజులు అవి. ఇప్పటిలా కాల్వల ద్వారా నీరు లభించేది కాదు. సరైన సమయంలో విత్తనాలు చల్లకపోతే కష్టం కదా... అందుకే కొత్త కోడలు పుట్టింట్లోనే ఉండాలి. అల్లుడు అత్తవారింటికి వెళ్ళకూడదు అనే నియమం విధించారు. అంతేకాకుండా, కొత్త నీరు వచ్చే ఆషాఢంలో ఆ నీరు తాగటం వల్ల రకరకాల రుగ్మతలకు లోను కావచ్చు. అంతేకాదు, ఈ కాలంలో గర్భధారణ జరిగితే పిల్లలు కలిగే నాటికి మంచి ఎండా కాలం... శిశువు పెరగటానికి అంత మంచి వాతావరణం కాదు అని ఆలోచించారు. అందుకే ఈ నియమాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటి రోజులకు అన్వయించుకుంటే... వ్యవసాయదారుల కుటుంబాలు కాకుండా ఇతరుల విషయంలో ఈ ఇబ్బంది లేదు.

ఆర్గానిక్ స్కిన్‌కేర్

సహజమైన గెలుపు

చర్మ సమస్యలతో ఇబ్బంది పడుతున్న కుమార్తెను చూసి బాధపడింది కృతిక కుమారన్. ఈ నేపథ్యంలోనే కెమికల్ ఫ్రీ ప్రాడక్ట్‌ల గురించి ఆలోచించింది. నేచురల్ కాస్మటాలజీలో డిప్లామా చేసిన తరువాత ప్రయోగాలు ప్రారంభించి విజయం సాధించింది. కోయంబత్తూరుకు చెందిన కృతిక కుమారన్ ఆర్గానిక్ స్కిన్‌కేర్ స్టార్టప్ 'విల్వా' సూపర్ సక్సెస్ అయింది...



తమిళనాడులోని గోబిచెట్టిపాళయం అనే ఊళ్లో పుట్టి పెరిగింది కృతి. తండ్రి లాయర్. తల్లి గృహిణి. ఉన్నత విద్య కోసం కోయంబత్తూరుకు వెళ్లిన కృతిక 'కుమారగురు కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ'లో ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీలో బీటెక్ చేసింది. ఆ తరువాత తమిళ్ కుమారన్ అనే వస్త్ర వ్యాపారితో కృతికకు వివాహం జరిగింది.

కుమార్తెకు చర్మసమస్యలు వచ్చినప్పుడు మార్కెట్‌లోని కొన్ని సబ్బులు, షాంపులను ప్రయత్నించిందిగానీ అవేమీ ఫలితం ఇవ్వలేదు. దీంతో సహజ సిద్ధమైన పదార్థాలను ఉపయోగించి సబ్బులు తయారు చేయాలని నిర్ణయించుకుంది. 'కాస్మటాలజీలో డిప్లామా చేయడం నుంచి యూ ట్యూబ్‌లో వీడియోలు చూడడం వరకు ఎన్నో అంశాలు నా ప్రయోగాలలో ఉపయోగపడ్డాయి' అంటుంది కృతిక.



● ప్రయోగశాలలో కృతిక కుమారన్

ముందుగా వంటగదిలో మేకపాలతో ప్రయోగాలు మొదలుపెట్టింది. కుటుంబ సభ్యులు కూడా ఈ ప్రయోగాల్లో పాలు పంచుకున్నారు. 'అనేక ప్రయోగాల తరువాత విజయం సాధించాం. మొదట్లో రెండు మేకలు ఉండేవి. ఇప్పుడు మేకల మందలు ఉన్నాయి. వాటి తాజా పాలతో మా ప్రాడక్ట్స్ తయారు చేస్తున్నాం. హానికరమైన రసాయనాలకు దూరంగా ఉన్నాం' అంటుంది కృతిక.

జుట్టు, చర్మసంరక్షణ ఇతర సౌందర్య ఉత్పత్తులతోపాటు లెమన్ గ్రాస్‌తో దోమల నివారణ మందును కూడా తయారు చేశారు. ఇన్‌స్టాగ్రామ్ స్టోర్‌తో తొలి అడుగు వేశారు. రెండు సంవత్సరాల తరువాత వెబ్‌సైట్‌ను మొదలు పెట్టడంతో పాటు డిస్ట్రిబ్యూషన్, లాజిస్టిక్స్‌లోకి వచ్చారు. అగ్రశ్రేణి డిస్ట్రిబ్యూషన్, లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌లతో కలిసి పని చేయడం మొదలుపెట్టారు. ఆ తరువాత ఆఫ్‌లైన్ స్టోర్‌లకు కూడా శ్రీకారం చుట్టారు.

ఇద్దరితో ప్రారంభమైన 'విల్వా'లో ఇప్పుడు వందమందికి పైగా పనిచేస్తున్నారు. పదివేల రూపాయలతో మొదలైన కంపెనీ సంవత్సరం తిరిగేసరికల్లా కోటి రూపాయల టర్నోవర్‌కు చేరింది. ఇప్పుడు కంపెనీ టర్నోవర్ 29 కోట్లు.

'ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో మా ఉత్పత్తులకు సంబంధించిన సమాచారాన్ని షేర్ చేసినప్పుడు కోయంబత్తూరుతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వాట్సాప్ ద్వారా ఆర్డర్లు వచ్చేవి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, నైకా లాంటి ఈ–కామర్స్ ప్లాట్‌ఫామ్స్ మా ఉత్పత్తులను లిస్టింగ్ చేయడంతో వ్యాపారపరిధి విస్తరించింది' అంటుంది కృతిక.

'లాభాల దృష్టితో కాకుండా మా కంపెనీ ద్వారా రైతులు, చేతివృత్తుల కార్మికులకు ఏదో రకంగా ఉపయోగపడాలనుకుంటున్నాం. పర్యావరణ అనుకూల ప్యాకేజింగ్‌లను ఉపయోగిస్తున్నాం' అంటుంది కృతిక.

సంగీత, నృత్యాలలో ప్రవేశం ఉన్న కృతికకు చిన్నప్పటి నుంచి కొత్త విషయాలు తెలుసుకోవడంపై ఆసక్తి. ఆ జిజ్ఞాస ఆమెను వ్యాపార దారిలోకి తీసుకువచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా తిరుగులేని విజయం సాధించేలా చేసింది.


'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 299

శుక్రవారం 12-7-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




జాస్మిన్ జయహో

వింబుల్డన్ టోర్నీలో తొలిసారి ఫైనల్లోకి.. రేపు క్రిచికోవాతో టైటిల్ పోరు -11 లో



లాభాల స్వీకరణ

స్వల్ప నష్టాలతో ముగిసిన సూచీలు.. 79,897 వద్ద స్థిరపడిన సెన్సెక్స్ -11లో



నీట్‌-యూజీపై విచారణ వాయిదా

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్‌-యూజీ అవకతవకలపై విచారణను ఈ నెల 18వ తేదీకి సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

వివరాలు 6లో ▶



భగవద్గీత సాక్షిగా...

బ్రిటిష్‌ ఎన్నికల్లో గెలిచిన భారత సంతతి ఎంపీ శివాని రాజా భగవద్గీత సాక్షిగా ప్రమాణ స్వీకారం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

వివరాలు 6లో ▶



పిడుగుపాటుతో 38 మంది మృతి

ఉత్తరప్రదేశ్‌లో పిడుగుపాటుకు గురై ఒక్కరోజే దాదాపు 38 మంది మరణించారు. ప్రతాప్‌గఢ్‌లో అత్యధికంగా 11 మంది మృతి చెందారు.

వివరాలు 6లో ▶



తల్లిదండ్రులతో గడిపేందుకు..

అస్సాం ప్రభుత్వ ఉద్యోగులు తల్లిదండ్రులు లేదా అత్తమామలతో గడిపేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం 2 రోజులు సెలవులు ఇచ్చింది.

వివరాలు 6లో ▶

ఒక్కరికే వందనం..

అందరికీ ఎగనామం!

'తల్లికి వందనం' పథకంపై కూటమి ప్రభుత్వం యూటర్న్


ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికీ ఇస్తామని ఎన్నికల్లో హామీ

- స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు చొప్పున జమ చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటన
- జీవో నంబర్‌ 29లో ఒక్క తల్లికి మాత్రమే 'తల్లికి వందనం' అని స్పష్టీకరణ
- కోటి మంది పిల్లలను నిలువునా మోసం చేస్తున్న సీఎం చంద్రబాబు
- ఇంట్లో పిల్లలందరికీ కాకుండా ఒక్కరికే అంటూ మెలిక.. అదీ ఎప్పుడిస్తారో తెలీదు
- ఐదేళ్ల డేటా ఉన్నా లబ్ధిదారుల ఎంపిక పేరుతో తాత్సారం చేస్తున్న సర్కారు
- ఇన్నాళ్లకు కేవలం గైడ్‌లైన్స్‌ మాత్రమే జారీ.. అందులోనూ ప్లేటు ఫిరాయింపు
- ఏటా జూన్‌ నెలలోనే అమ్మఒడి జమ చేసిన జగన్‌ ప్రభుత్వం
- వైఎస్‌ జగన్‌ సీఎంగా ఉండుంటే ఈ పాటికే అమ్మ ఒడి, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన, మత్స్యకార భరోసా అందేవి..

2లో

ఎన్నికల ప్రచారంలో..


తల్లికి వందనం కింద ఏడాదికి ప్రతి ఒక్క బిడ్డకూ 15 వేల రూపాయలు ఇచ్చే బాధ్యత నాదీ... ఒక్కరికే అనే నిబంధన లేదు.. ఇద్దరుంటే ఇద్దరికీ ఇస్తా.. ముగ్గురుంటే ముగ్గురికీ ఇస్తా.. నలుగురుంటే నలుగురికీ ఇస్తా.. మీ ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున ఇస్తా. ఈ లెక్కన నలుగురుంటే రూ.60 వేలు ఇస్తా.



మేనిఫెస్టోలో..



అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో



Scheme	Description
TALLIKI VANDANAM	As a part of Government Assured Flagship Programs, the Government under "TALLIKI VANDANAM" scheme is providing financial assistance of Rs.15,000/- per annum to each mother or recognized guardian who is below poverty line household and sending their children to schools/colleges i.e., from Classes I to XII.

తల్లికి మాత్రమే రూ.15,000 అందిస్తామంటూ జీవో

కోవిడ్‌ సమయంలో విశాఖలోనే ఉన్నా

8 రోజులు ఉన్నా.. పరిస్థితిని నేనే చక్కదిద్దా

నేను గతంలో ఓడిపోయిన తర్వాత మెడ్‌టెక్‌ జోన్‌కి ఇబ్బందులు సృష్టించారు

మొదటిసారి సీఎం అయినప్పుడు ఐటీ పార్క్‌ క్రియేట్‌ చేశాను

రెండోసారి సీఎం అయ్యాక బయోటెక్నాలజీ పార్క్‌ క్రియేట్‌ చేశాను

మూడోసారి సీఎం అయ్యాక మెడికల్‌ ఎక్విప్‌మెంట్‌ మాన్యుఫాక్చరింగ్‌ సిస్టమ్‌ క్రియేట్‌ చేశాను

డ్రోన్లతో దోమల్ని నాశనం చేసే టెక్నాలజీ తీసుకొచ్చాను

బెంగళూరు ఎయిర్‌పోర్టు సమీపంలో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం

ట్రిపుల్‌ ఐటీల్ని నేనే ప్రారంభించా.. సీఐఐ, ఏపీ మెడ్‌టెక్‌ జోన్‌ సదస్సులో చంద్రబాబు

వలంటీర్లతో పనేముందని అధికారుల సమీక్షలో వ్యాఖ్య

సాక్షి, విశాఖపట్నం/సాక్షి, అనకాపల్లి: 'కోవిడ్‌ సమయంలో విశాఖలోనే ఉన్నా. పరిస్థితిని చక్కదిద్దా..

డ్రోన్లతో దోమల్ని నాశనం చేసే టెక్నాలజీని నేనే తీసుకొచ్చా. వాటిని గుర్తించి, డ్రోన్లతోనే చంపించేసి, దోమలరహిత రాష్ట్రంగా ఏపీని చేస్తా..

బెంగళూరు ఎయిర్‌పోర్టు సమీపంలో అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం'..

– సీఐఐ ప్రతినిధులతో, మెడ్‌టెక్‌ జోన్‌లోని భాగస్వాములు, సిబ్బందితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన దిమ్మ తిరిగి మైండ్‌ బ్లాంక్‌ అయ్యే వ్యాఖ్యలు.

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా గురువారం విశాఖ పర్యటనకు వచ్చిన చంద్రబాబు విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం సాయంత్రం ఆయన



మెడ్‌టెక్‌ జోన్‌ను సందర్శించారు. అక్కడ తయారు చేసిన పరికరాల ప్రదర్శనని తిలకించారు. గ్లోబల్‌ యూనివర్సిటీ ఫర్‌ మెడికల్‌ టెక్నాలజీ, నేషనల్‌ సెంటర్‌ ఫర్‌ మెడికల్‌ మెటీరియల్స్‌ని ప్రారంభించారు. అనంతరం అక్కడ జరిగిన సదస్సుల్లో మాట్లాడుతూ..

మిగతా 3వ పేజీలో ▶

న్యూస్‌రీల్‌

ప్రేమోన్మాది ఆత్మహత్య



అనకాపల్లి జిల్లా కొప్పుగొండుపాలెంలో తన ప్రేమను నిరాకరించి జైలుకు పంపిందనే పగతో 14 ఏళ్ల బాలికను ఐదు రోజుల క్రితం హతమార్చిన ప్రేమోన్మాది సురేశ్‌ చివరకు శవమై కనిపించాడు. బాధితురాలి ఇంటి సమీపంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు.

వివరాలు 5లో ▸

తొందరపాటు చర్యలొద్దు



టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత దేవినేని అవినాష్‌కు హైకోర్టు ఊరటనిచ్చింది.

వివరాలు 12లో ▸

ఫర్నిచర్‌ కొనుగోలుపై నిషేధం ఉన్నా.. ఆగని మంత్రులు



ప్రభుత్వ కార్యాలయాలకు ఫర్నిచర్‌ కొనుగోలుపై 2026 మే నెలాఖరు వరకు నిషేధం విధిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అయినా మంత్రులు పట్టించుకోకుండా కొత్త ఫర్నిచర్‌తో తమ పేషీలను ఆధునిక హంగులతో ముస్తాబు చేయిస్తున్నారు.

వివరాలు 3లో ▸

మేడం వచ్చాకే రిబ్బన్‌ కటింగ్‌



టీడీపీ ప్రభుత్వంలోని ఓ మంత్రి గారి భార్య మొన్న పోలీసు అధికారులను హడలెత్తించిన దృశ్యం చూశాం. ఇప్పుడు అదే కూటమికి చెందిన ఓ ఎమ్మెల్యే గారి భర్త రైతు బజారులో స్టాల్‌ ప్రారంభోత్సవాన్ని నిలిపివేయించారు. మేడం వస్తే కానీ రిబ్బన్‌ కటింగ్‌ జరగకూడదంటూ కలెక్టర్‌కే హుకుం జారీ చేశారు.

వివరాలు 3లో ▸

ఇదం జగత్‌



నీకే చెప్పేది! ఆ పేపర్‌ని బయటకెళ్లి చదువుకోవయ్యా!!

తిరుమల క్యూలో

ప్రాంక్‌ వీడియో

ఓ యూట్యూబర్‌ నిర్వాకం.. సోషల్‌మీడియాలో కలకలం

మండిపడ్డ శ్రీవారి భక్తులు.. విచారణకు టీటీడీ విజిలెన్స్‌ ఆదేశం

తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భద్రతలోని డొల్లతనం, సిబ్బంది నిర్లక్ష్యం బట్టబయలైంది. శ్రీవారి దర్శనానికి వెళ్లే క్యూలైన్లలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్‌ పరికరాలను తీసుకుకెళ్లేందుకు అనుమతి లేనప్పటికీ తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి అక్కడి సిబ్బంది కళ్లుగప్పి ఏకంగా మొబైల్‌ఫోన్‌ తీసుకెళ్లాడు. అంతటితో ఆగకుండా ఏకంగా ఓ ప్రాంక్‌ వీడియోని చిత్రీకరించడం.. ఆ తర్వాత దానిని తన ఇన్‌స్టాగ్రాం పేజీలో పోస్టు చేయడం తీవ్ర కలకలం సృష్టించింది. వివరాలివీ.. తమిళనాడుకు చెందిన ఓ వివాదాస్పద యూట్యూబర్‌ టీటీఎఫ్‌ వాసన్‌ ఇటీవల తన మిత్రులతో కలిసి

మిగతా 2వ పేజీలో ▶



తిరుమలలోని క్యూ కంపార్ట్‌మెంట్‌లో శ్రీవారి భక్తులను ప్రాంక్‌ చేస్తున్న యూట్యూబర్‌

'ఆర్థిక ఉద్దీపన చర్యలు చేపట్టండి'

దేశంలో ఆర్థిక వ్యవస్థ ప్రగతికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని మోదీకి పలువురు ఆర్థికవేత్తలు విజ్ఞప్తి చేశారు.

6లో

విధ్వంసకారి చైనా

'నాటో' సభ్యదేశాల అధినేతల మండిపాటు

రష్యాకు సహకరించడం మానుకోవాలని హితవు

ఐరాస చార్టర్‌కు కట్టుబడి ఉండాలని సూచన

'వాషింగ్టన్‌ సమ్మిట్‌ డిక్లరేషన్‌' విడుదల

- వివరాలు 6లో

సూదిమొనపై ఎయిడ్స్‌ భూతం

త్రిపురలో 800 మంది విద్యార్థులకు పాజిటివ్‌

47 మందిని కబళించిన హెచ్‌ఐవీ

మాదకద్రవ్యాల వాడకం మాటున విస్తరిస్తున్న ప్రాణాంతక వ్యాధి

6లో

మీ పీఏ దౌర్జన్యం చేస్తున్నాడు

- మీ నాయకుడు భూమి లాక్కున్నాడు
- డయల్‌ యువర్‌ ఎమ్మెల్యే కార్యక్రమంలో బాధితులు
- కంగుతిన్న ఎమ్మెల్యే

చిత్తూరు అర్బన్‌: ప్రజా సమస్యలు పరిష్కరిస్తానంటూ 'డయల్‌ యువర్‌ ఎమ్మెల్యే' కార్యక్రమం ప్రారంభించిన ప్రజాప్రతినిధి తొలిరోజే కంగుతిన్నారు. ఎందుకంటే మొదటగా వచ్చి ఫోన్లు ఆ ఎమ్మెల్యే పీఏ, అనుచరుల దౌర్జన్యాల గురించే. చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్‌నాయుడుకు ఎదురైన చేదు అనుభవమిది. ఎమ్మెల్యే జగన్‌మోహన్‌ నాయుడు 'డయల్‌ యువర్‌ ఎమ్మెల్యే' కార్యక్రమానికి గురువారం మునిసిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయంలో శ్రీకారం చుట్టారు. ప్రతి గురువారం గంట పాటు నియోజకవర్గంలో ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మొదటి ఫోన్‌ కాల్‌ ఓ మహిళ నుంచి వచ్చింది. 'సార్‌.. నేను ఉండేది ప్రశాంత్‌ నగర్‌ కాలనీ. ఇక్కడ మీ పీఏ దౌర్జన్యం చేస్తా ఉండాడు. వాళ్ల అన్న కూడా వచ్చి మాపై గొడవ చేస్తా ఉండాడు. మీరే కాపాడాలి' అని విన్నవించుకుంది. 'నాకున్నది ఒక్కరే పీఏ అని, అతని పేరు కుమారస్వామి. మీరు నేరుగా నా ఆఫీస్‌కు వచ్చి ఎవరో గుర్తుపట్టండి, తప్పు చేసినట్లు తెలిస్తే యాక్షన్‌ ఉంటుంది' అని ఎమ్మెల్యే చెప్పారు. మరో ఫోన్‌ కాల్‌లో 'సార్‌, మాకు మంగసముద్రం వద్ద భూమి ఉంది. మీ పార్టీకి చెందిన బాలాజీ, మరికొందరు మా భూమిని లాక్కుంటా ఉండారు. మీరే న్యాయం చేయాలి' అంటూ అర్థించారు. 'నేరుగా పోలీస్‌ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయండి' అని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. ఇలా అధికార పార్టీ నేతలు, అధికారుల తీరుపై పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.

పలువురు ఐఏఎస్‌ల బదిలీ



- సీసీఎల్‌ఏగా జయలక్ష్మి
- స్టాంప్స్‌ అండ్‌ రిజిస్ట్రేషన్స్‌ ప్రత్యేక సీఎస్‌గా సిసోడియా
- అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక ప్రత్యేక సీఎస్‌గా అనంతరాము

2లో



రేషన్‌ బియ్యం అక్రమ రవాణాలో ఐదుగురు ఐపీఎస్‌లు

రాష్ట్రంలో రేషన్‌ బియ్యం అక్రమ రవాణాలో ఐదుగురు ఐపీఎస్‌ అధికారుల పాత్ర ఉందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ ఆరోపించారు. ఇటీవల జరిగిన తనిఖీల్లో కాకినాడలోనే 43 వేల టన్నుల పీడీఎస్‌ బియ్యాన్ని సీజ్‌ చేసి సమగ్ర దర్యాప్తునకు ఆదేశించామని చెప్పారు.

- వివరాలు 3లో

విజయవాడ సీపీగా రాజశేఖర్‌బాబు

9 మంది ఐపీఎస్‌ అధికారుల బదిలీ

రాష్ట్రంలో తొమ్మిది మంది ఐపీఎస్‌ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఏపీ రోడ్‌ సేఫ్టీ అథారిటీ చైర్‌పర్సన్‌గా ఉన్న అంజనా సిన్హాకు ఏపీఎస్పీ డైరెక్టర్‌ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. విజయవాడ పోలీస్‌ కమిషనర్‌గా ఐజీ రాజశేఖర్‌బాబును నియమించింది.



2లో

తక్షణం బకాయిలు చెల్లించండి

- ఎస్సీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం హుకుం
- రూ. 180 కోట్లు వసూలుకు చర్యలు
- మంత్రి ఆదేశాలతో నోటీసులు

సాక్షి, అమరావతి: ఎన్నికల ముందు అరచేతిలో స్వర్గం చూపించిన టీడీపీ కూటమి.. అధికారంలోకి రాగానే కొరడా ఝుళిపిస్తోంది. దళితులు వారి కాళ్లపై వారు నిలబడే విధంగా ప్రోత్సహించడానికి వివిధ పథకాల ద్వారా ఇచ్చిన రుణ బకాయిలు తక్షణం చెల్లించాలని హుకుం జారీ చేసింది. లేదంటే రుణానికి ష్యూరిటీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల జీతాల నుంచి వాటిని వసూలు చేస్తామంటూ నోటీసులు జారీ చేసింది. నేషనల్‌ ఎస్సీ ఫైనాన్స్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ (ఎన్‌ఎస్‌ఎఫ్‌డీసీ), నేషనల్‌ సఫాయి కర్మచారీస్‌ ఫైనాన్స్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ (ఎన్‌ఎస్‌కేఎఫ్‌డీసీ) పథకాల ద్వారా గతంలో ఇచ్చిన రుణ బకాయిలను వసూలు చేయడంపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. సంక్షేమ శాఖ మంత్రి డోల బాలవీరాంజనేయస్వామి తొలిసారి నిర్వహించిన సమీక్ష సమావేశంలోనే బకాయిల వసూళ్లపై దృష్టిసారించాలంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ రెండు పథకాల ద్వారా సుమారు రూ.180 కోట్లు బకాయిలు ఉన్నాయని, మంత్రి ఆదేశాలతో వీటి వసూళ్లపై దృష్టి పెట్టి నోటీసులు జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రుణం తీసుకున్న వారు చెల్లించలేని స్థితిలో ఉంటే ష్యూరిటీగా ఉన్న వారి నుంచి వసూళ్లు చేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా పలు జిల్లాల ప్రభుత్వ ట్రెజరీలకు లేఖలు రాశారు. ఇలా ట్రెజరీ ఆఫీసులకు లేఖలు రాస్తుండటంపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఈ విధమైన వేధింపులు లేవని, అధికారంలోకి వచ్చి నెల కాకుండానే కూటమి ప్రభుత్వం దళితులపై ఈ విధంగా వేధింపులకు దిగడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. కోవిడ్‌ వంటి సంక్షోభాలను ఎదుర్కొని వ్యాపారులుగా నిలదొక్కుకోవడానికి ప్రయత్నం చేస్తుంటే ఇప్పుడు బకాయిల వసూళ్లకు దిగడాన్ని తప్పుపడుతున్నారు. కష్టాల్లో ఉన్న దళిత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఊతమివ్వాల్సిన ప్రభుత్వం ఈ విధంగా నోటీసులతో భయభ్రాంతులకు గురిచేయడాన్ని ఖండిస్తున్నారు. తక్షణం ప్రభుత్వం ఈ నోటీసులను ఉపసంహరించుకోవాలని, దళిత పారిశ్రామికవేత్తలను ఆదుకునే విధంగా ఉపశమన చర్యలు ప్రకటించాలని దళిత సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేస్తున్నారు.

ఒక్కరికే వందనం.. అందరికీ ఎగనామం!

'తల్లికి వందనం' పథకంపై కూటమి ప్రభుత్వం యూటర్న్

- ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికీ ఇస్తామని ఎన్నికల్లో హామీ
- జీవో నంబర్ 29లో ఒక్క తల్లికి మాత్రమే 'తల్లికి వందనం' అని స్పష్టీకరణ

'నేను హామీ ఇస్తున్నాను.. తల్లికి వందనం కింద సంవత్సరానికి ప్రతి ఒక్క బిడ్డకూ (విద్యార్థిని, విద్యార్థులు) 15 వేల రూపాయలు ఇచ్చే బాధ్యత నాదీ... ఒక్కరికే అనే నిబంధన లేదు.. ఇద్దరుంటే ఇద్దరికీ ఇస్తా.. ముగ్గురుంటే ముగ్గురికీ ఇస్తా.. నలుగురుంటే నలుగురికీ ఇస్తా.. మీ ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున ఇస్తా. ఈ లెక్కన నలుగురుంటే రూ.60 వేలు ఇస్తా' అని ఎన్నికలకు ముందు చంద్రబాబు ఊరూరా లక్షలాది మంది ప్రజల సమక్షంలో బహిరంగంగా మాట ఇచ్చారు. బాబుతో పాటు టీడీపీ నేతలంతా ఇంటింటా ఇవే మాటలు చెప్పారు. ఇలా మాయ మాటలు చెప్పి.. ఓట్లు వేయించుకుని గద్దెనెక్కాక నిస్సిగ్గుగా ప్లేటు మార్చారు. మరీ ఇంత దుర్మార్గమా.. అని ఎవరైనా చంద్రబాబును ప్రశ్నిస్తే దబాయించి నోరు మూయించడం ఆయన నైజం. సూపర్ సిక్స్‌లో మిగతా హామీలన్నింటిలో కోతలు.. దాటవేతలేనని బాబు వాలకం చెబుతోంది.

సూపర్ సిక్స్

- యువతకు 20 లక్షల ఉద్యోగాలు / నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం
- ప్రతి మహిళకి నెలకు రూ.1500 (19 సం॥ నుంచి 59 సం॥ వరకు)
- ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000 ఇస్తామంటూ సూపర్ సిక్స్‌లో చంద్రబాబు ఇచ్చిన హామీ

సాక్షి, అమరావతి: మాట మార్చడంలో డబుల్ పీహెచ్‌డీ చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరోసారి తన నైజాన్ని చూపించారు. 'తల్లికి వందనం' పేరిట ప్రతి విద్యార్థికీ రూ.15 వేలు ఇస్తామన్న అంశంపై మాట తప్పారు. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి.. ఒక్కరుంటే రూ.15 వేలు, ఇద్దరుంటే రూ.30 వేలు, ముగ్గురుంటే రూ.45 వేలు, నలుగురుంటే రూ.60 వేలు ఇస్తామని లక్షలాది మంది ప్రజల సమక్షంలో బహిరంగంగా ఇచ్చిన మాటను గాలికి వదిలేశారు. ఇప్పుడు ఈ పథకాన్ని చదువుకునే పిల్లల్లో ఒక ఇంట్లో ఒక్కరికే అమలు చేస్తామని ప్రకటించారు. ఆధార్ అనుసంధానం పేరుతో అనేక కొర్రీలు వేసి లబ్ధిదారులను తగ్గించే పనిలో ఉన్నారు. అందుకే ఏటా జూన్ నెలలో పాఠశాలలు తెరిచిన వెంటనే ఇవ్వాల్సిన పథకంపై కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడుస్తున్నా ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదు. బుధవారం జీవో నం.29 విడుదల చేసి.. పిల్లలతో సంబంధం లేకుండా ఒక్క తల్లికి మాత్రమే రూ.15 వేలు ఇస్తామని ప్రకటించారు. అంటే గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన 42.62 లక్షల మంది లబ్ధిదారుల కంటే తక్కువ మందికే ఇవ్వాలన్న యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. 'ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ 'తల్లికి వందనం' అమలు చేస్తాం. ఆ మొత్తం నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తాం. ఇంకా పిల్లలను కనండి పథకాలు అందుకోండి' అంటూ ఎన్నికల్లో చంద్రబాబు ప్రకటిస్తే.. ఇప్పుడు నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న నిమ్మల రామానాయుడు ఆ పథకం గురించి తనదైన శైలిలో 'నీకు 15 వేలు.. నీకు 15 వేలు.. నీకు 15 వేలు.. నీకు 15 వేలు..' అంటూ చిన్న పిల్లలను చూపిస్తూ ప్రచారం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. ఇన్ని ఆధారాలు ఉన్నా ఇప్పుడు 'వందనం ఒక్కరికే' అనడంపై తల్లులు మండి పడుతున్నారు.

కోటి మంది పిల్లల్లో భారీగా కోత

రైతులకు రుణమాఫీ చేస్తామని టీడీపీ 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి రాగానే అనేక కొర్రీలు వేసి లబ్ధి పొందే రైతులను తగ్గించడంతో పాటు రుణ మాఫీని సైతం భారీగా కుదించేశారు. ఇప్పుడు తల్లికి వందనం పైనా ఇలాగే ముందుకెళ్లాలని కూటమి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంత మంది ఉంటే అందరికీ తలో రూ.15 వేలు చొప్పున ఇస్తూ తల్లికి వందనం పథకం అమలు చేస్తామని చేసిన ప్రకటనకు విరుద్ధంగా ముందుకెళుతోంది. అందుకు అనుగుణంగానే జీవో నం.29లో జారీ చేసింది. పిల్లలు అందరికీ ఇస్తామన్న పథకాన్ని 'తల్లికి మాత్రమే రూ.15000' అని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అంటే రాష్ట్రంలో దాదాపు కోటి మందికి పైగా పిల్లలున్నారు. ఇందులోనూ లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు కసరత్తు చేస్తోంది. అందుకే ఆధార్‌తో లింక్ అయ్యి ఉన్న అన్ని ఆస్తుల వివరాలను తీసుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విధించిన నిబంధనలను కాకుండా మరింత కఠినంగా నిబంధనలు రూపొందిస్తోంది. గత ప్రభుత్వంలో ప్రతి బిడ్డా చదువుకునేందుకు బడికి వెళ్లడమే లక్ష్యంగా జగనన్న అమ్మఒడి పథకాన్ని అమలు చేసింది. అన్ని మేనేజ్‌మెంట్ల స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో చదివే పిల్లలను ప్రోత్సహించేందుకు వారి తల్లులకు ఏటా రూ.15 వేలు జమ చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా ఒకటి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు, కాలేజీల్లో చదివే పిల్లలకు మాత్రమే పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు సమాచారం. వీరిలోనూ వివిధ ఆదాయ మార్గాలను సాకుగా చూపి పిల్ల సంఖ్యను భారీగా తగ్గించే యోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే జరిగితే గతంలో అమ్మ ఒడి అందుకున్న 42.62 లక్షల మందిలో చాలా మంది ఈ పథకానికి దూరమవుతారు.

ఆ ప్రభుత్వమే ఉండి ఉంటే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కొనసాగుతూ ఉండిఉంటే ఈ పాటికే అమ్మ ఒడి, రైతు భరోసా, విద్యా దీవెన, వసతి దీవెన, మత్స్యకార భరోసా పథకాలు అమలై ఉండేవి. గత ఐదేళ్లలో ఈ పథకాలన్నీ చెప్పిన రోజు చెప్పినట్లు అర్హత గల లబ్ధిదారులందరికీ అందాయి. అర్హత ఉండీ కూడా ఏ కారణం వల్లనైనా లబ్ధి పొందని వారికి మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించి మరీ మేలు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి నిజంగా పిల్లలపై ప్రేమ ఉంటే జూన్ నెలలోనే తల్లికి వందనం (అమ్మ ఒడి) పథకాన్ని అమలు చేసి ఉండేది. ఈ పథకం లబ్ధిదారుల జాబితాలో ఎలా కోత పెట్టాలా.. అని నెల రోజులకు పైగా ఆలోచించి ఇప్పుడు తీరిగ్గా గైడ్‌లైన్స్ మాత్రమే జారీ చేసింది. పిల్లలందరికీ అని చెప్పి ఇప్పుడు ఒక్కరికే అంటూ ప్లేటు ఫిరాయించింది. అది కూడా ఎప్పుడిస్తారో చెప్పక పోవడం గమనార్హం.

మూడుసార్లు మాట మార్చిన కూటమి

చదువుతో సంబంధం లేకుండా ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ తల్లికి వందనం అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో ఎన్‌డీఏ కూటమి నాయకులు ప్రజలకు మాట ఇచ్చారు. 'స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఆర్థిక సాయం' అంటూ ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో హామీ ఇచ్చారు. తాజాగా ఇచ్చిన ఆదేశాల్లో ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే పిల్లలున్న తల్లికే ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. అంటే ఒకే అంశంపై మూడుసార్లు మాట మార్చారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలతో పాటు, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలు, కాలేజీలు, ప్రయివేట్ ఎయిడెడ్, ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్, జూనియర్ కాలేజీల్లో చదివే పిల్లలు గల తల్లులకు అమ్మఒడి పథకాన్ని అమలు చేసింది. కానీ ఇప్పుడు ఇచ్చిన ఆదేశాల్లో ఎక్కడా స్కూళ్లు, కాలేజీల ప్రస్తావన చేయలేదు. సర్వే పేరుతో ఇన్నాళ్లు కాలయాపన చేసి, అనంతరం తీరిగ్గా మార్గదర్శకాలు విడుదల చేస్తే తాము ఆర్థికంగా నష్టపోతామని పిల్లల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పిల్లల డేటా ఉన్నా కాలయాపన

స్కూళ్లలో చదివే విద్యార్థుల సంఖ్యపై రాష్ట్రాలు ఏటా 'యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్' (యూడైస్ ప్లస్) ద్వారా జిల్లాల వారీగా విద్యార్థుల సంఖ్యను కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తాయి. ఈ ఏడాది నుంచి విద్యార్థుల చేరికలు, బదిలీలు నేరుగా 'యూడైస్ ప్లస్' ద్వారానే చేయాలని విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. యూడైస్ ప్రకారం 2023–24 విద్యా సంవత్సరంలో ఒకటి నుంచి ఇంటర్ వరకు మొత్తం 82,29,858 మంది విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో చదువుతున్నారు. కొత్తగా చేరిన విద్యార్థుల సంఖ్య కూడా దీనికి జత చేయాలి. విద్యార్థుల చేరిక సమయంలోనే ఆధార్‌తో పాటు కుటుంబ నేపథ్యం, ఆర్థిక స్థాయి కూడా నమోదు చేస్తున్నారు. ఇదంతా ఆన్‌లైన్‌లో జరిగేదే. పైగా గతేడాది కూడా వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది పిల్లల వివరాలను ప్రభుత్వానికి అందించారు. ఈ వివరాలు ప్రభుత్వం వద్ద నూరు శాతం ఉన్నాయి. 2018–19 విద్యా సంవత్సరం విద్యార్థుల డేటా ఆధారంగా గత ప్రభుత్వం తొలి ఏడాది అమ్మ ఒడి పథకాన్ని అమలు చేసింది. 2020లోనూ ముందు సంవత్సరం విద్యార్థుల సంఖ్య (డేటా) ఆధారంగా పథకాన్ని అందించింది. ఇలా నాలుగు విద్యా సంవత్సరాల్లో ముగిసిన ఏడాది డేటా ఆధారంగా అమ్మ ఒడి జమ చేసింది. దీంతో పాటు 75 శాతం హాజరు శాతం తప్పనిసరి అన్న నిబంధన విధించినా, పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదన్న మానవతా దృష్టితో హాజరు సరిపడినంత లేకున్నా ఇతర అర్హతలు గల ప్రతి తల్లికీ అమ్మఒడి అమలు చేశారు. పది, ఇంటర్ ఫెయిల్ అయ్యి, తిరిగి ప్రవేశం పొందిన విద్యార్థులు, మధ్యలో స్కూల్లో చేరిన అర్హత గల పిల్లలకు కూడా పథకాన్ని అమలు చేశారు. కానీ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల సంఖ్యను సర్వే చేసి తేల్చాలని నిర్ణయించింది. ప్రభుత్వం వద్ద పూర్తి డేటా ఉన్నా కేవలం పథకాన్ని ఈ విద్యా సంవత్సరంలో అమలు చేయకుండా దాట వేయడానికి మార్గాలు అన్వేషిస్తున్నట్టు తెలుస్తోంది.

ఆశ పెట్టి.. మాట మార్చకూడదు



మాకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఒకరు ఈపూరు యూపీ పాఠశాలలో, మరొకరు అనంతవరం జెడ్పీ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. తల్లిదండ్రులు చనిపోవడంతో పదో తరగతి చదువుతున్న మా మేనకోడలిని కూడా మేమే పెంచుతున్నాం. గత ప్రభుత్వంలో మా బిడ్డలతోపాటు, మా మేనకోడలికి సైతం మా బ్యాంక్ ఖాతాలో అమ్మ ఒడి సొమ్ము జమైంది. ప్రస్తుత ప్రభుత్వం తల్లికి వందనం కింద ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంత మందికి రూ.15 వేల చొప్పున అందజేస్తామన్న హామీని నిలుపుకోవాలి. అధికారంలోకి వచ్చాక టీడీపీ హామీని విస్మరించడం మంచిది కాదు. మాలాంటి కుటుంబాలను ఆశ పెట్టి.. ఇలా ఏమార్చి కష్టాల్లోకి నెట్టడం తగదు. – బూసే జోత్స్న, ఈపూరు, కొల్లూరు మండలం, బాపట్ల జిల్లా

ఏం చెప్పారు.. ఏం చేస్తున్నారు?



మాకు నలుగురు పిల్లలున్నారు. ప్రభుత్వం 'తల్లికి వదనం' ద్వారా సాయం చేస్తుందని అందరినీ ప్రైవేట్ స్కూళ్లకు పంపిస్తున్నాం. వారి ఫీజులు, పుస్తకాలు, డ్రస్సులు, బూట్లు ఇలా అన్నీ కలిపి ఒక్కొక్కరికి రూ.20 వేల దాకా ఖర్చు అవుతుంది. బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున తల్లికి వందనం పథకం కింద అందిస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు ఇంట్లో ఎంత మంది పిల్లలు పాఠశాలకు వెళితే వారందరికీ రూ.15 వేల చొప్పున ఇవ్వాలి. ఈ మొత్తాన్ని త్వరగా మంజూరు చేయాలి. ఇప్పటికే ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు అడుగుతున్నారు. ఇప్పుడు ఈ పథకంలో కొర్రీలు వేయాలని చూడటం మంచిది కాదు. ఏం చెప్పారు.. ఏం చేస్తున్నారు..? – షాఫియా భాను, హస్నాబాద్, హిందూపురం, శ్రీసత్యసాయి జిల్లా

మరీ ఇంత మోసమా!?



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం కింద ప్రతి సంవత్సరం చెప్పిన తేదీన బ్యాంకు ఖాతాలో డబ్బు జమయ్యేది. ప్రస్తుత ప్రభుత్వంలో ఇంకా డబ్బులు జమ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ పథకం అర్హతకు కొత్త నిబంధనలు పెట్టడం ఆందోళనకరంగా ఉంది. నాకు ముగ్గురు సంతానం. పెద్ద కుమారుడు ఐదో తరగతి, రెండో కొడుకు నాలుగో తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. కూతురు అంగన్‌వాడీ చదువు పూర్తి చేసుకుంది. పిల్లలందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.45 వేలు వస్తుందని ఆశించాం. కూతుర్ని ప్రయివేటు స్కూల్లో చేరుద్దామనుకున్నాం. హామీ ఇచ్చి మరీ ఇంత మోసం చేస్తారనుకోలేదు. – ఎం.పూజిత నాగలక్ష్మి, ఎనికేపాడు, విజయవాడ రూరల్ మండలం

రూ.60 వేలు వస్తాయని ఎదురు చూస్తున్నాం



మేము విశాఖ జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది దరి 31 కాలనీలో నివాసం ఉంటున్నాం. మాకు నలుగురు పిల్లలు. పెద్దబ్బాయి రుషిత్ సింగ్ 10వ తరగతి, రెండవ అబ్బాయి సౌమిత్రి సింగ్ 6వ తరగతి, మూడవ అబ్బాయి హేమంత్ సింగ్ మూడవ తరగతి, నాలుగవ అబ్బాయి ప్రకృత్ సింగ్ నర్సరీ చదువుతున్నాడు. గతంలో ముగ్గురు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో, ఒక అబ్బాయిని ప్రైవేట్ పాఠశాలలో చదివించే వాళ్లం. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రతీ విద్యార్థికీ తల్లికి వందనం పథకం వర్తింపజేస్తామని చెప్పడంతో నలుగురినీ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించాం. పాఠశాల యాజమాన్యాలు ఫీజుల కోసం మాపై ఒత్తిడి తెస్తున్నాయి. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు తల్లికి వందనం పథకం కింద రూ.60 వేలు ఇవ్వాలి. – లక్ష్మీ కౌర్

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపండి

అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బి.వెంకట్

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ మేరకు ప్రధాని మోదీపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. గురువారం ఏపీ, తెలంగాణ భవన్‌లో వెంకట్ విలేకరులతో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా చంద్రబాబు బాధ్యత తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఏపీ, తెలంగాణ విభజన అంశాలకు ప్రాధాన్యత కల్పించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాలకు బడ్జెట్ కేటాయింపులను బట్టి తమ ఉద్యమ కార్యాచరణ ఉంటుందని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ప్రభుత్వం వెంటనే పింఛన్లు పెంచాలని, ఆరు గ్యారంటీలను అమలు చేయాలని వెంకట్ డిమాండ్ చేశారు.

విజిలెన్స్ డీజీగా హరీశ్‌కుమార్ గుప్తా

సాక్షి, అమరావతి: సీనియర్ ఐపీఎస్ అధికారులు ఇద్దరిని ప్రభుత్వం బదిలీ చేసింది. హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న హరీశ్ కుమార్ గుప్తాను విజిలెన్స్–ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా నియమించింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) విజిలెన్స్ విభాగం ముఖ్య కార్యదర్శిగా కూడా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇక ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న అదనపు డీజీ కుమార్ విశ్వజిత్‌ను హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

30 ఏళ్ల లీజైతే.. ఈఓఏ నుంచి మినహాయింపు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలను 30 ఏళ్ల లీజు పరిమితితో నిర్వహిస్తే సొంత భవనాలతో సమానంగా గుర్తించొచ్చని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఫలితంగా ఏటా వర్సిటీల నుంచి గుర్తింపు కోసం సమర్పించే ఎక్స్‌టెన్షన్ ఆఫ్ అప్రూవల్స్(ఈఓఏ) తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. 30 ఏళ్లు లీజుతో నడిచే విద్యా సంస్థలకు ఈఓఏ లేకుండా వర్సిటీల గుర్తింపు దక్కనుంది. ఈ మేరకు ఉన్నత విద్య కార్యదర్శి సౌరబ్ గౌర్ గురువారం ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో 5–10 ఏళ్ల లీజు పరిమితి ఉండే కళాశాలలకు ఏటా ఈఓఏ తీసుకోవాల్సి వచ్చేది.

పలువురు ఐఏఎస్‌ల బదిలీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. మరికొంత మంది అధికారులకు పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. భూ పరిపాలన చీఫ్ కమిషనర్‌గా జి. జయలక్ష్మిని నియమించింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ప్రత్యేక సీఎస్‌గా ఆర్‌పీ సిసోడియా, అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక సీఎస్‌గా జి.అనంతరాము నియమితులయ్యారు. సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా హిమాన్షు శుక్లాను నియమించింది. ఆర్థిక శాఖ (సీటీ) కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న గిరిజా శంకర్‌ను ఆ బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఆ బాధ్యతలను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి అప్పగించింది. వ్యవసాయ శాఖ డైరెక్టర్ హరికిరణ్‌ను బదిలీ చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ బాధ్యతల నుంచి అజయ్ జైన్‌ను రిలీవ్ చేసింది.

ఐఏఎస్‌ల బదిలీలు, పోస్టింగ్‌లు ఇలా..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
జి. అనంతరాము	బీసీ సంక్షేమ శాఖ ప్రత్యేక సీఎస్	అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖ ప్రత్యేక సీఎస్
ఆర్‌పీ సిసోడియా	ఏపీహెచ్‌ఆర్‌డీఐ డైరెక్టర్ జనరల్	స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ప్రత్యేక సీఎస్
జి.జయలక్ష్మి	మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి	భూ పరిపాలన చీఫ్ కమిషనర్
కాంతిలాల్ దండే	గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి	రవాణా, రహదారులు – భవనాల ముఖ్య కార్యదర్శి
ఎస్. సురేశ్ కుమార్	పాఠశాల విద్య కమిషనర్	పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి, గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు
సౌరభ్ గౌర్	ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి	ఉన్నత విద్యతో పాటు ఐటీ, ఆర్టీజీఎస్ పూర్తి అదనపు బాధ్యతలు
ఎన్.యువరాజ్	పరిశ్రమలు, వాణిజ్య కార్యదర్శి	పరిశ్రమలు, వాణిజ్యంతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్ బాధ్యతలు
హర్షవర్ధన్	సాంఘిక సంక్షేమ కార్యదర్శి	మైనారిటీ సంక్షేమ కార్యదర్శి
పి. భాస్కర్	కాలేజీ విద్య కమిషనర్	బీసీ సంక్షేమ కార్యదర్శితో పాటు ఈడబ్ల్యూఎస్ కార్యదర్శి పూర్తి అదనపు బాధ్యతలు
కె. కన్నబాబు	పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్	సాంఘిక సంక్షేమ కార్యదర్శితో పాటు గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పూర్తి అదనపు బాధ్యతలు
వినయ్ చంద్	ఆర్థిక శాఖ కార్యదర్శి	పర్యాటక శాఖ కార్యదర్శి
వివేక్ యాదవ్	వెయిటింగ్	యువజన సర్వీసులు, క్రీడల శాఖ కార్యదర్శి
ఎ.సూర్య కుమారి	మత్స్య శాఖ కమిషనర్	మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి
సి. శ్రీధర్	సహాయ, పునరావాసం కమిషనర్	పరిశ్రమల శాఖ డైరెక్టర్
జె.నివాస్	వెయిటింగ్	ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి
వి.విజయ రామరాజు	వెయిటింగ్	పాఠశాల విద్య డైరెక్టర్
హిమాన్షు శుక్లా	వెయిటింగ్	సమాచార, పౌర సంబంధాల డైరెక్టర్
ఎస్.ఢిల్లీరావు	వెయిటింగ్	వ్యవసాయ శాఖ డైరెక్టర్

9 మంది ఐపీఎస్ అధికారుల బదిలీ

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
అంజనా సిన్హా	చైర్మన్, ఏపీ రోడ్ సేఫ్టీ అథారిటీ	డీజీ, ఏపీఎస్పీ(అదనపు బాధ్యతలు)
మాదిరెడ్డి ప్రతాప్	వెయిటింగ్	డీజీ, విపత్తుల స్పందన దళం- అగ్నిమాపక శాఖ
సీహెచ్.శ్రీకాంత్	ఐజీ, ఆక్టోపస్	ఐజీ, (శాంతి–భద్రతలు)
ఎస్.వి. రాజశేఖర బాబు	ఐజీ (శాంతి–భద్రతలు)	పోలీస్ కమిషనర్, విజయవాడ
పీహెచ్‌డీ రామకృష్ణ	పోలీస్ కమిషనర్, విజయవాడ	ఐజీ (ప్రొవిజన్స్, లాజిస్టిక్స్) (పోలీస్ నియామక మండలి చైర్మన్‌గా అదనపు బాధ్యతలు)
గోపినాథ్ జెట్టి	డీఐజీ, గ్రేహౌండ్స్	డీఐజీ, విశాఖపట్నం (తీరప్రాంత భద్రతా విభాగం డీఐజీగా అదనపు బాధ్యతలు)
విశాల్ గున్ని	డీఐజీ, విశాఖపట్నం	డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశం
కోయా ప్రవీణ్	డీఐజీ, గ్రేహౌండ్స్	డీఐజీ, కర్నూలు రేంజ్
సీహెచ్. విజయరావు	డీఐజీ, కర్నూలు రేంజ్	డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశం

సూపర్ సిక్స్ కాదిది.. సూపర్ మోసం

- ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామనలేదా?
- ఇప్పుడు కేవలం ఒక్కరికే ఇస్తామనడం తల్లికి వందనమా.. తల్లికి మోసమా?
- సీఎం చంద్రబాబు, కూటమి నేతలను ప్రశ్నించిన మాజీ మంత్రి అంబటి రాంబాబు
- కష్టమైనా ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నిలబెట్టుకున్న మొనగాడు వైఎస్ జగన్
- ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని తుంగలో తొక్కిన మోసగాడు చంద్రబాబు
- బాబు మోసాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలి



సాక్షి, అమరావతి : పిల్లలను బడులకు పంపించడానికి పేదరికం అడ్డు కాకూడదని, బడి ఈడు పిల్లలు పనులకు పోకూడదన్న మంచి సంకల్పంతో గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన అమ్మఒడి పథకాన్ని ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం అపహాస్యం చేస్తూ తల్లిదండ్రులను మోసగిస్తోందని మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. చదువుకునే పిల్లలున్న తల్లులకు ఏటా రూ.15 వేలు ఇవ్వడం ద్వారా పేదరికంలో ఉన్న వాళ్లకు వైఎస్ జగన్ మేలు చేశారని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడా ఏ ముఖ్యమంత్రి, ఏ నాయకుడు చేయనటువంటి వినూత్న ఆలోచనను చేసిన నేత ఒక్క జగన్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఈ ఒక్క పథకానికే ఏకంగా రూ.26 వేల కోట్లు తల్లుల ఖాతాల్లోకి జమ చేశారన్నారు. ఐదేళ్ల తమ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన అమ్మఒడి పథకాన్ని తెలుగుదేశం కూటమి కాపీ కొట్టడమేకాక, మాట నిలుపుకోలేదని ధ్వజమెత్తారు. 'ఇంటిలో ఎంత మంది చదువుకున్నా జగన్ ఒక్కరికే రూ.15 వేలు ఇస్తున్నారు. మమ్మల్ని అధికారంలోకి తీసుకొస్తే ఒకరైతే రూ.15 వేలు, ఇద్దరుంటే రూ.30 వేలు, ముగ్గురుంటే రూ.45 వేలు, నలుగురు పిల్లలుంటే రూ.60 వేలు అందజేస్తామని ప్రకటిస్తే ప్రజలు ఆకర్షితులై ఓట్లేసి గెలిపించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సిన బాధ్యత చంద్రబాబునాయుడికి ఉందా? లేదా?' అని నిలదీశారు. ఇదే విషయాన్ని ప్రతి బహిరంగ సభలో కూడా చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్‌తో పాటు కూటమి నేతలంతా ప్రచారం చేశారని చెప్పారు. వారి ప్రచారానికి సంబంధించిన వీడియోలను మీడియా సమావేశంలో ప్రదర్శించారు.

తల్లికి వందనం కాదు.. మోసం

తల్లికి వందనం పథకానికి సంబంధించి కూటమి ప్రభుత్వం జారీ చేసిన జీవో 29ని చదివితే చాలా అనుమానాలు కలుగుతున్నాయని అంబటి అన్నారు. ఈ జీవో ప్రకారం ప్రతి ఏడాది తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తామని ఉందని చెప్పారు. ఎంత మంది పిల్లలను స్కూల్‌కి పంపినా రూ.15 వేలు మాత్రమే ఇస్తామని దాని అర్థం అన్నారు. ఇది సూపర్ సిక్స్ కాదని.. సూపర్ మోసమని అభివర్ణించారు. ఇది తల్లికి వందనం కాదని.. తల్లికి మోసమని నిప్పులు చెరిగారు. ప్రతి వాగ్దానాన్ని నిలబెట్టుకున్న మొనగాడు జగన్ అయితే, ప్రతి వాగ్దానాన్ని తుంగలో తొక్కిన మోసగాడు చంద్రబాబు అని చెప్పారు. బాబు మోసంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ డబ్బులు ఎప్పుడు వేస్తారు?

జగన్ వద్దని, చంద్రబాబే కావాలని ఓట్లేసిన తల్లులు, కుటుంబాలు తాము ఎంత దారుణమైన మోసాలు చేసే వ్యక్తికి ఓట్లేశామో గుర్తించాలని అంబటి సూచించారు. ఇదే జగన్ ఉన్నట్లయితే జూన్ ఆఖరుకు ప్రతి తల్లి ఖాతాలో అమ్మఒడి జమ అయి ఉండేదని, ఇవాళ జూలై వచ్చినా ఆ డబ్బులు రాలేదన్నారు. ఈ డబ్బులు ఎప్పుడు వేస్తారో చెప్పాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోను మార్చి ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ రూ.15 వేల చొప్పున డబ్బులు ఇచ్చి తీరాల్సిందేనన్నారు. వాగ్దానాలు నెరవేర్చకపోతే వైఎస్సార్‌సీపీ మీ వెంట పడుతుందని హెచ్చరించారు. ఆర్థిక పరిస్థితి బాగోలేదని ఇప్పుడు చంద్రబాబు చెప్పడం దారుణం అని, ఆ విషయం హామీలు ఇచ్చే ముందు తెలియదా అని నిలదీశారు. వైఎస్ జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుని ఉంటే బావుండేదని రాష్ట్ర ప్రజలు అనుకునే రోజులు ప్రారంభమయ్యాయన్నారు.

స్థానిక విద్యార్థులకే వైద్య కళాశాలల్లో సీట్లు!

- నాన్ లోకల్ విధానానికి స్వస్తి
- 2014కు ముందు ఏర్పాటైన కళాశాలల్లోనే అవకాశం
- రాష్ట్ర విభజనకు పదేళ్లు పూర్తవ్వడంతో ప్రవేశాల నిబంధనలకు సవరణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2014కు ముందు ఏర్పాటైన వైద్య కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఏపీ స్థానిక (లోకల్) విద్యార్థులకే ఎంబీబీఎస్ సీట్లు లభించనున్నాయి. ఈ మేరకు వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియలో మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం.. ఇప్పటివరకు 2014కు ముందు ఏర్పాటైన కళాశాలల్లో కన్వీనర్ కోటా ఎంబీబీఎస్, పీజీ సీట్లలో 85 శాతం స్థానిక, 15 శాతం స్థానికేతర విద్యార్థులకు కేటాయించేవారు. 15 శాతం స్థానికేతర కోటా సీట్లలో తెలంగాణ విద్యార్థులు కూడా సీట్లు పొందుతూ వచ్చారు. పునర్విభజన చట్టం ప్రకారం ఉమ్మడి ఏపీ విడిపోయి పదేళ్లు ముగియడంతో స్థానికేతర విధానానికి స్వస్తి పలుకుతున్నారు. ఉత్తర్వులు ప్రభుత్వం నుంచి వెలువడాల్సి ఉంది. స్థానికేతర కోటాలో ఏటా 600 చొప్పున పదేళ్లలో ఆరు వేల ఎంబీబీఎస్ సీట్లను తెలంగాణకు కేటాయించారనేది ఒక అంచనా. కాగా 2014 అనంతరం ఏర్పాటైన కళాశాలల్లో స్థానికేతర కోటాను గత ప్రభుత్వం హయాంలోనే రద్దు చేశారు.

తొలగనున్న రాష్ట్ర స్థాయి హోదా..

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన సమయంలో దానికి అనుబంధంగా వైద్య కళాశాల ఉండాలనే నిబంధనతో విజయవాడలో సిద్దార్థ వైద్య, దంత కళాశాలలను రాష్ట్ర కళాశాలలుగా మార్చారు. అప్పటి నుంచి కోస్తా, తెలంగాణ, సీమ విద్యార్థులకు 42:36:22 నిష్పత్తిలో ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ సీట్లను కేటాయిస్తూ వస్తున్నారు. తెలంగాణ వేరుపడి పదేళ్లవడం, రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం.. ఏ భూభాగంలో ఉన్న కళాశాలల్లో ఆ స్థానిక విద్యార్థులకే సీట్లు కేటాయించాలనే నిబంధనల ప్రకారం ఈ కళాశాలలకు రాష్ట్ర స్థాయి హోదా తొలగింపునకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రస్తుతం సిద్దార్థ వైద్య కళాశాలలో 175 ఎంబీబీఎస్ సీట్లు ఉండగా 15 శాతం ఆల్ ఇండియాకు పోగా 149 సీట్లు ఉంటాయి. వీటిలో గత విద్యా సంవత్సరం వరకూ 54 సీట్లు ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ), 47 సీట్లు ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ), 28 వేంకటేశ్వర యూనివర్సిటీ (ఎస్వీయూ), 20 సీట్లు అన్ రిజర్వ్‌డ్ కింద భర్తీ చేస్తున్నారు. రాష్ట్ర స్థాయి హోదా రద్దుతో ఓయూ, ఎస్వీయూ కోటా రద్దు కానుంది.

తిరుమల క్యూలో ప్రాంక్ వీడియో

▶ మొదటి పేజీ తరువాయి

మొబైల్‌ఫోన్‌తో దర్శన క్యూలోకి ప్రవేశించాడు. నారాయణగిరి షెడ్లలో వేచి ఉన్న భక్తులతో తాళాలు తీస్తున్నట్లు నటించాడు. వాసన్‌ను చూసిన కంపార్టుమెంటులోని భక్తులు టీటీడీ ఉద్యోగిగా భావించి గేట్లు తీస్తారేమోనన్న భావనతో ఒక్కసారిగా పైకిలేవడంతో టీటీఎఫ్ వాసన్ వెకిలి నవ్వులు నవ్వుతూ పరిగెడుతూ రావడాన్ని తన మిత్రులు ఫోన్‌లో చిత్రీకరించారు. ఈ వీడియోలను టీటీఎఫ్ ఫ్యామిలీ అనే తన ఇన్‌స్టాగ్రాం పేజీలో వాసన్ పోస్ట్‌చేయడంతో తమిళనాడులో ఇది వైరల్ అయింది. దర్శన క్యూల్లో భక్తులపై ప్రాంక్ వీడియోల చిత్రీకరణపై తమిళనాడులో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆకతాయి చేష్టలు చేసిన వాసన్‌ను అరెస్టుచేయాలని సామాజిక మాధ్యమాల్లో భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

విచారణకు టీటీడీ విజిలెన్స్ ఆదేశాలు..

ఈ ఘటనపై టీటీడీ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రాంక్ వీడియోలు తీయడం హేయమైన చర్య అని ప్రకటనలో ఖండించింది. వీడియోలు చిత్రీకరించిన వారిపై చర్యలు తీసుకుంటామంది. నారాయణగిరి షెడ్స్ దాటి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోకి ప్రవేశించకముందే భక్తుల నుండి మొబైల్ ఫోన్లు డిపాజిట్ చేసుకుంటారని టీటీడీ తెలిపింది. కానీ, ఒకరిద్దరు ఆకతాయిల చేష్టలతో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని టీటీడీ ఆ ప్రకటనలో పేర్కొంది.

క్లుప్తంగా...

ఇన్‌చార్జి వీసీగా డాక్టర్ నరసింహం

సాక్షి, అమరావతి: వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీగా డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ నరసింహాన్ని నియమిస్తున్నట్లు వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శాశ్వత వీసీని నియమించే వరకూ నరసింహం ఇన్‌చార్జి వీసీగా కొనసాగుతారని పేర్కొన్నారు.

పోలీసు బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్



మంత్రి ఫరూక్‌ను కలిసిన మృతుడు అబ్దుల్లా భార్య నదీమ, కుమారుడు, కుమార్తె

సాక్షి, అమరావతి: అనంతపురంలో పోలీసుల వేధింపులకు గురై ఆత్మహత్యకు పాల్పడిన అబ్దుల్లా కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ హామీ ఇచ్చారు. రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ నేతృత్వంలో అబ్దుల్లా భార్య నదీమ, కొడుకు మొహమ్మద్ అయాన్, కూతురు సమీన గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రిని కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. మృతుడి భార్య నసీమా మాట్లాడుతూ దోషులను శిక్షించి, తమ కుటుంబ జీవనోపాధికి ఉద్యోగాన్ని, పిల్లలు చదువుకు తోడ్పాటును అందజేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి మైనార్టీ సంస్థలో తాత్కాలిక ఉపాధి కల్పిస్తామన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్

సాక్షి, అమరావతి: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పోస్టుల నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలుపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారులతో గురువారం మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై అధికారులతో మంత్రి చర్చించారు. వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలని, ఉద్యోగుల సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.

సమస్యలు మెయిల్ చేయండి

విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్

సాక్షి, అమరావతి: సమస్య ఏదైనా, సాయం కావాలన్నా ఇక నుంచి తన పర్సనల్ మెయిల్ ఐడీ hello.lokesh@ap.gov.inకి పంపాలని విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సూచించారు. రాష్ట్రం నలుమూలల నుంచి తమ సమస్యలు పరిష్కరించాలంటూ పంపుతున్న మెసేజ్‌ల కారణంగా తన వాట్సాప్‌ను మెటా బ్లాక్ చేసిందన్నారు. వాట్సాప్ బ్లాక్ కావడం, తరచూ ఇదే సమస్య ఉత్పన్నం అవుతుండటంతో తన పర్సనల్ మెయిల్ ఐడీకి ప్రజలు తమ వినతులు, సమస్యలు పంపించాలని బుధవారం ఓ ప్రకటనలో లోకేశ్ కోరారు.

స్థానిక సంస్థలకు రూ.250 కోట్లు విడుదల

మంత్రి పయ్యావుల కేశవ్

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య వ్యవహారాల శాఖల మంత్రిగా పయ్యావుల కేశవ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలోని వివిధ స్థానిక సంస్థలకు మొదటి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.250 కోట్లను విడుదల చేస్తూ ఆయన తొలి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వివిధ గ్రామ పంచాయతీలకు మొదటి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసినట్లు చెప్పారు.

సహకార వ్యవస్థ సమగ్రాభివృద్ధే లక్ష్యం

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా సహకార వ్యవస్థను సమగ్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు. గురువారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో సహకార సమాచారం పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. సహకార వ్యవస్థను ప్రక్షాళన చేసి సహకార సేవలను రైతులకు చేరువ చేసేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు. ఏపీ స్టేట్ కోపరేటివ్ యూనియన్ ఆధ్వర్యంలో సహకార సమాచారం మాస పత్రికను ప్రారంభించడం శుభ పరిణామమన్నారు. రాష్ట్ర సహకార యూనియన్ ఆధ్వర్యంలో ఆరు నెలల 'డిప్లమో ఇన్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్' కోర్సును రాష్ట్రంలోని నాలుగు సహకార శిక్షణ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ సభ్యులు వివరించారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిమూలం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎం రామ్మోహన రావు, కార్యదర్శి సీహెచ్‌వీ రామారావు, కోశాధికారి సోమేశ్వరరావు, రామదాసు శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు ఉన్నారు.

కోవిడ్ సమయంలో విశాఖలోనే ఉన్నా

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పారు. దీంతో విస్తుపోయిన మెడ్‌టెక్ జోన్ ప్రతినిధులు 'హుద్ హుద్ సమయంలో ఉన్నారు' అని చెప్పారు. వెంటనే చంద్రబాబు సర్దుకుని అవును హుద్‌హుద్ సమయంలో ఉన్నానని అన్నారు. తాను గత ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత మెడ్‌టెక్ జోన్‌కి చాలా ఇబ్బందులొచ్చాయని, ఆటంకాలు సృష్టించారని చెప్పారు. జితేంద్ర శర్మ దీన్ని కాపాడారన్నారు. గత ప్రభుత్వం దీనికి ఎలాంటి సహకారం అందించలేదని అన్నారు. తాను మొదటిసారి సీఎం అయ్యాక ఐటీ పార్క్ క్రియేట్ చేశానని, రెండోసారి సీఎం అయ్యాక బయోటెక్నాలజీ పార్క్ క్రియేట్ చేశానని చెప్పుకొన్నారు. మూడోసారి సీఎం అయ్యాక 275 ఎకరాల్లో మెడికల్ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరింగ్ సిస్టమ్ క్రియేట్ చేశానన్నారు. ఇది రూ. 10 వేల కోట్ల టర్నోవర్ సాధించిందని చెప్పారు. ఈ మూడూ చాలా సంతృప్తినిచ్చాయని అన్నారు. మెడ్‌టెక్ జోన్ త్వరలోనే గ్లోబల్ హబ్‌గా మారబోతోందని, దానికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. కోవిడ్ సమయంలో 20 రాష్ట్రాల వారు ఇక్కడ తయారైన సామాగ్రినే వినియోగించినప్పటికీ ఏపీలో గత ప్రభుత్వం వినియోగించలేదని అన్నారు. ఆరోగ్యానికి సంబంధించి పబ్లిక్ పాలసీలు తేవాల్సిన అవసరం ఉందని తెలిపారు. హాస్పిటల్స్, యూనివర్సిటీలు, డయాగ్నసిస్ సెంటర్స్ భాగస్వామ్యంతో నూతన ఆలోచనల్ని ఆవిష్కరించాలని చెప్పారు. ట్రిపుల్ ఐటీల్ని తానే ప్రారంభించానని చెప్పారు. డ్రోన్లతో దోమల్ని నాశనం చేసే టెక్నాలజీని తానే తీసుకొచ్చానన్నారు. వాటిని గుర్తించి, డ్రోన్లతోనే చంపించేసి, దోమలరహిత రాష్ట్రంగా ఏపీని చేస్తానని ప్రకటించారు. లండన్, సింగపూర్‌ను మోడల్‌గా తీసుకొని విశాఖను ఫిన్‌టెక్ హబ్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు.



భోగాపురం విమానాశ్రయంలో సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, అధికారులు

పీ4 విధానంలో భాగస్వామ్యమవ్వండి

రాష్ట్ర అభివృద్ధి కోసం పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్ (పీ4) విధానంలో భాగస్వామ్యం కావాలని సీఐఐ ప్రతినిధులను చంద్రబాబు కోరారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించే క్రమంలో పరిశ్రమలకు మెరుగైన రాయితీలు కల్పిస్తామన్నారు. సంస్కరణలు రాజకీయంగా నష్టం చేకూర్చినా ప్రజలకు మంచి చేస్తాయన్నారు. ఆర్థికంగా దేశం నంబర్ వన్‌గా ఉన్నప్పుడు ప్రజలు పేదరికంలో మగ్గుతుండటం దేశానికి మంచిది కాదన్నారు. 4, 5 నెలల్లో సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీ అమలు చేసే తొలి కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సీఐఐ 2వ యూనివర్సిటీని అమరావతిలో ప్రారంభించాలని కోరారు.

పోలవరం ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేం

అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం దార్లపూడి వద్ద పోలవరం ఎడమ కాలువ అక్విడెక్టు నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేమని అన్నారు. తన హయాంలో దార్లపూడిలో కాలువ పనులు 70% జరిగితే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2 శాతమే జరిగాయన్నారు. గత ప్రభుత్వంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారన్నారు. రాష్ట్రంలో ఒక భూతం ఉందని, దాన్ని పూర్తిగా కంట్రోల్ చేసే భూత వైద్యులు ప్రజలేనంటూ వ్యాఖ్యలు చేశారు. వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలో స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే ప్రయత్నాలు జరిగితే తానే అడ్డుకున్నానని అన్నారు.

వలంటీర్లతో పనేముంది?

మహారాణిపేట (విశాఖ దక్షిణ): రాష్ట్రంలో వలంటీర్లతో పనేముందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఆయన గురువారం రాత్రి అధికారులు, ప్రజాప్రతినిధులతో విశాఖ ఎయిర్‌పోర్టులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వలంటీర్ల వ్యవస్థను ప్రస్తావించారు. వలంటీర్లు లేకపోతే పింఛన్లు ఇవ్వలేరా అంటూ ప్రశ్నించారు. తొలిసారిగా సచివాలయ ఉద్యోగులతో అద్భుతంగా పింఛన్లు పంపిణీ చేశామని చెప్పారు. ఇక వలంటీర్లతో పనేముందంటూ వ్యాఖ్యానించారు. విశాఖ నుంచి భీమిలి మీదుగా భోగాపురం వరకు బీచ్ కారిడార్ అభివృద్ధి చేయాలని, ఈ బీచ్‌రోడ్‌ని శ్రీకాకుళం వరకూ వెయ్యాలని సూచించారు.

దేశవ్యాప్త నిరసనతో దాడులపై వెనక్కి

టీడీపీ మూకలు విశాఖలోని డెక్కన్ క్రానికల్ పత్రిక కార్యాలయంపై దాడి చేయడంపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వచ్చింది. రాష్ట్రంలో టీడీపీ దాడులను దేశం మొత్తం ఖండించడంతో సీఎం చంద్రబాబు వెనక్కితగ్గేలా మాట్లాడారు. ఇకపై దాడులు, ఆఫీసుల వద్ద నిరసనలు అవసరం లేదనీ, చట్ట ప్రకారం ముందుకెళ్దామని పార్టీ శ్రేణులకు సూచించారు.

ఆ 500 ఎకరాలు జీఎంఆర్‌కే!

సాక్షి ప్రతినిధి, విజయనగరం: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ సంస్థ జీఎంఆర్‌కు మరో 500 ఎకరాలు ఇవ్వడానికి సిద్ధమని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆ భూమిని ఏ విధంగా ఉపయోగిస్తారో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆ సంస్థ ప్రతినిధులకు సూచించారు. ఆయన గురువారం అనకాపల్లి నుంచి హెలికాప్టర్‌లో భోగాపురం విమానాశ్రయానికి వచ్చి, నిర్మాణంలో ఉన్న రన్‌వేపై దిగారు. ఈ విమానాశ్రయంతో విశాఖపట్నం, విజయనగరం కలిసిపోతాయని, తర్వాత శ్రీకాకుళం జిల్లా కూడా కలుస్తుందని మీడియాతో చెప్పారు. ఈ విమానాశ్రయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 2015 మే 20న తలపెట్టిందని, తర్వాత వీళ్లు (వైఎస్సార్‌సీపీని ఉద్దేశించి) వచ్చి ప్రాజెక్టును అడ్డుకునే పరిస్థితి తెచ్చారని వ్యాఖ్యానించారు. 500 ఎకరాలపై లేనిపోని సమస్యలు సృష్టించారన్నారు. కుప్పం, దగదర్తి, నాగార్జునసాగర్, మూలపేట వద్ద విమానాశ్రయాలు నిర్మించాలని ఆలోచిస్తున్నామని చెప్పారు.

ప్రజాప్రతినిధులకు చేదు అనుభవం

మెడ్‌టెక్ జోన్ గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల పరిధిలో ఉంది. అయినా గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కూడా అయిన పల్లా శ్రీనివాస్‌కు, పెందుర్తి జనసేన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబుని అక్కడి కార్యక్రమంలో వేదిక పైకి ఆహ్వానించలేదు. దీంతో వారిద్దరూ అసహనం వ్యక్తం చేశారు.

ఫర్నిచర్ కొనుగోలుపై నిషేధం ఉన్నా...
ఆగని మంత్రులు

- 2026, మే నెలాఖరు వరకు ఫర్నిచర్ కొనుగోలుకు అనుమతి లేదు
- ఆస్పత్రులు, స్కూళ్లు, కాలేజీలకు మినహాయింపు
- ఉత్తర్వులు జారీచేసిన ఆర్థిక శాఖ
- అయినా మంత్రుల పేషీల్లో కొత్త ఫర్నిచర్‌తో హంగులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ కార్యాలయాలకు ఫర్నిచర్ కొనుగోలుపై నిషేధం విధించినా... మంత్రులు ఏ మాత్రం ఆగడం లేదు. తమకు ఏమీ పట్టవన్నట్లుగా కొత్త ఫర్నీచర్‌తో తమ పేషీలను ఆధునిక హంగులతో ముస్తాబు చేయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఆదేశాలను మంత్రులే పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర సచివాలయంతోపాటు శాఖాధిపతుల కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్లలో కొత్తగా ఫర్నీచర్ కొనుగోలు చేయవద్దని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. ఫర్నీచర్ కొనుగోళ్లపై గతంలో విధించిన నిషేధం ఈ ఏడాది మే నెలాఖరుతో ముగిసింది. ఈ నేపథ్యంలో 2026, మే నెలాఖరు వరకు కొత్తగా ఎటువంటి ఫర్నీచర్‌ను కొనుగోలు చేయవద్దని ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అన్ని శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లు ఈ ఆదేశాలను కచ్చితంగా పాటించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అయితే, ఆస్పత్రులు, రెసిడెన్షియల్ స్కూల్స్, కాలేజీలు, కొత్తగా ఏర్పాటుచేసిన ఆఫీసులు, కాలేజీలకు, రాజ్యాంగ సంస్థలైన గవర్నర్ కార్యాలయం, హైకోర్టుకు మినహాయింపు ఇచ్చినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కానీ, మరోవైపు పలువురు మంత్రులు పేషీలను కొత్త ఫర్నీచర్‌తో ఆధునిక హంగులతో తీర్చిదిద్దుతుండటం విశేషం.

8 మంది 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్ట్

11 దుంగలు స్వాధీనం



స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న పోలీసులు

తిరుపతి మంగళం: అన్నమయ్య జిల్లా రాజంపేట అటవీప్రాంతంలో గురువారం 8మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసి 11ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి సమీపంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో స్మగ్లర్లను విచారించి కేసు నమోదు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐలు కే సురేష్‌బాబు, వినోద్ కుమార్ రెడ్డి బృందం బుధవారం అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజ్ గుండ్రేటివారి పల్లి నుంచి గురువారం ఉదయం రాయవరం సెక్షన్ నల్లగుట్ట ప్రాంతం చేరుకున్నారు. అక్కడ కొంతమంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ.. పోలీసులను చూసి దుంగలు పడేసి పారిపోయారు. అయితే వారిని వెంబడించగా 8మంది స్మగ్లర్లు పట్టుబడ్డారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాలో ఐపీఎస్‌ల పాత్ర

మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపణ

సాక్షి, అమరావతి/గాంధీనగర్ (విజయవాడ): రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాలో ఐదుగురు ఐపీఎస్ అధికారుల పాత్ర ఉందని ఏపీ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ఇటీవల జరిగిన తనిఖీల్లో కాకినాడలోనే 43వేల టన్నుల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి సమగ్ర దర్యాప్తునకు ఆదేశించామన్నారు. విజయవాడలోని ఏపీఐఐసీ కాలనీ రైతుబజార్‌లో కందిపప్పు, బియ్యం పంపిణీ కౌంటర్లను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పొరపాట్లకు తావివ్వకుండా పీడీఎస్ ద్వారా అందించాల్సిన బియ్యాన్ని పేదలకు చేరుస్తామన్నారు. కార్డుదారులకు కందిపప్పు, పంచదార, రాగి, మిల్లెట్లు పంపిణీ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. రైతుబజార్లలో 284 ఔట్‌లెట్లు ప్రారంభించామని, హోల్‌సేలర్లు, రిటైల్ వ్యాపారులతో చర్చించి కిలో కందిపప్పు రూ.160కే విక్రయించేలా ఏర్పాట్లుచేశామన్నారు. వీటితో పాటు పెద్ద సూపర్‌బజార్లలో కూడా తక్కువ ధరకే కందిపప్పు లభిస్తుందన్నారు. రోజుకు 125 క్వింటాళ్ల కందిపప్పు, 391 టన్నుల సూపర్ ఫైన్ బియ్యం ఔట్‌లెట్లలో అందుబాటులో ఉంచుతామన్నారు. రైతులకు ధాన్యం బకాయిలు రూ.600 కోట్లు త్వరలో విడుదల చేస్తామన్నారు.

మేడం వచ్చాకే రిబ్బన్ కటింగ్

- రైతుబజారులో నిత్యావసరాల స్టాల్ ప్రారంభోత్సవం నిలిపివేత
- ఎమ్మెల్యే మేడం వచ్చాకే ప్రారంభోత్సవమని కలెక్టర్‌కు మాధవీరెడ్డి భర్త హుకుం



కడప రైతు బజార్ వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్‌ను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి టాస్క్‌ఫోర్స్: టీడీపీ కూటమి ప్రభుత్వంలోని ఓ మంత్రి గారి భార్య మొన్న కారులో కూర్చొని పోలీసు అధికారులను హడలెత్తించిన దృశ్యం చూశాం. ఇప్పుడు అదే కూటమికి చెందిన ఓ ఎమ్మెల్యే గారి భర్త రైతు బజారులో ఓ స్టాల్ ప్రారంభోత్సవాన్ని నిలిపివేయించారు. మేడం వస్తే కానీ రిబ్బన్ కటింగ్ జరగకూడదంటూ స్వయంగా కలెక్టర్‌కే హుకుం జారీ చేసి కూటమి నేతల విపరీత ధోరణిని మరోసారి బయట పెట్టారు. వైఎస్సార్ జిల్లా కడపలో జరిగిన ఈ ఘటన వివరాలివీ..

తక్కువ ధరలతో కందిపప్పు, బియ్యాన్ని వినియోగదారులకు అందించేందుకు పౌర సరఫరాల శాఖ కడప రైతు బజార్‌లో ఓ స్టాల్ ఏర్పాటు చేసింది. దీనిని గురువారం ఉదయం ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ స్టాల్ ఓపెనింగ్‌కు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, జేసీ గణేష్‌కుమార్ వస్తున్నట్లు అధికారులు తెలిపారు. కడప ఆర్‌డీవో, డీఎస్‌వోలతో పాటు మార్కెటింగ్ శాఖ అధికారులంతా ఉదయం 9.30 గంటలకే కడప రైతు బజార్‌కు చేరుకున్నారు. మరో 10 నిమిషాల్లో కలెక్టర్, జేసీ వచ్చి స్టాల్‌ను ప్రారంభిస్తారని అధికారులు ప్రకటించారు. ఇంతలోనే కడప నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవీరెడ్డి భర్త శ్రీనివాసరెడ్డి రంగప్రవేశం చేశారు. ఆయన కలెక్టర్‌కు ఫోన్ చేసి రైతు బజార్‌లో స్టాల్‌ను ఓపెనింగ్ చేయవద్దని హుకుం జారీ చేశారు. ఎమ్మెల్యే మేడం హైదరాబాదులో ఉన్నారని, ఆవిడ శుక్రవారం వచ్చి ప్రారంభిస్తారని చెప్పారు. దీంతో కలెక్టర్ స్టాల్ ప్రారంభోత్సవాన్ని నిలిపివేశారు. ఆ వెంటనే రైతు బజార్ సిబ్బంది ప్రారంభోత్సవం బ్యానర్లు, రిబ్బన్లు తొలగించారు. శుక్రవారంనాటి ప్రారంభోత్సవానికి మళ్లీ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. వాస్తవానికి ఈ స్టాల్ గురించి అధికారులు ముందుగానే ఎమ్మెల్యే మాధవీరెడ్డికి తెలిపి, ప్రారంభోత్సవానికి రావాలని ఆహ్వానించినట్లు సమాచారం. అయితే తనకు వీలు కాదని, కలెక్టర్‌తో ఓపెనింగ్ చేయించుకోండని ఆమె చెప్పారని తెలిసింది. తీరా అన్ని ఏర్పాట్లు చేశాక చివరి నిమిషంలో ప్రారంభోత్సవాన్ని నిలిపివేయించడంతో ఇదేమి ధోరణి అని అధికారులు, వినియోగదారులు ముక్కున వేలేసుకున్నారు.

గ్రామీణ రహదారుల
అనుసంధానంపై శ్రద్ధ

- రూ.4,976 కోట్లతో 7,213 కి.మీ రోడ్ల నిర్మాణానికి ప్రణాళిక
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



సాక్షి, అమరావతి: గ్రామాలకు రహదారుల అనుసంధానంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తేనే ప్రగతి సాధ్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. రూ.4,976 కోట్లతో 7,213 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి సిద్ధం చేసిన ప్రతిపాదనలను కార్యరూపం దాల్చేలా కృషి చేయాలని చెప్పారు. విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంకు అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. 250కి మించి జనాభా కలిగిన ప్రతి గ్రామానికీ రహదారుల అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. 2018–19లో మొదలైన ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారుల నిర్మాణం సాధ్యపడుతుందని చెప్పారు. నెలకు రూ.200 కోట్లతో రహదారుల నిర్మాణం చేపడితే ఈ ప్రాజెక్టులో అద్భుతమైన పురోగతి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.75 కోట్ల మ్యాచింగ్ గ్రాంటు సమకూరిస్తే బ్యాంకు రూ.125 కోట్ల రుణం మంజూరు చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాల్సిన 30 శాతం మ్యాచింగ్ గ్రాంటును 10 శాతానికి తగ్గించాలని కేంద్రాన్ని కోరతామన్నారు. సమావేశంలో ఏఐఐబీ, పంచాయతీరాజ్, ఏపీఆర్ఆర్పీ అధికారులు పాల్గొన్నారు.


కృష్ణాలో ఎగువన నిలకడగా వరద ప్రవాహం

ఆల్మట్టిలోకి 69,492, తుంగభద్ర డ్యామ్‌లోకి 25,349 క్యూసెక్కులు...
శ్రీశైలంలోకి 455 క్యూసెక్కులు వరద

సాక్షి, అమరావతి: నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల పశ్చిమ కనుమల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా నదిలో ఎగువన వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. కర్ణాటకలో కృష్ణా ఉప నది అయిన ఘటప్రభ నుంచి ఘటప్రభ డ్యామ్‌లోకి 7,754 క్యూసెక్కులు చేరుతుండటంతో గురువారానికి నీటి నిల్వ 23.46 టీఎంసీలకు చేరుకుంది. ఘటప్రభ డ్యామ్ నిండాలంటే ఇంకా 28 టీఎంసీలు అవసరం. ఘటప్రభ ఆల్మట్టి డ్యామ్‌కు ఎగువన కృష్ణా నదిలో కలుస్తుంది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 69,492 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 84.58 టీఎంసీలకు చేరింది. మరో 45 టీఎంసీలు చేరితే ఆల్మట్టి డ్యామ్ గేట్లు ఎత్తి దిగువకు వరద జలాలను విడుదల చేస్తారు. కృష్ణాకు మరో ఉప నది అయిన మలప్రభ నుంచి మలప్రభ డ్యామ్‌లోకి 6,780 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 12.10 టీఎంసీలకు చేరుకుంది. మరో 25 టీఎంసీలు చేరితే మలప్రభ డ్యామ్ గేట్లు ఎత్తేస్తారు. నారాయణపూర్ డ్యామ్‌కు ఎగువన మలప్రభ కృష్ణా నదిలో కలుస్తుంది. నారాయణపూర్ డ్యామ్‌లో ప్రస్తుతం 21.16 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. మరో 16 టీఎంసీలు చేరితే నారాయణపూర్ డ్యామ్ నిండుతుంది. కృష్ణాకు ప్రధాన ఉప నది తుంగభద్ర నుంచి తుంగభద్ర డ్యామ్‌లోకి 25,349 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 27.33 టీఎంసీలకు చేరుకుంది. మరో 78 టీఎంసీలు చేరితే తుంగభద్ర డ్యామ్ నిండుతుంది. తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు అయిన శ్రీశైలంలోకి 455 క్యూసెక్కులు చేరుతుండగా... కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా తెలంగాణ ప్రభుత్వం 1,600 క్యూసెక్కులు తరలిస్తోంది. ప్రస్తుతం శ్రీశైలంలో 36.56 టీఎంసీలు నిల్వ ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల మరో ఉమ్మడి ప్రాజెక్టు అయిన నాగార్జునసాగర్‌లోకి ఎలాంటి వరద ప్రవాహం చేరడం లేదు. పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు కురిస్తేనే ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌ల మీదుగా కృష్ణమ్మ శ్రీశైలానికి చేరే అవకాశం ఉంటుంది.

హీరో రాజ్‌తరుణ్‌పై కేసు నమోదు

- హీరోయిన్ మాల్వీ మల్హోత్రతో పాటు ఆమె సోదరునిపై సైతం కేసు
- పోలీసులకు ఆధారాలు ఇచ్చిన లావణ్య



మణికొండ (హైదరాబాద్): హీరో రాజ్ తరుణ్‌పై అతని ప్రియురాలు లావణ్య ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అతనితో పాటు హీరోయిన్ మాల్వీ మల్హోత్ర, ఆమె సోదరుడు మయాంక్ మల్హోత్రలపై పోలీసులు సెక్షన్ 420, 493, 506ల కింద కేసు నమోదు చేశారు. గత 11 సంవత్సరాలుగా తనతో లివింగ్ రిలేషన్‌లో ఉండటం, పెళ్లి చేసుకుని సమాజానికి తెలియకుండా ఉంచటం, ప్రస్తుతం తనను పట్టించుకోకుండా మరొకరితో కలసి ఉంటున్నాడని ఆమె ఫిర్యాదులో పేర్కొన్న విషయం తెలిసిందే. 2016లో తనకు గర్భం వస్తే రెండు నెలలకే అబార్షన్ చేయించాడని ఆమె ఆరోపించారు. ప్రస్తుతం రాజ్ తరుణ్‌తో కలసి ఉంటున్న హీరోయిన్ మాల్వీ మల్హోత్ర, ఆమె సోదరుడు మయాంక్ మల్హోత్రలు తనను జైలుకు పంపిస్తామని, చంపేసి శవం కూడ దొరకకుండా చేస్తామని బెదిరించారని ఆమె పేర్కొన్నారు. వారు చెప్పినట్లుగానే తనకు ఏమాత్రం సంబంధం లేని డ్రగ్స్ కేసులో తనను ఇరికించి జైలుకు పంపారని ఆమె ఫిర్యాదులో వివరించారు. వాట్సాప్ చాట్‌లు, ఫొటోలు, వీడియోలను తన ఫిర్యాదుకు ఆధారాలుగా పోలీసులకు అందించారు. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కాగా, హీరోయిన్ మాల్వీ మల్హోత్ర సైతం ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌లో లావణ్యపై ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. లావణ్య ఫిర్యాదు, ఆమె ఇచ్చిన ఆధారాలను పరిశీలించి ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని నార్సింగి పోలీసులు ఎఫ్ఐఆర్ రూపంలో రాజేంద్రనగర్ కోర్టుకు తెలిపారు.

జ్యుడీషియల్ రిమాండ్‌కు యూట్యూబర్

- ఎట్టకేలకు బెంగళూరులో దొరికిన ఏ–1 ప్రణీత్ హనుమంతు
- 14 రోజుల రిమాండ్ విధించిన నాంపల్లి కోర్టు
- పరారీలో ఏ–2 నాగేశ్వర్‌రావు, ఏ–3, యువరాజ్, ఏ–4 సాయి ఆదినారాయణ

హైదరాబాద్: యూట్యూబర్ ప్రణీత్ హనుమంతుకు నాంపల్లి కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. తండ్రీ, కూతురు సంబంధాన్ని మంటగలిపేలా అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడమే కాకుండా, అశ్లీల చిత్రాలు జోడించిన హనుమంతుకు నాంపల్లి 12వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. ప్రణీత్ హనుమంతుపై పోలీసులు ఐటీ, పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి, గురువారం నాంపల్లి కోర్టులో హాజరు పర్చారు. దీనిపై విచారించిన మెజిస్ట్రేట్ ఏ–1గా ఉన్న యూట్యూబర్ ప్రణీత్‌కు 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అతన్ని పోలీసులు చంచల్‌గూడ జైల్‌కు తరలించారు. ఏ–2 డల్లాస్ నాగేశ్వర్‌రావు, ఏ–3 బుర్రా యువరాజ్, ఏ–4 సాయి ఆదినారాయణ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారిని పట్టుకునేందుకు సైబర్ బ్యూరో టీం ప్రయత్నిస్తోందని తెలిపారు.

సాధ్యాసాధ్యాలపై ఇప్పుడు అధ్యయనమా?!

- ఏపీలో పెట్రో కెమికల్ కాంప్లెక్స్, ఆయిల్ రిఫైనరీ ఏర్పాటుపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ విమర్శలు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో ఆయిల్ రిఫైనరీ, పెట్రో కెమికల్స్ కాంప్లెక్స్ ఏర్పాటు ప్రక్రియ మొదలైందన్న వార్తలపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యంగ్యంగా స్పందించారు. పదేళ్ల పాటు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని అమలు చేయకుండా కాలయాపన చేసిన బీజేపీ ప్రభుత్వం.. ఇప్పుడు మెజార్టీ కోల్పోయినందున చట్టాన్ని వేగంగా అమలు చేయొచ్చని పేర్కొన్నారు. ఈ మేరకు రూ.60 వేల కోట్ల పెట్టుబడితో ఆయిల్ రిఫైనరీ ఏర్పాటు డిమాండ్‌కు కేంద్రం అంగీకరించిందంటూ ఓ ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని జోడిస్తూ.. తన అభిప్రాయాలను 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'ఏపీలో ఆయిల్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు పునర్వ్యవస్థీకరణ చట్టంలోని 13వ షెడ్యూల్‌లో డాక్టర్ మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం చేసిన వాగ్దానం. దీనిని గడిచిన పదేళ్లలోనే మోదీ ప్రభుత్వం పూర్తి చేయాల్సి ఉంది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లేక హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్‌లు దీని ఏర్పాటుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను ఆరు నెలల్లో తెలపాల్సి ఉంది. అయితే ఈ ప్రాజెక్టును పూర్తి చేయడంలో పదేళ్లలో విఫలమైన ప్రభుత్వం.. ప్రస్తుతం సాధ్యాసాధ్యాల అధ్యయనాన్ని మాత్రమే ప్రారంభించింది' అని చురకలంటించారు. ఇదే సమయంలో 'ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టాల అమలులో విఫలమైనందునే 2018లో చంద్రబాబు ఎన్‌డీఏ నుంచి వైదొలగడానికి ప్రధాన కారణం. బహుశా ఇప్పుడు ప్రధాని తన మెజారిటీ, అహాన్ని కోల్పోయినందున పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని వేగంగా అమలు చేస్తారని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు.

అల్లాహ్ మీ జరుగుబాటుకు ఆధారంగా చేసిన మీ ధనాన్ని అవివేకుల పరం చేయకండి. కాకపోతే ఆ సంపదలో నుంచి వారికి అన్నవస్త్రాలు మొదలగునవి సమకూర్చండి. వారితో మంచితనంతో, మృదువుగా మాట్లాడండి.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 12 జూలై 2024

పిల్లల భవితకు పెద్ద పరీక్ష!

సంస్కరణ అనుకొని తెచ్చినది తీరా సమస్యగా మారడమంటే ఇదే. వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశం కోసం పదకొండేళ్ళ క్రితం అప్పటి యూపీఏ సర్కార్ తెచ్చిన జాతీయస్థాయి ప్రవేశపరీక్ష 'నీట్' వ్యవహారం చూస్తుంటే అదే అనిపిస్తోంది. పేపర్ లీకులు, ఇతర అక్రమాలు సహా అనేక వివాదాలు ముసురుకున్న తాజా 'నీట్ – యూజీ 2024' వ్యవహారమే అందుకు ప్రత్యక్ష సాక్ష్యం. అవకతవకలకు ఆలవాలమైన జాతీయ పరీక్షా ఏజెన్సీ (ఎన్టీఏ) – కొత్తగా పరీక్ష నిర్వహించాలని కోరుతున్న అభ్యర్థులు – అందుకు ససేమిరా అంటున్న కేంద్రం – సత్వర నిర్ణయానికి బదులు సన్నాయి నొక్కులు నొక్కుతున్న సుప్రీమ్ కోర్ట్... వీటన్నిటి మధ్య నీట్ ఓ అంతులేని కథ. మళ్ళీ పరీక్ష జరపాలని డిమాండ్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తదుపరి విచారణను జూలై 18కి వాయిదా వేస్తున్నట్టు సుప్రీమ్ గురువారం ప్రకటించడంతో ఈ సీరియల్‌కు సశేషం కార్డు పడింది. ఈసారి వైద్యవిద్యలో ప్రవేశాలు ఆశించిన 24 లక్షలమందితో పాటు అర్హత సంపాదించిన 13 లక్షలమంది పరిస్థితి అగమ్య గోచరమైంది.

లీక్ కథ బయటకొచ్చి ఇన్ని వారాలైనా, పునఃపరీక్ష మినహా మరో మార్గం కనబడట్లేదు. ఒక పక్క కోర్ట్ నిర్ణయం జాప్యమవుతుండగా... మరోపక్క రీ–టెస్ట్‌పై సంబంధిత పక్షాల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. నిజానికి, ఉత్తరాదిన కొన్ని కేంద్రాల్లో ప్రశ్నపత్రం లీక్ సహా అనేక అక్రమాలు జరిగినట్టు ఇప్పటికే మీడియాలో బాహాటంగా వెల్లడైంది. సాక్షాత్తూ సుప్రీమ్ సైతం లీకేజీ నిజమేనని అభిప్రాయపడింది. కాకపోతే, వ్యవస్థీకృతంగా లీక్ జరిగిందా, ఏ మేరకు ఎలా జరిగింది, భవిష్యత్తులో కట్టుదిట్టంగా పరీక్షల నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకోనున్నారన్న వివరాలు ఇవ్వాలంటూ కేంద్రాన్నీ, ఎన్టీఏనూ జూలై 8న ఆదేశించింది. అందుకు జవాబిచ్చే క్రమంలో కేంద్ర సర్కార్ పాత పరీక్ష రద్దు చేసి కొత్త పరీక్ష పెట్టడం హేతుబద్ధం కాదు పొమ్మంటోంది. అదేమంటే, విస్తృత స్థాయిలో అవకతవకలు జరిగాయనడానికి ఆధారాలు లేవంటూ ఐఐటీ – మద్రాస్ తాజాగా ఇచ్చిన సమగ్ర నివేదికను వత్తాసు తెచ్చుకుంటోంది. సహజంగానే ఎన్టీఏ సైతం కేంద్ర సర్కార్ వాదననే సమర్థిస్తోంది. పైగా, నీట్ ప్రశ్నపత్రం సామాజిక మాధ్యమాల్లో లీకైనట్టు వచ్చిన వీడియోనే ఫేక్ అనేసింది.

ఏ విషయంలోనైనా అనుమానాలు రాకూడదు. వస్తే సమూలంగా నివృత్తి చేయాలి. అంతేకానీ అనుమానం పెనుభూతమైన వేళ... పాలకులు, ప్రభుత్వ సంస్థలు భీష్మించుకు కూర్చుంటే ఎలా? పైగా, లక్షలాది విద్యార్థుల భవితతో, వారి కుటుంబాల మానసిక ఆరోగ్యంతో ముడిపడిన అంశాన్ని వారి దృక్కోణం నుంచి సానుభూతితో చూడకపోవడం మరీ ఘోరం. నీట్ ఫలితాల్లో ఏవైనా నగరాల్లో, కేంద్రాల్లో పెద్దయెత్తున విద్యార్థులకు అనుచిత లబ్ధి చేకూరిందా అని తేల్చడం కోసం ఉన్నత విద్యాశాఖ అభ్యర్థన మేరకు ఐఐటీ– మద్రాస్ డేటా ఎనాలసిస్ చేసింది. మంచిదే! 2023, 2024ల్లోని టాప్ లక్షా నలభై వేల ర్యాంకులను ఈ ఎనాలసిస్‌లో భాగంగా విశ్లేషించారట. ఎక్కడా ఏ అక్రమం జరగలేదనీ, టాప్ ర్యాంకులు అన్ని నగరాలకూ విస్తరించాయనీ ఐఐటీ మాట. ఇక్కడే తిరకాసుంది. ప్రత్యేకించి ఈ ఏటి పరీక్షలో కొన్ని కేంద్రాల్లో చేతులు మారిన డబ్బులు, ముందస్తు లీకులు, డబ్బులిచ్చిన పిల్లలకు జవాబుల ప్రత్యేక శిక్షణ జరిగినట్టు ఆరోపణలున్నాయి. ఆ నిర్ణీత కేసులు వదిలేసి సర్వసాధారణంగా నీట్ నిర్వహణలో అక్రమాలే లేవంటూ క్లీన్‌చిట్ ఇస్తే సరిపోతుందా?

గోధ్రా, పాట్నా లాంటి కొన్ని కేంద్రాలకే లీక్ పరిమితమైందన్న ఎన్టీఏ వాదన సరైనది కాదు. భౌగోళిక సరిహద్దుల్ని చెరిపేసిన సోషల్ మీడియా శకంలో ఒకచోట లీకైన పేపర్ అక్కడికే ఆగుతుందనుకోవడం అజ్ఞానం. పైగా రాజస్థాన్, ఢిల్లీ, జార్ఖండ్, బెంగాల్‌లోనూ లీకువీరుల అరెస్టులే నిదర్శనం. సీబీఐ దర్యాప్తును బట్టి దోషులైన అభ్యర్థులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్టీఏ హామీ ఇస్తోంది. అక్రమ ర్యాంకర్లపై చర్యలు సరే... వాళ్ళ నేరం వల్ల దేశవ్యాప్తంగా ఇబ్బంది పడి, ర్యాంకుల్లో వెనకబడ్డ లక్షలాది విద్యార్థుల మాటేమిటి? వారికి న్యాయం చేసేదెట్లా? ఇకపై పేపర్, పెన్ను వాడే ఓఎంఆర్ విధానం వదిలి కంప్యూటర్ ఆధారిత పరీక్షకు మారతారట. ప్రైవేట్ ఏజెన్సీలపై అతిగా ఆధారపడే ఆ పరీక్షలూ అంత నిర్దుష్టమేమీ కాదని ఎన్టీఏనే నిర్వహించే యూజీసీ నెట్ పరీక్ష రద్దుతో ఇటీవలే తేలిపోయింది. ఈ పరిస్థితుల్లో పరీక్షా విధానమే కాదు, ఎన్టీఏ సహా వ్యవస్థనే సమూలంగా ప్రక్షాళించడం అవసరం. రీ–టెస్ట్ పెట్టాలా వద్దా అన్న చర్చ కన్నా అది ఇంకా కీలకం.

నిజానికి, ప్రతిభకు పెద్ద పీట వేయడానికి ఉద్దేశించిన పరీక్షా వ్యవస్థలు లోపభూయిష్ఠంగా మారుతున్న తీరు విచారకరం. చదువులు, ప్రవేశ పరీక్షల మొదలు ఉద్యోగాల పోటీ పరీక్షల దాకా అన్నిటి మీదా నీలినీడలే. ప్రశ్నపత్రాల లీకుల దగ్గర నుంచి జవాబు పత్రాల మూల్యాంకనంలో లోటుపాట్ల దాకా ప్రతి స్థాయిలోనూ నిత్యం వివాదమే. గత 7 ఏళ్ళలో, 15 రాష్ట్రాల్లో 70 లీకులతో 1.4 కోట్లమంది బాధితులే. వెరసి పరీక్షల ప్రాథమిక లక్ష్యమే దెబ్బతింటోంది. ఆగి, ఆలోచించాల్సిన తరుణమిది. మన పరీక్షల విధానం, వాటి ప్రాథమిక లక్ష్యం, ప్రయోజనాలపైన మథనం జరపాల్సి ఉంది. జ్ఞాపకశక్తిని పరీక్షించే పద్ధతుల నుంచి పక్కకు వచ్చి, జ్ఞానాన్ని పరిశీలించే మార్గాల వైపు ఇప్పటికైనా మన పరీక్షా వ్యవస్థలు మళ్ళాల్సి ఉంది. ప్రతి పరీక్షనూ వ్యాపారంగా మారుస్తూ, తప్పుడు మార్గాలు వెతుకుతున్న చీడపురుగుల్ని ఏరివేసేందుకు ప్రభుత్వాలు ఉపక్రమించాలి. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల నుంచి పాఠశాల బోర్డ్ దాకా పబ్లిక్ పరీక్షల్లో అక్రమాల నిరోధానికి జూన్ 21 నుంచి పార్లమెంట్ ఓ కొత్త చట్టం తెచ్చింది. అది ఏ మేరకు అవతవకల్ని అరికడుతుందో చూడాలి. ఏమైనా, పరీక్ష జ్ఞానానికి గీటురాయిగా ఉండాలే కానీ, ప్రతిసారీ పిల్లలకు శిక్షగా మారితేనే కష్టం.

గ్రహం అనుగ్రహం శ్రీక్రోధి నామ సంవత్సరం; ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు: ఆషాఢ మాసం; తిథి శు.షష్ఠి ఉ.10.18 వరకు, తదుపరి సప్తమి; నక్షత్రం ఉత్తర ప.2.54 వరకు, తదుపరి హస్త; వర్జ్యం రా.12.13 నుండి 1.59 వరకు ; దుర్ముహూర్తం ఉ.8.11 నుండి 9.03 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.23 వరకు; అమృత ఘడియలు ఉ.6.55 నుండి 8.43 వరకు; రాహుకాలం ఉ.10.30 నుండి 12.00 వరకు; యమ గండం ప.3.00 నుండి 4.30 వరకు; సూర్యోదయం 5.36 ; సూర్యాస్తమయం 6.35

'కనీస' చట్టబద్ధత ఎండమావేనా?

విశ్లేషణ



డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

ఖరీఫ్ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం 14 పంటలకు ప్రకటించిన మద్దతు ధరలు ఆశించిన మేరకు లేకపోవడంతో అన్నదాతలకు నిరాశే మిగిలింది. వరి ఎక్కువగా పండించే రాష్ట్రాలు వరి సాధారణ రకానికి రూ. 3,000 నుంచి రూ. 3,200; ఏ గ్రేడ్ రకానికి రూ. 3,200 నుంచి రూ. 3,400 ప్రకటించాలని కేంద్రానికి సిఫార్సు చేశాయి. కానీ కేంద్రం సాధారణ రకానికి రూ. 2,300; ఏ గ్రేడ్ రకానికి రూ. 2,320 మాత్రమే ప్రకటించింది. పత్తికి రూ. 1,000 నుంచి రూ.1,500 పెంచాలని కోరితే రూ. 500 పెంపుతో సరిపెట్టారు. జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, కందులు, పొద్దుతిరుగుడు, నువ్వులు, సోయా, పెసలు, మినుములు... వంటి పంటలకు రాష్ట్రాల సిఫార్సులకు అనుగుణంగా ధరలు పెంచలేదు. శాస్త్రీయత లేకుండా తోచిన ధర ప్రకటించడంలో ఔచిత్యం ఏమిటి?

పంటల సాగు ఖర్చుకు ఒకటిన్నర రెట్లు ఆదాయం అందాలనీ, అప్పుడే రైతుకు న్యాయం జరుగుతుందనీ వ్యవసాయ పితామహుడు డాక్టర్ స్వామినాథన్ 2005లో నాటి యూపీఏ ప్రభుత్వానికి అందించిన నివేదికలో స్పష్టం చేశారు. ఆనాటి నుంచి నేటి వరకు ఈ డిమాండ్ అపరిష్కృతంగానే ఉండిపోయింది. ఆశ్చర్యం ఏమంటే... స్వామినాథన్ కమిషన్ అందించిన సిఫార్సులను 2004 నుంచి 2014 వరకు పదేళ్లపాటు అధికారంలో ఉండి అమలు చేయకుండా అటకెక్కించిన కాంగ్రెస్ పార్టీ 2024 ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేస్తామని నమ్మబలికింది.



మరోపక్క, దేశంలో దశాబ్దాలపాటు అపరిష్కృతంగా, చిక్కుముళ్లుగా బిగుసుకుపోయిన సమస్యలకు తాము పరిష్కార మార్గాలు చూపగలిగామని ప్రధాని నరేంద్ర మోదీ పదేపదే చెబుతుంటారు. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన, ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, చంద్రయాన్ విజయం, సూర్యయాన్‌కు సన్నద్ధత వంటి అంశాలను ఉదహరించే అధికార బీజేపీ గత పదేళ్లుగా రైతాంగ సమస్యలకు అరకొరగా తప్ప శాశ్వత పరిష్కార మార్గాలేమీ చూపించలేకపోవడం గమనార్హం! ఫలితంగానే దేశానికి ఆహార భద్రత చేకూర్చడానికి ఆరుగాలం కష్టపడే అన్నదాతలు దేశం నలుమూలల నుంచి తరలివచ్చి ఢిల్లీ శివారు ప్రాంతాల్లో గుడారాలు వేసుకొని ఎండ, వాన, చలిని తట్టుకొని నెలల తరబడి తమ డిమాండ్ల సాధన కోసం ఉధృతమైన ఉద్యమం చేశారు. గత 10 ఏళ్లల్లో నాలుగు దశల్లో దేశ రైతాంగం చేసిన ఆందోళన కార్యక్రమాలు ఇంతకుముందెప్పుడూ కనివిని ఎరుగనివి. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దాదాపు 300కు పైగా రైతు సంఘాలు సంఘటితమై ఉద్యమించాయంటే సమస్య తీవ్రత ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు. 750 మందికి పైగా ప్రాణాలు పోయినా లెక్కచేయక రైతాంగం ప్రదర్శించిన పట్టుదల కారణంగానే కేంద్రం పార్లమెంట్‌లో మూడు వివాదాస్పద రైతు బిల్లుల్ని ఉపసంహరించుకొంది. కానీ వారి ఇతర డిమాండ్లను మాత్రం నెరవేర్చలేదు.

దేశ రైతాంగం ముక్తకంఠంతో చేస్తున్న అతి ప్రధాన డిమాండ్ ఎంఎస్పీ(కనీస మద్దతు ధర)కి చట్టబద్ధత. దీనినే 'కిసాన్ న్యాయ్ గ్యారంటీ' అంటున్నారు. కేంద్రం ముందు రైతు సంఘాలు పెట్టిన ఇతర డిమాండ్లలో 1) ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) ఒప్పందాల నుంచి భారత్ బయటకు రావడం 2) వ్యవసాయ దిగుమతులపై సుంకాల పెంపుదల 3) 2020 విద్యుత్ సంస్కరణల చట్టం రద్దు 4) ఉపాధి హామీ పనులు ఏడాదికి 200 రోజులకు పెంపు 5) రైతుకు, రైతు కూలీలకు పెన్షన్ వర్తింపు వంటివి ప్రధానంగా ఉన్నాయి.

రైతులు పెట్టిన ఈ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలతో పలుమార్లు చర్చలు జరిపినా పరిష్కారం కాలేదు. ముఖ్యంగా రైతులు పట్టుబడుతున్న ప్రధాన డిమాండ్ 23 పంటలకు కనీస మద్దతు ధరలతో చట్టబద్ధత కల్పించడం. ఈ అంశాన్ని ప్రభుత్వం ఆర్థిక కోణంలో కాకుండా రైతుల ఆర్థిక కోణంలో చూడాలని అంటున్నారు. కానీ, కేంద్రం ఈ డిమాండ్‌కు తలొగ్గకపోగా మరో కొత్త ప్రతిపాదన తెరమీదకు తెచ్చింది. వరి, గోధుమలకు ప్రత్యామ్నాయంగా కంది, మినుము, మొక్కజొన్న, పత్తి వంటి పంటలు పండిస్తే ఐదేళ్ల పాటు కనీస మద్దతుతో కేంద్ర సంస్థలయిన జాతీయ వినియోగదారుల సహకార సమాఖ్య (ఎన్సీసీఎఫ్), జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య (నాఫెడ్)లు కొంటాయనీ, అందుకుగాను రైతులతో ముందస్తు ఒప్పందం చేసుకొంటాయనీ ప్రతిపాదించింది. దీనిని రైతు సంఘాలు ఒప్పుకోవడం లేదు. కేంద్రం మాత్రం ఈ ప్రణాళికను అమలు చేయాలనే గట్టి పట్టుదలతో ఉంది.

పంటమార్పిడి అన్నది అంత తేలికైనది కాదు. రైతులలో పంట మార్పిడి విధానంపై అవగాహన పెంచాలి. ప్రభుత్వ సహకారం అందాలి. పండించిన పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందన్న నమ్మకం రైతుల్లో కలగాలి. ఇందుకు చాలా సమయం పడుతుంది. ముఖ్యంగా, దేశంలోని అన్ని ప్రాంతాలలోని వ్యవసాయ భూములు పంట మార్పిడికి పూర్తి అనుకూలంగా లేవన్నది ఓ చేదు వాస్తవం. సమగ్రమైన అధ్యయనం, వాటి ఫలితాలు పరిశీలించిన తర్వాతనే పంటల మార్పిడి విధానం అమలు చేయాలే తప్ప, బలవంతంగా అమలు చేయాలనుకోవడం వల్ల ప్రతిఘటన ఎదురవుతుంది. నిజానికి, ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించే విషయంలోనూ, ఇతర డిమాండ్ల పరిష్కారంలోనూ ఎన్డీఏ–2 ప్రభుత్వం ప్రదర్శించిన ఉదాసీనత కారణంగానే బీజేపీ ఈ ఎన్నికలలో 60 లోక్‌సభ స్థానాలకు పైగా నష్టపోయిందని పరిశీలకుల విశ్లేషణ. ప్రధానంగా... పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లోని మెజారిటీ స్థానాల్లో రైతాంగం బీజేపీని ఆదరించలేదు.

అయితే, మూడోసారి నరేంద్ర మోదీ ప్రధానిగా కొలువు దీరిన ఎన్డీఏ–3 ప్రభుత్వం రైతాంగం చేస్తున్న డిమాండ్లను పరిష్కరించడానికి ప్రయత్నిస్తుందా? లేక ఉద్యమాన్ని అణచివేస్తుందా అన్నదే కీలకం. ఎన్నికల ముందు దేశ రైతాంగాన్ని తమ హామీల ద్వారా తమ వైపు తిప్పుకోవాలని కాంగ్రెస్ కూటమి పక్షాలు (ఇండియా బ్లాక్) ప్రయత్నించినా అది పూర్తి స్థాయిలో ఫలించలేదు. ఈ నేపథ్యంలోనే దేశ రైతాంగం ఆశలు, ఆకాంక్షలు ఏమవుతాయనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పిస్తే ఏటా కేంద్ర ప్రభుత్వంపై రూ. 12 లక్షల కోట్ల అదనపు భారం పడుతుందని నీతి ఆయోగ్ తేల్చింది. దాదాపు రూ. 50 లక్షల కోట్ల వార్షిక బడ్జెట్‌లో ఇంత మొత్తం కేటాయించడం అసాధ్యమే. పైగా, వ్యవసాయం అంటే కేవలం 23 పంటలే కాదు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, చేపలు, రొయ్యలు, పండ్లు, కూరగాయల మాటేమిటి? వాటికి ప్రోత్సాహకాలు అవసరం లేదా అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

దేశంలో జరుగుతున్న రైతాంగ ఉద్యమాలు, వాటిపట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరి ఎలా ఉన్నా రైతుల ఆదాయం గణనీయంగా తగ్గిపోయినట్లు 77వ జాతీయ నమూనా సర్వే వెల్లడించడం గమనార్హం. ఈ సర్వే ప్రకారం దేశంలోని చిన్న సన్న కారు రైతు కుటుంబాల నెలసరి ఆదాయం సగటున రూ. 10,218 మాత్రమే. రైతు కూలీల సగటు నెలవారీ ఆదాయం రూ. 4,063. ఆదాయాలు పెరగకపోవడం వల్ల వారికున్న రుణభారం తగ్గడం లేదు. ఫలితంగానే రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా 2023లో 11,290 మంది, 2022లో 10,281 మంది, 2021లో 9,898 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకొన్నారు. రైతుల ఆత్మహత్యల్లో పెరుగుదల 3.7 నుంచి 5.7 శాతంగా ఎన్సీఆర్బీ డేటా వెల్లడిస్తోంది. ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారిలో 53 శాతం మంది రైతు కూలీలేనన్నది చేదు నిజం. రైతులు, అనుబంధ వృత్తికూలీల ఆదాయం పెరగకపోవడం కారణంగానే గ్రామీణ పేదరికం క్రమేపీ పెరుగుతున్నది. మోదీ చెప్పినట్లు 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు కాలేదు. ఇప్పట్లో హరియాణాకు తప్ప ఇతర ప్రధాన రాష్ట్రాలకు ఎన్నికలు లేవు కనుక... రైతాంగ సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి ఎలా ఉంటుందన్నది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రైతులు డిమాండ్ చేస్తున్న ఎంఎస్పీకి చట్టబద్ధత ఓ ఎండమావిగానే మిగిలిపోతుందన్నది నిష్ఠుర సత్యం.

వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పూర్తి మద్దతు



కేవలం మాటలు కాదు, చర్యలు. రష్యా చేస్తున్న అక్రమ యుద్ధాన్ని అంతం చేయడానికి ఎంత కాలమైనా ఉక్రెయిన్‌కూ, జెలెన్‌స్కీకీ మద్దతిచ్చేందుకు నా ప్రభుత్వం కట్టుబడి ఉంది.

– కీర్ స్టార్మర్, బ్రిటన్ ప్రధాని

కాలం మారుతుంది!



ప్రభుత్వాన్నో, అధికార పక్షాన్నో, లేదా దాని మాజీ నాయకులనో విమర్శించిన వాళ్లను గుడ్డిగా అరెస్టు చేస్తున్న పోలీసులు తెలుసుకోవాల్సింది ఏమిటంటే... ఒకరోజు మళ్లీ కాలచక్రం గిర్రున తిరుగుతుంది. పూర్తి పక్షపాత చర్యలకు పాల్పడ్డవారిని జవాబుదారీగా నిలబెడతామని తర్వాతి ప్రభుత్వం ప్రతిజ్ఞ చేయాలి. తమిళనాడు సర్కార్ పోలీసు రాజ్యమవుతోంది. కేవలం పూర్తిస్థాయి నేరస్థులే స్వేచ్ఛగా ఊపిరి తీసుకుంటున్నారు.

– సుమంత్ రామన్, హోస్ట్

నీళ్ల పాలేనా?



రానున్న బడ్జెట్‌లో బిహార్‌కు 30,000 కోట్లను నితీశ్ కుమార్ డిమాండ్ చేస్తున్నారని వార్త. మరో 10–12 వంతెనలను నిర్మించి, నాశనం చేయడానికి ఆ డబ్బు సరిపోతుందా?

– సుచేతా దలాల్, రచయిత్రి

క్యాండీ పీరియడ్



ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ జిల్లాకు కొత్తగా నియమితులైన కలెక్టర్ ఒక ప్రభుత్వ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. టీచర్ ఫోన్‌ను బట్టి రెండు గంటలు క్యాండీ క్రష్ ఆడినట్టు, 30 నిమిషాలు సోషల్ మీడియాలో గడిపినట్టు, మరో 30 నిమిషాలు ఫోన్ కాల్స్‌లో ఉన్నట్టు తెలిసింది. ఆ టీచర్ సస్పెండయ్యారు... కానీ ప్రభుత్వోపాధ్యాయులకు చెడ్డపేరు ఎందుకు వస్తున్నదో ఈ ఘట్టం తెలియజేస్తోంది.

– స్వాతీ గోయల్ శర్మ, జర్నలిస్ట్

ఇప్పటి రష్యా



విప్లవాలు, సర్వోత్తమాల నేల అయిన రష్యా నుంచి తిరిగొచ్చాను. రూబుల్ పాలిస్తోంది. డాలర్లను అంగీకరించే హోటళ్లు దొరకడం సులభం కాదు. ఇంగ్లిష్ మాట్లాడేవాళ్లు దొరకడానికి సమయం పట్టింది. యువతీ యువకులు ఇన్‌స్టాగ్రామ్‌ను ప్రేమిస్తున్నారు. రాజ్‌కపూర్ కంటే నమస్తే, యోగా ఇప్పుడు ఎక్కువ ప్రజాదరణలో ఉన్నాయి.

– వసుధ వేణుగోపాల్, జర్నలిస్ట్

సుస్థిర జీవనం



ఈ ప్రపంచ జనాభా దినోత్సవం (జూలై 11) రోజున, జనాభా సమస్యలను సుస్థిర విధానాలతో పరిష్కరించాలని సంకల్పం చెప్పుకొందాం. మనం ఉమ్మడిగా అందరికీ నాణ్యమైన జీవనాన్ని అందించగలం.

– కఫీల్ ఖాన్, పిల్లల వైద్యుడు

పాక్ అకృత్యం



బలోచిస్తాన్‌లో పాకిస్తాన్ సైన్యపు అకృత్యాలు కొనసాగుతూనే ఉన్నాయి. పాకిస్తాన్ సైన్యం వల్ల కిడ్నాపునకు గురై కనబడకుండాపోయిన బలోచులను విడుదల చేయాలంటూ క్వెట్టాలో నిరసన జరుపుతున్న సాధారణ పౌరుల మీద పాకిస్తాన్ సైన్యం కాల్పులు జరిపింది.

– ఫాజిలా బలోచ్, యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

మహోన్నత నైతిక శిఖరం



హెన్రీ డేవిడ్ థోరో

దశాబ్దాలు గడుస్తున్నా దేశ ప్రజాస్వామ్య ప్రయాణం ప్రజా ఆకాంక్షలు నెరవేర్చే దిశగా నడవ లేదనడం వాస్తవ దూరం కాదు. ప్రజా భాగస్వామ్యంతోనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. అందుకు ప్రజలే చొరవ చూపాలి. రాజకీయ, పాలనా వ్యవస్థలపై అవగాహన పెంచుకొని ఉద్యమించాలి. అందుకు అమెరికా తాత్వికవేత్త థోరో రచనలు బాగా దోహదం చేస్తాయి. ఆయన రచన 'సివిల్ డిసోబీడియన్స్' (శాసనోల్లంఘన) మహాత్మాగాంధీని అమితంగా ఆకర్షించింది. కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో చదువుతున్నప్పుడే దీన్ని చదివారాయన. దక్షిణాఫ్రికాలో ఆసియా వాసుల హక్కుల కోసం ఈ సిద్ధాంతాన్ని సంధించి పోరాటం చేశారు. శాసనోల్లంఘనను మాతృ భాషలోకి అనువదించి సహచరులకు అందించారు. 1919లో బ్రిటిష్‌వాళ్లు రౌలట్ చట్టాన్ని ప్రతిపాదించినపుడూ, తరువాతి కాలం (1930)లోనూ శాసనోల్లంఘన సిద్ధాంతం అనుసరించి ఉద్యమం నిర్మించారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారు.


హెన్రీ డేవిడ్ థోరో అమెరికాలో 1817 జులై 12న పుట్టారు. నలభై నాలుగు ఏళ్ళు జీవించి 1862లో మరణించారు. సివిల్ డిసోబీడియన్స్ గ్రంథం మసాచుసెట్స్‌లో 1849లో ప్రచురితమయ్యింది. ఇది చిన్న పుస్తకం. కానీ బలమైన రాజకీయ రచన. మేల్కొలిపే తాత్విక చింతన. ప్రభుత్వం, రాజకీయ దోపిడీ, జైళ్ళు, అహింసా మార్గం, ప్రజల హక్కులు, పేదరికం, నైతిక విలువలు, యుద్ధం, అజ్ఞానం, మానవ సంబంధాల ప్రాముఖ్యం వంటి ఎన్నో ముఖ్య విషయాలు ఈ పుస్తకం ద్వారా థోరో మన ముందు ఉంచారు. ఈ రచన వచ్చి 175 ఏళ్ళు అయింది. దీనిలోని 'నామమాత్రంగా పాలించే ప్రభుత్వమే ఉత్తమ ప్రభుత్వం. ఇదే నా ఆదర్శం. ప్రభుత్వం అతి తొందరగా ఆ విధంగా పాలించేటట్లు చేయుటే నా అభిలాష.' అనే ప్రారంభ వాక్యాలు సమకాలిక రచయిత జాన్ స్టువార్ట్ మిల్ అన్నవి. థోరో కవి, తాత్వికుడు, వ్యాసకర్త, ప్రకృతి ప్రేమికుడు. ఆయన ఏం చెప్పాడో అదే ఆచరించిన మహోన్నత నైతికశిఖరం.

మన కులపోడనో, ఊరి వాడనో, రాజ వంశీకుడనో, ఫలానా పార్టీ వాడనో, మతం వాడనో, సినీ నటుడనో, ప్రలోభాలకు లొంగో ఓటు వేసి గెలిపించి చట్ట సభకు పంపితే వచ్చే ఫలితాలు ఎలా ఉంటాయో చూస్తున్నాం. ఆ చేదు ఫలితాలు అనుభవిస్తున్నాం. ఎన్నికలు చేసే మంచి ఎంత? ప్రాతినిధ్య ప్రజాస్వామ్య విధానంతో వచ్చే మంచి చెడులు ఏమిటి అనేది మనం తెలుసుకోవాలి. వీటిని థోరో తన రచనలో చర్చించారు. శాసనోల్లంఘన రచనలోని ప్రజాస్వామ్య భావనలు జీర్ణించుకొని, నైతికంగా ఎదిగి, లోపాలు చక్కదిద్దుకోవడానికి మనం తయారైతే సమాజ వికాసం జరుగుతుంది.

– వి. వరదరాజు, శ్రీకాకుళం

బాలల భద్రత తక్షణ కర్తవ్యం

అభిప్రాయం



శ్రీనివాస్ మాధవ్

ఎన్ని చట్టాలు వచ్చినా పిల్లలపై ఘోరాలు కొనసాగుతూ ఉండడం బాధాకరం. జూన్ నెలలో సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి రైస్‌మిల్ దగ్గర ఆరేళ్ల బాలిక, మియాపూర్ నడిగడ్డ తండా వద్ద 12 ఏళ్ల బాలిక లైంగిక హింస, హత్యలకు గురవ్వడం ప్రజలు ఇంకా మర్చిపోలేదు. వలస వెళ్ళిన నిరు పేద కుటుంబాలకు చెందిన ఈ బాలికలు సామజిక మాధ్యమాల మద్దతుకు కూడా నోచుకోలేదు.

తెలంగాణ రాష్ట్రానికి ఇంతవరకూ ఒక బాలల పరిరక్షక విధానం లేదు. సమగ్ర విధానం రూపొందించి, రాష్ట్రంలోని అన్ని సంస్థలలో అమలు పరిచేట్లు చూడటం బాలలపై లైంగిక నేరాలనుంచి రక్షణ (పోక్సో) చట్టం – 2012, నిబంధన 3 (5) ప్రకారం తప్పనిసరి. పోక్సో చట్టం ప్రకారం బాల స్నేహపూర్వక ప్రత్యేక న్యాయస్థానాలు అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలి. పోక్సో చట్టం సెక్షన్ 19 ప్రకారం ఏదైనా సంస్థ పరిధిలో బాలలపై నేరం జరిగినా, జరిగే అవకాశం ఉన్నా ఆ సంస్థ అధిపతి లేక యజమాని వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. ఈ బాధ్యత నిర్వహణలో విఫలమైతే ఏడాది జైలుశిక్ష విధించవచ్చు. పోక్సో చట్టం నిబంధన 3 (4) ప్రకారం బాలలు సందర్శించే అన్ని సంస్థలు, పాఠశాలలు, క్రెష్‌లలో సిబ్బంది, ఉపాధ్యాయులకు ఏమైనా నేర చరిత్ర ఉన్నదా అని పోలీసు శాఖచే వారి నేపథ్య తనిఖీ క్రమబద్ధంగా చేయడం తప్పనిసరి.



చట్ట పరమైన రక్షణ, పోక్సో చట్టం కింద పడేశిక్షల తీవ్రత గురించి అవగాహన పెంచితే నేరాలు తగ్గవచ్చు.

18 ఏళ్ళ లోపు బాలలపై లైంగిక హింస చేస్తే 20 ఏళ్ళ వరకు జైలు శిక్ష విధిస్తారు. ఈ నేరం బంధువులు, ప్రభుత్వ ఉద్యోగులు, పాఠశాల సిబ్బంది, వసతి గృహ సిబ్బంది చేస్తే మరణ శిక్షకు ఆస్కారం ఉంటుంది. ఇప్పటికే తమిళనాడు, గుజరాత్, బిహార్, మహారాష్ట్ర రాష్ట్రాలలో పోక్సో చట్టం ప్రకారం ఏర్పాటైన ప్రత్యేక న్యాయస్థానాలు త్వరితంగా విచారణ పూర్తి చేసి బాలలపై లైంగిక దాడి చేసిన నేరస్థులకు మరణ శిక్షలు విధించాయి.

ఆంధ్రప్రదేశ్ 2019లో 'దిశ' హత్యకు ప్రతిస్పందనగా 'దిశ చట్టం' (ఆంధ్రప్రదేశ్ క్రిమినల్ లా (సవరణ) చట్టం–2019), మహారాష్ట్ర 'శక్తి క్రిమినల్ చట్టాల (మహారాష్ట్ర సవరణ) చట్టం 2020' అమలు చేసే ప్రయత్నం చేశాయి. ఈ చట్టాల ప్రకారం బాలలు, మహిళలపై జరిగిన నేరాల పరిశోధన, న్యాయ విచారణ త్వరితంగా పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ రాష్ట్రపతి అనుమతి రానందున ఈ రెండు చట్టాలు అమలు లోకి రాలేదు.

నారాయణపేట జిల్లాలో జూన్ 13న సంజీవ్ అనే వ్యక్తిపై ప్రాణాంతక దాడి జరుగుతున్న సమయంలో 100 నంబర్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన రాలేదని తెలిసింది. తెలంగాణలో '112 ఇండియా', 'దిశ' వంటి ఎమర్జెన్సీ యాప్‌లను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలి. ఆంధ్రప్రదేశ్ దిశ యాప్ 1.5 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ మధ్య ప్రవేశపెట్టిన టీ–సేఫ్ యాప్ ప్రయాణాల్లో అత్యవసర సాయం కోసం, హెల్ప్ లైన్ 100 డయల్ చేసేందుకు పని చేస్తుంది. కానీ 112 ఇండియా, దిశ వంటి యాప్‌లలో పోలీసులతో పాటు ఇతరులకు కూడా తక్షణ సమాచారం చేరవేసే అవకాశం ఉంది. ఫోన్ గట్టిగా ఊపడం ద్వారా కూడా తక్షణ సందేశం పంపవచ్చు. మొబైలు ఫోన్ హ్యాండ్ సెట్ ప్యానిక్ బటన్, జీపీఎస్ నిబంధనలు– 2016 ప్రకారం... ఫీచర్ ఫోన్‌లో 5 లేక 9 నంబర్‌ను స్మార్ట్ ఫోన్‌లో అయితే ఆన్–ఆఫ్ మీట 3 సార్లు నొక్కితే పోలీసు అత్యవసర హెల్ప్ లైన్‌కు సందేశం వెళ్ళాలి. ఈ విషయంపై ప్రజలలో అవగాహన అవసరం. ఏ దేశానికైనా అత్యంత విలువైన ఆస్తిపాస్తులు బాలలు. వారిని కాపాడటం కోసం అన్ని మార్గాలూ వెదకాలి.

వ్యాసకర్త ఆర్టీఐ కార్యకర్త । 9247 159 343

స్థితప్రజ్ఞత

మహావీరుడు, ఫ్రెంచ్ చక్రవర్తి నెపోలియన్ ఓ యుద్ధంలో పరాజయాన్ని చవిచూసి సెయింట్ హెలీనా అనే దీవిలో యుద్ధ ఖైదీగా ఉన్న కాలమది. ఆయన ఆరోగ్యాన్ని గమనించడానికి ఓ డాక్టర్ని నియమించారు. ఓరోజు నెపోలియన్, డాక్టరూ కలిసి ఓ బహిరంగ ప్రదేశంలో నడుచుకుంటూ పోతున్నారు. కాసేపటికి వారిద్దరూ ఓ ఇరుకు మార్గంలోకి చేరుకున్నారు. అప్పుడు ఎదురుగా ఒక సాధారణ మహిళ నడుచుకుంటూ వస్తోంది. పక్కకు తప్పుకుని నెపోలియన్ తనకు దారి ఇస్తారని అనుకుంది ఆ స్త్రీ. కానీ డాక్టర్ ఆమెతో 'ఇదిగో ఆయన ఎవరనుకున్నావు... నెపోలియన్ చక్రవర్తి. పక్కకు తప్పుకో. ఆయన ముందుకు పోవడానికి నువ్వే పక్కకు తప్పుకోవాలి' అన్నాడు.

జ్యోతిర్మయం

వెంటనే నెపోలియన్ 'ఇప్పుడు మీతో ఉన్నది నెపోలియన్ చక్రవర్తి కాదు. ఓ మామూలు వ్యక్తి అయిన నెపోలియన్. ఇతరులు పక్కకు తప్పుకుని నాకు దారివ్వాల్సిన స్థితి కాదిప్పుడు నాది. ఓ మామూలు స్త్రీ కైనా నేనే పక్కకు తప్పుకుని దారివ్వక తప్పదు. అలా దారివ్వడం వల్ల నేనేమీ బాధ పడబోన'ని చెప్పాడు.

నెపోలియన్ తన జీవితంలో హెచ్చుతగ్గులను ఒకేలా చూసి పరిస్థితికి తగినట్లే వ్యవహరించిన వ్యక్తి. 'ఎప్పుడూ గెలుపు నా పక్షమే అని అనుకోను. ఓటమిని చవిచూడడం నాకు తెలుసు. గెలుపోటములను ఒకేలా చూసిన వ్యక్తిని నేను' అని చెప్పాడు. ఈ మానసిక పరిపక్వత కలవారిని స్థితప్రజ్ఞుడిగా భగవద్గీత చెప్పనే చెప్పింది. విజయం సాధించినప్పుడు విర్రవీగలేదు. పరాభవం పొందినప్పుడు డీలా పడలేదు. రెండిటినీ సమానంగా చూశాడు. స్వీకరించాడు. ఈ మానసిక పరిపక్వత వల్ల జీవితంలో దేన్నయినా అధిగమించవచ్చు. అది మనిషిని దెబ్బతీయదు. పైపెచ్చు ఎప్పుడూ నిలకడగా ఉంచుతుంది.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

అధైర్యపడకండి... అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- కూటమి నేతల దాడిలో ఇల్లు దెబ్బతిన్న నాయకుడికి పార్టీ తరపున ఆర్థిక సాయం



వెంకటేశ్వరరావుకు చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: 'నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దు. అందరికీ అండగా ఉంటాం..' అని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చెప్పారు. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం భూదేవిపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కామినేని వెంకటేశ్వరరావు ఇంటిపై ఇటీవల కూటమి నాయకులు దాడిచేసి ఇంటిని ధ్వంసం చేశారు. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ద్వారా సంఘటన గురించి తెలుసుకున్న వైఎస్ జగన్... బాధితుడైన కామినేని వెంకటేశ్వరరావుకు పార్టీ తరపున ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు ఆర్థిక సాయం చెక్కును వెంకటేశ్వరరావుకు మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, పార్టీ పోలవరం నియోజకవర్గ కన్వీనర్ తెల్లం రాజ్యలక్ష్మి చేతులమీదుగా గురువారం అందించారు. బాలరాజు మాట్లాడుతూ ఇప్పటికే దాడుల గురించి ఎస్పీ మేరీప్రశాంతి దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు పాశం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల

ఈనెల 22 నుంచి 27 వరకు కౌన్సెలింగ్

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2024–25 విద్యా సంవత్సరం అడ్మిషన్లలో భాగంగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను చాన్సలర్ ఆచార్య కె.సి.రెడ్డి గురువారం విడుదల చేశారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో నాలుగు ట్రిపుల్ ఐటీల డైరెక్టర్లు, యూనివర్సిటీ రిజిస్ట్రార్, అడ్మిషన్ల కన్వీనర్‌తో కలిసి ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించారు. నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఈడబ్ల్యూఎస్ కోటాతో కలుపుకొని 4,400 సీట్లు ఉన్నాయి. ఇందుకోసం ఈ ఏడాది 53,863 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రత్యేక కేటగిరీ కోటా మినహాయించి 4040 సీట్లకు ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేశారు. ఎంపికైన వారిలో ప్రభుత్వ పాఠశాలల నుంచి 3,757 (93 శాతం) మంది, ప్రైవేటు పాఠశాలల నుంచి 283 (7 శాతం) మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో బాలికలు 2,713 (67.15 శాతం) మంది ఉండగా, బాలురు 1,327 (32.85 శాతం) మంది ఉన్నారు. తెలంగాణ నుంచి 58 మంది విద్యార్థులకు సీట్లు లభించాయి. రాష్ట్రంలో అత్యధికంగా శ్రీకాకుళం జిల్లాకు 498 సీట్లు లభించగా, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేవలం 13 సీట్లు మాత్రమే లభించాయి. రెండో స్థానంలో విజయనగరం జిల్లాకు 286 సీట్లు లభించాయి. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 22 నుంచి 27వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఆగస్టు తొలి వారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. జాబితా విడుదల కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.ఎస్.ఎస్వి. గోపాలరాజు, అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, నాలుగు ట్రిపుల్ ఐటీల డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎన్డీయే హయాంలో శ్రీవారిని స్మరించే అధికారులే టీటీడీలో ఉంటారు

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్



తిరుమల ఆలయం వెలుపల కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

తిరుమల : బీజేపీ నేతలు ఎప్పుడూ ఏ మతాన్నీ, వ్యక్తులనూ కించపరిచే వ్యాఖ్యలు చేయరని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. గురువారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం టీటీడీ ఆధ్యాత్మిక వాతావరణంలో నడుస్తోందన్నారు. దేవుడిని అమ్మిన వారు.. పేరుకు నామాలు పెట్టి స్వామి ఆస్తులకే పంగనామాలు పెట్టిన నయవంచకులు గత ప్రభుత్వ హయాంలో టీటీడీలో ఉన్నతాధికారులుగా ఉన్నారని, కానీ ఎన్డీఏ ప్రభుత్వంలో నిత్యం స్వామిని స్మరించే అధికారులే ఉంటారని చెప్పారు. శ్రీవారి ఆస్తులను వైఎస్సార్‌సీపీ నేతలు కొల్లగొట్టారని, ఎర్రచందనం పేరుతో స్మగ్లింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ వ్యవహారాలపై విచారణ జరిపిస్తామని, ఈ అంశాలన్నింటినీ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్తామని బండి సంజయ్ వివరించారు.

టీడీపీ నేతల బెదిరింపులకు 'ఉపాధి' ఉద్యోగి బలి

- ఉద్యోగానికి రాజీనామా చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు హెచ్చరిక
- లేకపోతే తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని వేధింపులు
- మనస్తాపంతో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఆనంద్
- పల్నాడు జిల్లా గోపాలంవారిపాలెంలో విషాదం



ఆస్పత్రి ప్రాంగణంలో విలపిస్తున్న బంధువులు(ఇన్‌సెట్)ఆనంద్ (ఫైల్)

చిలకలూరిపేట: టీడీపీ నాయకుల బెదిరింపులు భరించలేక ఉపాధి హామీ పథకం ఉద్యోగి ఒకరు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం గోపాలంవారిపాలెం గ్రామంలో గురువారం జరిగింది. మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... గోపాలంవారిపాలెం గ్రామానికి చెందిన జడ ఆనంద్(38) గత 18 సంవత్సరాలుగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్‌ఆర్‌ఈజీఎస్)లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులు వచ్చి ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఆనంద్‌ను ఫీల్డ్ అసిస్టెంట్ ఉద్యోగానికి రాజీనామా చేయాలని హెచ్చరించారు. ఉద్యోగానికి రాజీనామా చేయకపోతే ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు క్రిమినల్ కేసులు పెట్టి అరెస్ట్ చేయిస్తామని బెదిరిస్తున్నారు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఆనంద్ గురువారం మధ్యాహ్నం తన ఇంటి వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకురాగా, చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతిచెందాడు. ఆనంద్‌కు భార్య రత్నకుమారి, కుమార్తెలు దివ్య(10వ తరగతి), అర్షిత(8వ తరగతి), మహి(7వ తరగతి) ఉన్నారు. తన భర్త మృతికి గోపాళంవారిపాలెం గ్రామానికి చెందిన చిన్నం రవిబాబు, గోపాళం సాగర్‌బాబు, గోరంట్ల బుజ్జి, గోపాళం శ్రీధర్, మిన్నకంటి వీరబాబు, మానుకొండ బాలయ్య తదితరుల వేధింపులే కారణమని రత్నకుమారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పని ఒత్తిడి, ఆపై జ్వరం.. ఆశ వర్కర్ మృతి

మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా



మృతురాలు తోట రాధ(ఫైల్)

ఎ.కొండూరు (తిరువూరు): తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఆశ వర్కర్ మృతి చెందిన ఘటన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరులో గురువారం చోటుచేసుకుంది. ఎ.కొండూరు గ్రామానికి చెందిన తోట రాధ (42) సుమారు 18 ఏళ్లుగా ఆశ వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తుంది. వారం క్రితం జ్వరం బారిన పడ్డారు. రాధ జ్వరంతో బాధపడుతూనే ఫీవర్ సర్వే నిర్వహించారు. పని ఒత్తిడి పెరగడం, తీవ్ర జ్వరంతో బాధపడుతూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం చేయించుకున్నప్పటికీ నయంకాలేదు. దీంతో తిరువూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం చినఅవుటపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాధ మృతి చెందారు. మృతురాలికి భర్త, ఇద్దరు సంతానం ఉన్నారు.

న్యాయం చేయాలని ధర్నా

తోట రాధ కుటుంబానికి న్యాయం చేయాలంటూ సీఐటీయూ, ఆశ వర్కర్లు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు గురువారం ధర్నా చేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.కమల, సీఐటీయూ మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వైద్యాధికారులు నిర్లక్ష్యం వల్ల మృతి చెందిన రాధ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. మృతురాలి కుమార్తెకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, రాధకు సెలవు ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకోవాలని, రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, వైద్యాధికారులు మృతురాలి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా జ్వరంతో సర్వేలు చేయొద్దు.. రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని సూచించామని ఎ.కొండూరు పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యాధికారి కె.శ్రీనివాసరావు చెప్పారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని ఆదేశాల మేరకు మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు అందజేశామని వివరించారు.

దుర్గమ్మ సేవలో జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు



ఆశీర్వచన మండపంలో జస్టిస్ దుర్గాప్రసాద్‌రావు దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ రావు కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. తెల్లవారుజామున అమ్మవారి దర్శనానికి విచ్చేసిన జస్టిస్ దుర్గాప్రసాద్‌రావుకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు ఖడ్గమాలార్చన సేవలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

సీఏ ఫలితాల్లో మెరిసిన సీమ విద్యార్థులు

- తేజస్వినికి ఆలిండియా 14వ ర్యాంక్
- 15వ ర్యాంక్ సాధించిన హరికృష్ణ
- వర్షితరెడ్డికి 37వ ర్యాంక్



తల్లిదండ్రులతో హరికృష్ణ



తల్లిదండ్రులతో తేజస్విని



వర్షితరెడ్డి

తంబళ్లపల్లె/మదనపల్లె సిటీ: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గురువారం సీఏ ఫైనల్, సీఏ ఇంటర్ ఫలితాలను ప్రకటించింది. ఐసీఏఐ సీఏ ఫైనల్ పరీక్షలో అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె మండలం కన్నెమడుగుకు చెందిన కొత్తపేట రఘురామిరెడ్డి, నాగవేణి దంపతుల కుమార్తె తేజస్విని ఆలిండియా స్థాయిలో 14వ ర్యాంక్ సాధించింది. ఇవే ఫలితాల్లో తంబళ్లపల్లె మండలం ఆర్ఎన్ తండా పంచాయతీ ఎద్దులవేమన్న గారిపల్లె కొట్టాలకు చెందిన గంగిరెడ్డి, రమణమ్మ కుమారుడు ఎద్దుల హరికృష్ణ ఆల్ ఇండియా స్థాయి 15వ ర్యాంకు సాధించాడు. 600 మార్కులకు 454 మార్కులు పొందాడు. సీఏ ఫైనల్ పరీక్షలో మదనపల్లె ఎస్‌బీఐ కాలనీకి చెందిన వై.వర్షితరెడ్డి ఆల్ ఇండియా స్థాయిలో 37వ ర్యాంకు సాధించింది. 600 మార్కులకు 428 మార్కులు తెచ్చుకుంది.

ప్రేమోన్మాది ఆత్మహత్య

ఐదురోజుల క్రితం బాలికను హతమార్చిన నిందితుడు

- ప్రేమ నిరాకరించి, జైలుకు పంపిందని బాలికపై పగ
- మృతురాలి ఇంటి సమీపంలోని గడ్డిదుబ్బులో బలవన్మరణం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రాంబిల్లి (అచ్యుతాపురం): తన ప్రేమను నిరాకరించి, జైలుకు పంపిందనే పగతో 14 ఏళ్ల బాలికను ఐదురోజుల క్రితం హతమార్చిన ప్రేమోన్మాది చివరకు శవమై కనిపించాడు. అతని మృతదేహం బాలిక ఇంటి సమీపంలోని గడ్డిదుబ్బుల్లో లభ్యమైంది. అనకాపల్లి జిల్లా, రాంబిల్లి మండలం, కొప్పుగొండుపాలెంలో బద్ది దర్శిని(14) అనే బాలికను ఈనెల 6వ తేదీ రాత్రి కశింకోట మండలానికి చెందిన సురేశ్ గొంతు కోసి హతమార్చాడు. ప్రేమ పేరుతో వేధిస్తున్న అతనిపై దర్శిని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోక్సో కేసు పెట్టి అరెస్టు చేశారు. బాలికను రాంబిల్లి మండలంలో అమ్మమ్మ ఇంట చదివిస్తున్నారు. బెయిల్‌పై వచ్చిన సురేశ్, తనను జైలుకు పంపిందన్న కక్షతో దర్శినిని హతమార్చాడు. ఘటనా స్థలంలో వదిలి వెళ్లిన లేఖలో 'ఇద్దరం కలిసి ఉండాలి.. లేదా ఇద్దరం చనిపోవాలి' అని పేర్కొన్నాడు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన కొద్దికాలానికి జరిగిన ఈ ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు 12 బృందాలను ఏర్పాటు చేశారు. ఈక్రమంలో గురువారం బాలిక ఇంటికి సుమారు రెండు వందల మీటర్ల దూరంలో కొండలాంటి ప్రాంతంలో గడ్డిదుబ్బుల మాటున సురేశ్ శవమై కనిపించాడు. బుధవారం సాయంత్రం అక్కడికి సమీపంలోని రైతులకు దుర్వాసన వచ్చింది. అప్పటికే చీకటి పడటంతో మరుసటిరోజు ఉదయం పరిశీలించగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న ఓ యువకుని మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పరవాడ డీఎస్పీ సత్యనారాయణ, సీఐ నర్సింగరావు నేతృత్వంలోని బృందం శవాన్ని పరిశీలించి లభించిన ఆధారం మేరకు సురేశ్‌గా నిర్ధారించారు. ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. సురేశ్ జేబులో కొంత నగదు, రాసిన లేఖ జిరాక్స్ కాపీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలిస్తున్న సమయంలో ఆ వాహనాన్ని దర్శిని కుటుంబీకులు అడ్డుకున్నారు. తమ కుమార్తెకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే... బెయిల్‌పై బయటకు వచ్చిన వ్యక్తికి సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించి, బాలిక కుటుంబాన్ని అప్రమత్తం చేస్తే ఇటువంటి దురాగతం జరిగేది కాదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిందితుడు మళ్లీ బాలిక వెంట పడుతున్నట్టు ఆమె కుటుంబ సభ్యులు రాంబిల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసిందని, దీనిపై వారు ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఘటన జరిగిన మర్నాడు అనకాపల్లిలో హోంమంత్రి అనితను విలేకరులు ప్రశ్నించగా, అలాంటిది జరిగినట్టు తన దృష్టికి రాలేదని, అదే నిజమైతే సంబంధిత పోలీస్ సిబ్బందిపై చర్యలు చేపడతామని చెప్పారు. చివరకు రాంబిల్లి ఎస్‌ఐ ముకుందరావును బుధవారం వీఆర్‌పై పంపారు. ఇంత జరిగినా బాలిక కుటుంబాన్ని హోం మంత్రి పరామర్శించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గన్నవరం టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసులో 15 మందికి రిమాండ్

గన్నవరం: కృష్ణాజిల్లా గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై గతంలో జరిగిన దాడి కేసులో 15 మందికి గన్నవరం 12వ ఏఎంఎం కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ కేసులో మొత్తం 71 మంది వైఎస్సార్‌సీపీ నాయకులను పోలీసులు నిందితులుగా చేర్చి.. 15 మందిని అరెస్ట్ చేశారు. వారిని బుధవారం సాయంత్రం కోర్టులో హాజరుపరచగా ఎఫ్ఐఆర్‌లో నిందితుల పేర్లలో తప్పులు ఉండటాన్ని న్యాయస్థానం గుర్తించింది. ఆ తప్పులను సవరించి తిరిగి కోర్టు ముందు ఉంచాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. అనంతరం నిందితులను హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు. అనంతరం వీరిని నూజివీడు సబ్‌జైలుకు పోలీసులు తరలించారు.

విమానం లేక మదీనాలో ఏపీ భక్తుల అవస్థలు

440 మంది హజ్ యాత్రికుల అవస్థలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: హజ్ యాత్రకు వెళ్లిన ఆంధ్రప్రదేశ్ హాజీలు విమానం లేక మదీనాలో పడిగాపులు పడుతున్నారు. 440 మంది హజ్ యాత్రికులు గంటల తరబడి నిరీక్షిస్తూ అవస్థలు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం యంత్రాంగం పట్టించుకోవడం లేదు. సౌదీ అరేబియాలోని మదీనా విమానాశ్రయంలో చిక్కుకుపోయిన హజ్ యాత్రికులు తమ అవస్థలను గురువారం రాత్రి సెల్ఫీ వీడియో ద్వారా తమ కుటుంబ సభ్యులకు పంపించారు. ఈ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.

ప్రభుత్వ వైఫల్యమే కారణం

హజ్ యాత్రికుల అవస్థలకు అసలు కారణాలను పరిశీలిస్తే.. ప్రభుత్వ వైఫల్యం, శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లిన వారు బుధవారం నుంచి తిరుగుముఖం పడుతున్నారు. హజ్ యాత్రికులను తీసుకుని తొలి విమానం బుధవారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయానికి చేరింది. రెండో విమానం గురువారం సాయంత్రం 3.50 గంటల నుంచి 4 గంటల మధ్య గన్నవరం చేరుకుంటుందని ప్రకటించారు. ఆలస్యం అయ్యిందని రాత్రి 8.30 మళ్లీ ప్రకటించారు. ఆ సమయానికి కూడా విమానం రాకపోవడంతో రాత్రి 9.30 అని చెప్పినా రాలేదు. చివరకు ఏ టైమ్‌కు వస్తుందో చెప్పలేమని స్థానికంగా ఉన్న హజ్ కమిటీ యంత్రాంగం చేతులెత్తేసింది. అసలు విషయం ఏమిటంటే.. బుధవారం హజ్ యాత్రికులను తీసుకొచ్చిన విమానమే మదీనా విమానాశ్రయానికి తిరిగి వెళ్లి గురువారం సాయంత్రానికి హజ్ యాత్రికులను గన్నవరం విమానాశ్రయానికి తీసుకునిరావాల్సి ఉంది. తీరా ఆ విమానం మదీనాకు రాలేదని.. దానికోసం బుధవారం నుంచి విమానాశ్రయంలోనే పడిగాపులు పడుతున్నామని హజ్ యాత్రికులు సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేశారు. తమలో 60 ఏళ్లు దాటిన వారు చాలా మంది ఉన్నారని, ప్రకటించిన సమయానికి విమానం రాకపోవడంతో తీవ్ర మానసిక, ఆరోగ్య ఒత్తిడిలతో అవస్థ పడుతున్నామని వాపోయారు. తమ అవస్థలకు ప్రభుత్వమే కారణమని సెల్ఫీ వీడియోలో ఆరోపించారు. ఏపీ హజ్ కమిటీ యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వ సమన్వయ లోపం, తీవ్ర వైఫల్యం కారణంగానే ఈసారి యాత్రికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఏపీ హజ్ కమిటీ మాజీ సభ్యుడు సయ్యద్ వలీ ఉల్లాహ్ హుస్సేనీ ఆవేదన వ్యక్తం చేశారు.

డీసీ కార్యాలయంపై దాడి ఘటనలో చర్యలేవి?

- ఎఫ్ఐఆర్ నమోదు చేసి చేతులు దులుపుకొన్న నగర పోలీసులు
- అయితే ఆ ఎఫ్ఐఆర్‌లో నిందితుల పేర్లు చేర్చకపోవడంపై అనుమానాలు
- టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో కేసు నీరుగార్చే యత్నం



డీసీ కార్యాలయంపై బుధవారం దాడికి పాల్పడుతున్న టీడీపీ అనుబంధ సంఘాలు

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు) : విశాఖ నగరంలోని డెక్కన్ క్రానికల్ కార్యాలయంపై టీడీపీ అనుబంధ సంఘాలు దాడికి పాల్పడిన ఘటనపై నగర పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఒక జాతీయ పత్రికా కార్యాలయంపై టీడీపీకి చెందిన టీఎన్ఎస్ఎఫ్, తెలుగు నాడు మహిళలు దాడికి పాల్పడినా రాష్ట్ర ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించడంపై అన్ని వర్గాల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. డీసీ కార్యాలయంపై అధికార పార్టీ దాడులకు తెగబడటం బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై యూటర్న్ తీసుకుందంటూ డెక్కన్ క్రానికల్ ఓ వార్తను ప్రచురించడంతో టీడీపీ సంఘాలు ఈ దాడికి పాల్పడ్డాయి. అయితే ఈ దాడి ఘటనపై డీసీ విశాఖ కార్యాలయం పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎఫ్ఐఆర్ నమోదైనా.. చర్యలు శూన్యం

డీసీ కార్యాలయంపై దాడి ఘటనపై ఎంవీపీ పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. అధికార పార్టీకి చెందిన వ్యక్తులు ఈ దాడికి పాల్పడటంతో కేసు నమోదు విషయంలో అనేక నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. బుధవారం ఘటన జరిగితే గురువారం వరకు కేసు నమోదు చేయలేదు. దీంతో పాటు ఎఫ్ఐఆర్‌ను బహిర్గతం చేయకుండా పోలీసులు గోప్యత పాటిస్తున్నారు. అయితే ఎట్టకేలకు ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించిన ఎంవీపీ పోలీసులు.. 329(4), 326(ఎఫ్), 324(4), 79 ఆర్/డబ్ల్యూ3(5) బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు తెలిపారు. అయితే ఎఫ్ఐఆర్‌లో దాడికి పాల్పడిన వారు ఎవరి పేర్లూ నమోదు చేయలేదని పోలీసులు చెప్పడం అనేక అనుమానాలకు తావిస్తోంది. దాడులకు పాల్పడిన వారికి కొమ్ము కాసేందుకు పోలీసు శాఖ తన సర్వశక్తులు ఒడ్డుతోందని విమర్శలొస్తున్నాయి. టీడీపీ పెద్దల ఒత్తిళ్లతోనే దాడికి పాల్పడిన వారి పేర్లు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయలేదంటున్నారు. దీంతో టీడీపీ నాయకులు, విశాఖ నగర పోలీసులు కలిసి ఈ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని సర్వత్రా ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

తొందరపాటు చర్యలొద్దు

- వైఎస్సార్‌సీపీ నేతల విషయంలో పోలీసులకు హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ 16వ తేదీకి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత దేవినేని అవినాష్‌కు హైకోర్టు ఊరటనిచ్చింది. తదుపరి విచారణ వరకు వారిపై ఎలాంటి తొందరపాటు.. కఠిన చర్యలేవీ తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 16వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించి పలువురు వైఎస్సార్‌సీపీ నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కొందరిని అరెస్ట్ కూడా చేశారు. ఈ నేపథ్యంలో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ లేళ్ల అప్పిరెడ్డి, రఘురాం, సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. గురువారం ఈ వ్యాజ్యాలపై జస్టిస్ కృపాసాగర్ విచారణ జరిపారు. పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించేందుకు సిద్ధమవ్వగా.. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతి స్పందిస్తూ.. పోలీసుల తరఫున అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు ఒకేసారి వింటానని న్యాయమూర్తి స్పష్టం చేశారు. పొన్నవోలు జోక్యం చేసుకుంటూ.. అలా అయితే అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. పిటిషనర్లకు తదుపరి విచారణ వరకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. తదుపరి విచారణ వరకు పిటిషనర్ల విషయంలో ఎలాంటి తొందరపాటు, కఠిన చర్యలేవీ తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. కాగా, గతంలో చంద్రబాబు ఇంటి వద్ద జరిగిన గొడవకు సంబంధించి నమోదైన కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ విషయంలో కూడా తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు.

'సెబ్'కు చిక్కిన 'గంజాయి' ముఠా

నలుగురి అరెస్టు / 353.80 కిలోల గంజాయి పట్టివేత



మాట్లాడుతున్న జిల్లా సెబ్ అధికారి పిట్టా సోమశేఖర్

రాజమహేంద్రవరం రూరల్: ఒడిశా నుంచి కాకినాడకు, అక్కడి నుంచి రాజస్థాన్‌కు గంజాయి తరలిస్తున్న ముఠా గుట్టును స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ–సెబ్) రాజమహేంద్రవరం సౌత్‌స్టేషన్ పోలీసులు రట్టు చేశారు. వారిలో నలుగురిని అరెస్టు చేసి.. రూ.20 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాజమహేంద్రవరం సెబ్ సౌత్ స్టేషన్‌లో గురువారం జిల్లా సెబ్ అధికారి పిట్టా సోమశేఖర్ వివరాలు వెల్లడించారు. విజయవాడ సెబ్ కమిషనర్‌కు వచ్చిన సమాచారం మేరకు.. జిల్లా సెబ్ అధికారి సోమశేఖర్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ టి.గోపాలకృష్ణ, నిడదవోలు సెబ్ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం, సౌత్ ఎస్ఐలు దుర్గాప్రసాద్, శ్రీనివాస్, సిబ్బంది తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద తనిఖీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఓ లారీ క్యాబిన్‌లో ఉన్న 153.80 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన లారీ డ్రైవర్ సిరారామ్, హెల్పర్ గోమద్‌రామ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. వారు రాజస్థాన్ నుంచి లైమ్ పౌడర్‌ను బిక్కవోలులోని కేపీఆర్ ఫ్యాక్టరీకి లారీలో తీసుకుని వచ్చారు. తిరుగు ప్రయాణంలో కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామం ఇండస్ట్రియల్ ఏరియాలోని వినాయక విగ్రహాల తయారీ గోడౌన్ నుంచి ఈ గంజాయి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో సెబ్ అధికారులు కాకినాడలోని ఆ గోడౌన్‌ను కూడా తనిఖీ చేసి, మరో 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అక్కడ రాజస్థాన్‌కు గంజాయిని లోడ్ చేసిన కాకినాడ జిల్లా తిమ్మాపురానికి చెందిన కోటిబోయిన ప్రసాద్, ఒడిశా నుంచి గంజాయి సరఫరా చేసిన ప్రతాప్ మండల్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో గంజాయి రవాణా గుట్టు రట్టయ్యింది. రాజస్థాన్ రాష్ట్రం నాగూర్ జిల్లా సింగ్‌దాద్ గ్రామానికి చెందిన రాంనివాస్ అలియాస్ రాభాగాడియాకు, అతడి భాగస్వామి సందీప్‌కు ఈ గంజాయిని చేరవేస్తున్నట్లు నిందితులు తెలిపారు. దాడుల్లో 353.80 కిలోల గంజాయిని, రవాణా చేస్తున్న లారీని, నాలుగు సెల్ ఫోన్లు, రూ.4 వేలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో రాజస్థాన్‌కు చెందిన రాంనివాస్, సందీప్‌లను అరెస్టు చేయాల్సి ఉందని సోమశేఖర్ తెలిపారు.

వేడుకగా 'నారాయణ సక్సెస్ ఒడిస్సీ' ప్రోగ్రామ్



విజయవాడ: బెంగళూరు వైట్‌ఫీల్డ్‌లోని ఎంఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 'నారాయణ సక్సెస్ ఒడిస్సీ' కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. చైల్డ్ ప్రాడిజీ, యూఎస్ఏ స్పెల్‌బీ ఫైనలిస్ట్ మాస్టర్ ఆకాష్ వూకోటి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్న వయసులో సాధించిన విజయాన్ని నిలుపుకోవడం ఎలా? అనే అంశంపై చర్చ జరిగింది. అనంతరం కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పోటీ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 17 మంది విద్యార్థులను సత్కరించారు. ఆకాష్ వూకోటి ఆధ్వర్యంలో భాషా నైపుణ్యం, పోటీతత్వ స్ఫూర్తిని చాటే స్పెల్‌బీ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ గ్రూప్ సీఈవో పునీత్ కొత్తప మాట్లాడుతూ 'మా విద్యార్థుల విజయాలు వారి పట్టుదల, కృషికి' నిదర్శనమన్నారు. కేసెట్–2024లో స్టేట్ 4వ ర్యాంకు సాధించిన సనా తబస్సుమ్ మాట్లాడుతూ నారాయణ ప్రోగ్రామ్ వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. అనంతరం కర్ణాటక దర్శిని పేరుతో కర్ణాటక సంస్కృతి, వారసత్వం, చరిత్రను ప్రతిబింబించే వివిధ నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వెయ్యి మందికిపైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శివాని రాజా, ఇన్‌సెట్లో ప్రమాణం చేస్తున్న దృశ్యం

భగవద్గీత సాక్షిగా...

బ్రిటన్ ఎంపీగా కన్జర్వేటివ్ పార్టీ నేత శివాని రాజా ప్రమాణ స్వీకారం

భగవద్గీత గ్రంథంపై ప్రమాణం చేసిన రిషి సునాక్ సహా మరికొందరు ఎంపీలు

సిక్కు మత గ్రంథాలపై బ్రిటిష్-సిక్కు ఎంపీల ప్రమాణం

లండన్: బ్రిటిష్ పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందిన ఎంపీలు గురువారం హౌస్ ఆఫ్ కామన్స్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. విపక్ష కన్జర్వేటివ్ పార్టీ నేత, భారత సంతతి యువ ఎంపీ శివాని రాజా హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీత సాక్షిగా ప్రమాణ స్వీకారం చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 29 ఏళ్ల శివాని రాజా లీసెస్టర్ ఈస్ట్ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. లేబర్ పార్టీకి కంచు కోట లాంటి ఈ స్థానంలో 37 సంవత్సరాల తర్వాత కన్జర్వేటివ్ పార్టీ అభ్యర్థి జయకేతనం ఎగురవేయడం గమనార్హం. శివాని రాజాకు, కన్జర్వేటివ్ పార్టీకి ఇదొక చరిత్రాత్మక విజయమని చెప్పొచ్చు. ప్రమాణ స్వీకారం వీడియోను ఆమె 'ఎక్స్'లో పోస్టు చేశారు. లీసెస్టర్ ఈస్ట్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ పార్లమెంట్‌లో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. బ్రిటన్ రాజు చార్లెస్-3కి విధేయత ప్రకటిస్తూ ప్రజా ప్రతినిధిగా భగవద్గీతపై ప్రమాణం చేయడం గర్వంగా ఉందన్నారు.

రాజేశ్‌పై 4,426 ఓట్ల తేడాతో విజయం

శివాని రాజా 1994లో ఇంగ్లండ్‌లోని లీసెస్టర్ సిటీలో జన్మించారు. గుజరాత్ మూలాలున్న ఆమె తండ్రి 1970వ దశకంలో కెన్యా నుంచి ఇంగ్లండ్‌కు వలస వెళ్లారు. ఆమె తల్లి గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో జన్మించారు. శివాని కుటుంబం లీసెస్టర్‌షైర్‌లో స్థిరపడింది. డి మాంట్‌ఫోర్ట్ యూనివర్సిటీలో శివాని ఫార్మాస్యూటికల్, కాస్మెటిక్ సైన్స్‌లో డిగ్రీ చదివారు. పలు కాస్మెటిక్ సంస్థల్లో పనిచేశారు. ఆమె కుటుంబానికి చెందిన నిర్మాణం, అతిథ్య రంగ కంపెనీల్లో సేవలందించారు. కన్జర్వేటివ్ పార్టీలో చేరి చురుగ్గా పనిచేస్తుండడంతో ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం దక్కింది. తాజా ఎన్నికల్లో లీసెస్టర్ ఈస్ట్ నియోజకవర్గంలో లేబర్ పార్టీ అభ్యర్థి రాజేశ్ అగర్వాల్‌పై నెగ్గారు. ఇక్కడ 37 ఏళ్ల తర్వాత తన పార్టీకి విజయం సాధించిపెట్టారు. శివానికి 14,526, రాజేశ్ అగర్వాల్‌కు 10,100 ఓట్లు లభించాయి. ఎన్నికల ప్రచారంలో శివాని భారత సంతతి ఓటర్లతో మమేకమయ్యారు. సంప్రదాయ గార్బా నృత్య వేడుకల్లో పాల్గొన్నారు. హిందూ ఆలయాలను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. తన భారతీయ మూలాలను పలు సందర్భాల్లో వ్యక్తీకరించారు. తనను ఎంపీగా గెలిపిస్తే రహదారులు, ఆసుపత్రులను అభివృద్ధి చేస్తానని, వివిధ వర్గాల ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలను మెరుగుపరుస్తానని ప్రజలకు శివాని రాజా హామీ ఇచ్చారు.

స్పీకర్‌కు భగవద్గీత బహూకరణ

బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో ఈసారి 29 మంది భారత సంతతి నాయకులు గెలిచారు. పలువురు ఎంపీలుగా ప్రమాణ స్వీకారంచేశారు. శివాని రాజాతోపాటు బాబ్ బ్లాక్‌మన్, కనిష్క నారాయణ్, మాజీ ప్రధాని రిషి సునాక్ భగవద్గీతపై ప్రమాణం చేశారు. మాజీ ఎంపీ శైలేష్ వర నూతన భగవద్గీత గ్రంథాన్ని స్పీకర్ లిండ్సే హోలీకి బహూకరించారు. ఈ పుస్తకానికి భారత్‌లోని ఆలయంలో పూజలు చేసి తీసుకొచ్చినట్లు తెలిపారు. హౌస్ ఆఫ్ కామన్స్‌లో బ్రిటిష్-సిక్కు ఎంపీలు తాన్ ధేషి, గురిందర్‌సింగ్ జోసన్, హర్‌ప్రీత్ ఉప్పల్, సత్వీర్ కౌర్, వారిందర్‌సింగ్ జస్, ప్రీత్‌కౌర్ గిల్ తదితరులు పవిత్ర సిక్కు గ్రంథాలపై ప్రమాణం చేశారు. కేరళకు చెందిన సోజన్ జోసెఫ్ బైబిల్ కొత్త నిబంధన సాక్షిగా ప్రమాణం చేశారు. ప్రీతి పటేల్, క్లెయిర్ కొటిన్హో, మునీరా విల్సన్ 'కింగ్ జేమ్స్ బైబిల్'పై ప్రమాణం చేశారు.

సూదిమొనపై ఎయిడ్స్ భూతం

త్రిపురలో 800 మంది విద్యార్థులకు పాజిటివ్ • 47 మందిని కబళించిన హెచ్ఐవీ • మాదకద్రవ్యాల వాడకం మాటున విస్తరిస్తున్న ప్రాణాంతక వ్యాధి

చిన్న నిర్లక్ష్యం ఒక జీవితాన్నే తారుమారు చేస్తుంది. అలాంటిది భావిభారత పౌరులుగా ఎదగాల్సిన పాఠశాల విద్యార్థులు భయానక ఎయిడ్స్ భూతం బారిన పడితే ఆ పెను విషాదానికి అంతే ఉండదు. అలాంటి విపత్కర పరిస్థితిని ఈశాన్య రాష్ట్రం త్రిపుర ఎదుర్కొంటోంది. అక్కడి విద్యార్థుల పాలిట హెచ్ఐవీ వైరస్ మహమ్మారి పెద్ద శత్రువుగా తయారైంది. 800 మందికిపైగా విద్యార్థులు ప్రాణాంతక వ్యాధి బారిన పడిన కఠోర వాస్తవం అక్కడి రాష్ట్ర ప్రజలకు మాత్రమేకాదు యావత్‌భారతావనికి దుర్వార్తను మోసుకొచ్చింది. ఇంజెక్షన్ రూపంలో తీసుకునే మాదకద్రవ్యాల వినియోగం విద్యార్థుల్లో పెచ్చరిల్లడమే ఈ వైరస్ వ్యాప్తికి ప్రధాన కారణమని రాష్ట్ర నివేదికలో బట్టబయలైంది. త్రిపుర రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ నివేదిక అక్కడి దారుణ పరిస్థితులను కళ్లకు కట్టింది. పాఠశాల, కాలేజీ స్థాయిలోనే మాదకద్రవ్యాల విచ్చలవిడి వినియోగాన్ని అడ్డుకోలేక ప్రభుత్వ యంత్రాంగం మొద్దు నిద్ర పోతోందని జనం దుమ్మెత్తిపోస్తున్నారు. 828 మంది విద్యార్థులకు వైరస్ సోకిందని, వారిలో 47 మంది మరణించారని ప్రభుత్వం చెబుతోంది. 572 మంది విద్యార్థులు ఎయిడ్స్‌తో బాధపడుతున్నారు. అయితే వీరిలో చాలా మంది ఇప్పటికే పాఠశాల విద్యను పూర్తిచేసుకుని ఉన్నత చదువులకు రాష్ట్రాన్ని వీడారని ప్రభుత్వ అధికారి ఒకరు తాజాగా వెల్లడించారు. దీంతో వీరి వల్ల ఇతర రాష్ట్రాల్లో ఇంకెంత మందికి వ్యాధి సోకుతుందోనన్న భయాందోళనలు ఎక్కువయ్యాయి.

43 రెట్లు ఎక్కువ

శృంగారం, రక్తమార్పిడి, ఇతర కారణాల వల్ల ఎయిడ్స్ బారిన పడ్డ పేషెంట్లతో పోలిస్తే ఇంజెక్షన్ ద్వారా ఎయిడ్స్‌ను కొనితెచ్చికుంటున్న యువత సంఖ్య ఏకంగా 43 రెట్లు అధికంగా ఉందని గణాంకాలు విశ్లేషించాయి. ఇంజెక్షన్ ద్వారా డ్రగ్స్ తీసుకుని ఎయిడ్స్ బారినపడిన 16–30 ఏళ్ల వయసు వారిలో 87 శాతం మంది యుక్తవయసు వాళ్లే ఉన్నారు. ఇందులో 21–25 ఏళ్ల వయసు వారు ఏకంగా 43.5 శాతం మంది ఉన్నారు. 15 ఏళ్లలోపు వారు సైతం ఇంజెక్షన్ ద్వారా డ్రగ్స్ తీసుకుని ఎయిడ్స్ కోరల్లో చిక్కుకున్నారు.

విద్యార్థుల్లో డ్రగ్స్ విచ్చలవిడి వినియోగం

''త్రిపురలో ఏటా వందల హెచ్ఐవీ పాజిటివ్ కేసులు బయటపడుతున్నాయి. ఇటీవలికాలంలో పాఠశాల, కాలేజీ విద్యార్థులకు ఎక్కువగా హెచ్ఐవీ సోకుతోంది. ఇంజెక్షన్ ద్వారా డ్రగ్స్ తీసుకునే విష సంస్కృతి ఇక్కడ విస్తరించింది. హెచ్ఐవీ సోకిన వ్యక్తి వాడిన ఇంజెక్షన్‌ను ఇంకొక వ్యక్తి వాడటం ద్వారా హెచ్ఐవీ సోకడం చాపకింద నీరులా వేగంగా విస్తరిస్తోంది. 2015–2020 కాలంలో ఇంజెక్షన్ ద్వారా డ్రగ్స్ వాడకం(ఐడీయూ) 5 శాతముంటే కోవిడ్ తర్వాత అంటే 2020–23లో అది రెట్టింపు అయింది. హెచ్ఐవీ/ఎయిడ్స్ పాజిటివ్ రేట్ కూడా పెరిగింది. శృంగారం ద్వారా హెచ్ఐవీ వ్యాప్తి తగ్గింది. సెక్స్ ద్వారా వ్యాప్తి రేటు గత ఏడాది 2శాతం కూడా లేదు. కానీ సూది ద్వారా హెచ్ఐవీ వ్యాప్తి చాలా ఎక్కువైంది'' అని త్రిపుర రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ సమర్పితా దత్తా వెల్లడించారు. గత దశాబ్దంతో పోలిస్తే 2023 జూలైలో ఎయిడ్స్ బాధితుల సంఖ్య 300 శాతం పెరగడం రాష్ట్రంలో హెచ్ఐవీ ఎంతగా కోరలు చాచిందనేది నిజాన్ని చాటిచెప్తోంది.



అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం

నివేదిక బయటికొచ్చాక మీడియాలో, ప్రజల్లో గగ్గోలు మొదలైంది. విమర్శలు వెల్లువెత్తడంపై మాణిక్ సాహా సర్కార్ అప్రమత్తమైంది. మాదకద్రవ్యాల అక్రమ సరఫరా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని సీఎం సాహా ప్రకటించారు. ''పాజిటివ్ వచ్చిన విద్యార్థుల గురించి పట్టించుకుంటున్నాం. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయా విద్యార్థులందరికీ యాంటీ-రిట్రోవైరల్ ట్రీట్‌మెంట్(ఏఆర్‌టీ) ఇప్పిస్తున్నాం'' అని సాహా స్పష్టంచేశారు.

సంపన్నుల పిల్లలే ఎక్కువ

మాదక ద్రవ్యాలు ఖరీదైనవి. వీటిని కొనేంత స్తోమత సాధారణ కుటుంబాలకు చెందిన పాఠశాల, కాలేజీ విద్యార్థులకు ఉండదు. సంపన్నులకే ఇది సాధ్యం. ప్రభుత్వ నివేదికలోనూ ఇదే స్పష్టమైంది. ఎక్కువ మంది పిల్లలు సంపన్న కుటుంబాలకు చెందిన వాళ్లే ఉన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులు కావడం గమనార్హం. 'ఉద్యోగాల్లో బిజీగా మారి తమ పిల్లలు ఏం చేస్తున్నారు? పాకెట్ మనీని వేటి కోసం ఖర్చుచేస్తున్నారు? అనే నిఘా బాధ్యత తల్లిదండ్రులకు లేదు. అందుకే పిల్లల భవిష్యత్తు ఇలా అగమ్యగోచరమైంది' అని సమర్పిత అన్నారు.

హెచ్ఐవీ/ఎయిడ్స్ చికిత్సకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యుత్తమ విధానం ఏఆర్‌టీ. శరీరంలో వైరస్ లోడును తగ్గించేందుకు పలు రకాలైన మందులను రోగులకు ఇస్తారు. ఏఆర్‌టీ ద్వారా రక్తంలో వైరస్ క్రియాశీలతను తగ్గించవచ్చు. వ్యాధినిరోధక శక్తిని పెంపొందిస్తూనే ఎయిడ్స్ మరింత ముదరకుండా ఏఆర్‌టీ చూస్తుంది. అయితే ఎయిడ్స్‌ను శాశ్వతంగా నయం చేయలేముగానీ ఆ మనిషి జీవితకాలాన్ని ఇంకొన్ని సంవత్సరాలు పొడిగించేందుకు ఈ చికిత్సవిధానం సాయపడుతుంది. మే నెల నాటికి చికిత్స కోసం రాష్ట్రంలోని ఏఆర్‌టీ కేంద్రాల్లో 8,729 మంది తమ పేర్లను నమోదుచేసుకున్నారు. మే నెల లెక్కల ప్రకారం 5,674 మంది హెచ్ఐవీతో బాధపడుతున్నారు. కొత్త కేసుల్లో టీనేజీ వాళ్లు ఎక్కువగా ఉంటున్నారన్న మీడియా వార్తలు అక్కడి టీనేజర్ల తల్లిదండ్రులకు హెచ్చరికలు చేస్తున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

పిడుగుపాటుకు 38 మంది మృతి

ఉత్తరప్రదేశ్‌లో ఘోరం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో పిడుగులు పడిన ఘటనలు పలువురి ప్రాణాలు బలిగొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పిడుగుపాటుకు గురై కనీసం 38 మంది మరణించారని అధికారులు గురువారం ప్రకటించారు. ప్రతాప్‌గఢ్‌లో అత్యధికంగా 11 మంది మృతి చెందారు. సుల్తాన్‌పూర్‌లో ఏడుగురు, చందౌలీలో ఆరుగురు, మెయిన్‌పురిలో ఐదుగురు, ప్రయాగ్‌రాజ్‌లో నలుగురు, ఔరయ్యా, డియోరియా, హత్రాస్, వారణాసి, సిద్ధార్థనగర్‌లలో ఒక్కొక్కరు మరణించారు. అనేక మందికి కాలిన గాయాలయ్యాయి. తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని చందౌలీ జిల్లాలో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్య మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ ఘటనలో 13, 15 ఏళ్లున్న ఇద్దరుతో సహా చాలా మంది బాధితులు పొలంలో పనిచేస్తున్నారు. అప్పుడే చేపలు పట్టేటప్పుడు పిడుగుపాటుకు గురయ్యారు. సుల్తాన్‌పూర్‌లో ముగ్గురు చిన్నారులుసహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. కొందరు వరి నాట్లు వేస్తుండగా, ఒకరు మామిడి కాయలు కోసేందుకు వెళ్లి, మరొకరు తాగునీరు తెచ్చేందుకు వెళ్లి పిడుగుపాటుకు గురయ్యారు. బుధవారం భారీ వర్షం కురుస్తుండగా చెట్టు కింద తలదాచుకుంటున్న ఓ మహిళ పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. వర్షం కురుస్తుండటంతో మామిడి చెట్టు కింద తలదాచుకుంటున్న 14 ఏళ్ల బాలుడు మృతి చెందాడు. డియోరియాలో పొలంలో ఉన్న కుటుంబ సభ్యుల దగ్గరకు వెళ్తుండగా పిడుగుపడి 5 ఏళ్ల బాలిక మరణించింది. వారణాసిలో ఇద్దరు సోదరులు పిడుగుపాటుకు గురయ్యారు. ఒకరు కాలిన గాయాలతో మృతి చెందగా, మరొకరు ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. రాబోయే ఐదు రోజుల్లో ఉత్తరప్రదేశ్. దాని పరిసర రాష్ట్రాలు. కేంద్ర పాలిత ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది.

పార్లమెంట్‌లో నిలదీస్తాం

మణిపూర్‌లో శాంతిస్థాపన కోసం పోరాడతాం: రాహుల్

న్యూఢిల్లీ: మణిపూర్‌లో శాంతిస్థాపన కోసం పార్లమెంట్ వేదికగా పోరాడతామని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో నెలకొన్న విషాదాన్ని పారద్రోలి శాంతినెలకొనేందుకు చర్యలు చేపట్టేలా ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తామని ఆయన వ్యాఖ్యానించారు. ప్రధాని మోదీ రాష్ట్రంలో పర్యటించి అక్కడి వారి బాధలను అర్థంచేసుకుని ఘర్షణలకు చరమగీతం పాడాలని కోరారు. ఈ మేరకు ఇటీవల ఆయన మణిపూర్‌లో పర్యటన, బాధితులతో మాట్లాడటం తదితర ఘటనల వీడియోను గురువారం 'ఎక్స్'లో షేర్‌చేస్తూ హిందీలో పలు పోస్టులుచేశారు. 'మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాక మూడుసార్లు రాష్ట్రంలో పర్యటించా. ఇన్నిరోజులైన అక్కడి పరిస్థితిలో మార్పురాలేదు. ఇప్పటికీ అక్కడి జనం రెండు వర్గాలుగా విడిపోయి బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వేలాది కుటుంబాలు దిక్కులేక శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నాయి. ప్రధాని మోదీ వ్యక్తిగతంగానైనా ఒక్కసారి మణిపూర్‌లో పర్యటించి అక్కడి వారి బాధలను వినాలి. శాంతియుత వాతావరణం నెలకొనేందుకు కృషి చేయాలి' అని అన్నారు. 'పార్లమెంట్‌లో మణిపూర్ అంశాన్ని ప్రస్తావిస్తాం. శాంతిస్థాపన కోసం చర్యలు తీసుకునేదాకా కాంగ్రెస్, 'ఇండియా' కూటమి మోదీ సర్కార్‌పై తీవ్ర ఒత్తిడి తీసుకొస్తాయి' అని అన్నారు. ' మీ వాణిని పార్లమెంట్‌లో వినిపిస్తాగానీ మీరు శరణార్థి శిబిరాలను వీడి స్వస్థలాలకు ఎప్పటికల్లా వెళ్లగలరు? అనే ప్రశ్నకు సమాధానం ప్రభుత్వం వద్దే ఉంది'' అని అన్నారు.

సుప్రీంకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జీలు

న్యూఢిల్లీ: హైకోర్టుల జడ్జీలు ఎన్.కోటిశ్వర్ సింగ్, ఆర్.మహదేవన్‌లకు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం గురువారం సిఫారసు చేసింది. కోటిశ్వర్ సింగ్ ప్రస్తుతం జమ్మూకశ్మీర్-లద్దాఖ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఉండగా, మహదేవన్ మద్రాస్ హైకోర్టు తాత్కాలిక చీఫ్ జస్టిస్‌గా కొనసాగుతున్నారు. వీరిద్దరికి సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించాలని కొలీజియం సిఫారసు చేసింది. కొలీజియంలో సీజే చంద్రచూడ్‌తో పాటు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హృషికేశ్ రాయ్ సభ్యులుగా ఉన్నారు. సుప్రీంకోర్టులో మంజూరైన జడ్జి పోస్టులు 34 కాగా ప్రస్తుతం 32 మంది ఉన్నారు.

మత్తులోనే మిహిర్ డ్రైవింగ్

ముంబై: ముంబైలో ఆదివారం ఉదయం జరిగిన బీఎండబ్ల్యూ హిట్ అండ్ రన్ కేసు దర్యాప్తు వేగం పుంజుకుంది. కారు ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న మహిళ కావేరి(45) చనిపోగా ఆమె భర్త గాయపడటం తెల్సిందే. ఆ సమయంలో కారు నడుపుతున్న శివసేన నేత రాజేశ్ షా కుమారుడు, ప్రధాన నిందితుడు మిహిర్ షా మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గురువారం ధ్రువీకరించుకున్నారు. మిహిర్ షాను పాల్ఘార్ జిల్లాలోని విరార్ ఫటాలో మంగళవారం అరెస్ట్ చేయగా కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. ఆదివారం జరిగిన ఘటనలపై పోలీసులు సీన్ రీక్రియేట్ చేస్తున్నారు. గురువారం ఉదయం బైక్‌ను ఢీకొన్న ప్రాంతం వర్లీలోని అనీబీసెంట్ మార్గం నుంచి కారు బాయ్‌నెట్‌లో కావేరి చిక్కుకున్న తర్వాత కూడా ఒకటిన్నర కిలోమీటర్ల దూరం బాంద్రా వర్లీ సీ లింక్‌పైకి వెళ్లిన మార్గం..ఆ తర్వాత కావేరిని బాయ్‌నెట్ నుంచి వేరు చేసి రోడ్డుపై పడుకోబెట్టడం, డ్రైవర్ రాజర్షి బిదావత్ కారును ఆమెపైకి పోనివ్వడం వంటి ఘటనల క్రమాన్ని ఇద్దరినీ తీసుకెళ్లి వివరంగా తెల్సుకున్నారు. రాజేశ్ షా సూచనల మేరకే ఆ సమయంలో కారును బిదావత్ నడిపినట్లు కూడా వెల్లడైందని పోలీసులు తెలిపారు.

ఎయిమ్స్‌లో రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్(73) గురువారం ఉదయం ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరారు. ఆయన వెన్ను నొప్పితో బాధపడుతున్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. పాత ప్రైవేట్ వార్డులో ఆయనకు సంబంధిత పరీక్షలు జరుగుతున్నాయని ఎయిమ్స్ మీడియా ఇన్‌చార్జి డాక్టర్ రిమా దాదా చెప్పారు. రాజ్‌నాథ్ పరిస్థితి నిలకడగా ఉందన్నారు.



బుధవారం వాషింగ్టన్‌లో నాటో దేశాల ముగింపు సమావేశంలో సభ్య దేశాల నేతలతో అమెరికా అధ్యక్షుడు బైడెన్ గ్రూప్ ఫొటో

విధ్వంసకారి చైనా

'నాటో'దేశాల నేతల మండిపాటు • 'వాషింగ్టన్ సమ్మిట్ డిక్లరేషన్' విడుదల

వాషింగ్టన్/బీజింగ్: చైనా-రష్యా దేశాల మధ్య బంధం నానాటికీ బలపడుతుండడం పట్ల నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్(నాటో) సభ్యదేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. యుద్ధం పేరిట ఉక్రెయిన్‌లో విధ్వంసానికి రష్యాకు చైనా అండదండలు అందిస్తోందని మండిపడ్డాయి. డ్రాగన్ దేశం నిర్ణయాత్మక విధ్వంసకారిగా మారిందని ఆరోపించాయి. రష్యాతో భాగస్వామ్యానికి ఎలాంటి పరిమితులు లేవంటూ చైనా నాయకత్వం చేసిన ప్రకటనలను నాటో దేశాలు ప్రస్తావించాయి. రష్యా రక్షణ పారిశ్రామిక రంగానికి చైనా పూర్తిస్థాయిలో మద్దతుగా నిలుస్తోందని, దీనివల్ల రష్యా పొరుగు దేశాలతోపాటు యూరో-అట్లాంటిక్ భద్రతకు పెనుముప్పు పొంచి ఉందని వెల్లడించాయి. అమెరికాలోని వాషింగ్టన్‌లో నాటోలోని 32 సభ్యదేశాల అధినేతలు, ప్రతినిధులు సమావేశమయ్యారు. కూటమి 75వ వార్షికోత్సవాల్లో పాల్గొన్నారు. కూటమిలో 32వ సభ్యదేశంగా చేరిన స్వీడన్‌కు సాదర స్వాగతం పలికారు. భేటీ అనంతరం 'వాషింగ్టన్ సమ్మిట్ డిక్లరేషన్' పేరిట ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. చైనా దుందుడుకు విధానాలు, చర్యలు తమ ప్రయోజనాలకు, భద్రతకు, విలువలకు సవాలు విసిరేలా ఉంటున్నాయని మండిపడ్డారు.

రష్యాకు మద్దతిస్తే చైనాకే నష్టం

ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశమైన చైనా బాధ్యతాయుతంగా మసలుకోవాలని నాటో సభ్యదేశాల ప్రతినిధులు హితవు పలికారు. ఉక్రెయిన్‌లో అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న రష్యాకు సహకరించుకోవడం తక్షణమే నిలిపివేయాలని సూచించారు. ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు కట్టుబడి ఉండాల్సిన బాధ్యత చైనాపై ఉందని పునరుద్ఘాటించారు. రష్యాకు ఆయుధపరంగా, రాజకీయంగా ఎలాంటి సహకారం అందించవద్దని స్పష్టం చేశారు. రష్యాను గుడ్డిగా వెనుకేసుకొస్తే చైనాయే నష్టపోతుందని, ప్రపంచంలో ఏకాకిగా మారుతుందని తేల్చిచెప్పారు. రష్యా-చైనా-ఉత్తర కొరియా దేశాల మధ్య స్నేహ సంబంధాలు కొత్త చివుళ్లు తొడుగుతున్న నేపథ్యంలో దానికి ప్రతిచర్యగా ఇండో-పసిఫిక్ దేశాలతో భాగస్వామ్యాన్ని మెరుగుపర్చుకుంటామని నాటో సెక్రెటరీ జనరల్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ ప్రకటించారు.

అలజడి యత్నాలు మానుకోండి: చైనా

ఉక్రెయిన్‌పై రష్యా సాగిస్తున్న యుద్ధంలో చైనా విధ్వంసకారిగా మారిందంటూ నాటో కూటమి నేతలు చేసిన విమర్శలను చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ గురువారం ఖండించారు. సొంత భద్రత కోసం ఇతర దేశాల ప్రయోజనాలను బలిపెట్టడం నాటో దేశాలకు అలవాటేనని విమర్శించారు. ఆసియాలో అలజడి సృష్టించాలన్న ప్రయత్నాలు మానుకోవాలని చెప్పారు.

నాటో సభ్య దేశాలు ఇవి...

1.అమెరికా, 2.యునైటెడ్ కింగ్‌డమ్, 3.అల్బేనియా, 4.బెల్జియం, 5.బల్గేరియా, 6.కెనడా, 7.క్రొయేషియా, 8.చెక్ రిపబ్లిక్, 9.డెన్మార్క్, 10.ఎస్తోనియా, 11.ఫిన్‌లాండ్, 12.ఫ్రాన్స్, 13.జర్మనీ, 14.గ్రీస్, 15.హంగేరీ, 16.ఐస్‌లాండ్, 17.ఇటలీ, 18.లాత్వియా, 19.లిథువేనియా, 20.లక్సెంబర్గ్, 21.మాంటినెగ్రో, 22.నెదర్లాండ్స్, 23.నార్త్ మాసిడోనియా, 24.నార్వే, 25.పోలాండ్, 26.పోర్చుగల్, 27.రొమేనియా, 28.స్లొవేకియా, 29.స్లొవేనియా, 30.స్పెయిన్, 31.స్వీడన్, 32.తుర్కియే

ఎల్ఎల్‌బీలో మనుస్మృతి ప్రతిపాదన తిరస్కరణ

న్యూఢిల్లీ: ఢిల్లీ యూనివర్శిటీలో న్యాయ విద్యార్థులకు మనుస్మృతిని బోధించాలని న్యాయ విభాగం అధ్యాపక బృందం చేసిన ప్రతిపాదనను తిరస్కరించినట్లు వర్శిటీ వైస్ ఛాన్సలర్ యోగేశ్ స్పష్టం చేశారు. విద్యార్థులకు మనుస్మృతిని బోధించబోమని చెప్పారు. ఎల్ఎల్‌బీ ప్రథమ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు మనుస్మృతిని బోధించేందుకు వీలుగా సిలబస్‌ను మార్చాలని న్యాయశాస్త్ర విభాగం ఢిల్లీ యూనివర్శిటీ అత్యున్నత విధాన నిర్ణాయక మండలి అయిన అకడమిక్ కౌన్సిల్‌ను కోరింది. మొదటి, ఆరో సెమిస్టర్ విద్యార్థులకు మనుభాష్య ఆఫ్ మెధాతిథి , కామెంటరీ ఆఫ్ మనుస్మృతి-స్మృతిచంద్రిక పుస్తకాలను పాఠ్యాంశాలుగా చేర్చాలని ప్రతిపాదించింది. విమర్శలు వెల్లువెత్తడంతో ఈ ప్రతిపాదనను తిరస్కరించినట్లు యోగేశ్ గురువారం రాత్రి చెప్పారు.

నీట్‌పై విచారణ 18కి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ అవకతవకల ఆరోపణలపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, ఈ వ్యవహారంపై విచారణ చేపట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్లు గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ముందుకొచ్చాయి. ఈ పిటిషన్లను సోమవారం విచారిస్తామని ధర్మాసనం తెలిపింది.అయితే, సోమ, మంగళ వారాలకు బదులుగా వేరే రోజుల్లో విచారణ చేపట్టాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరడంతో గురువారం చేపడతామని పేర్కొంది. 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ), కేంద్రం బుధవారం దాఖలు చేసిన కౌంటర్లు పిటిషనర్ల తరపు లాయర్‌కు అందనందున విచారణను జూలై 18కి వాయిదా వేస్తున్నాం ''అని ధర్మాసనం తెలిపింది. మే 4న టెలిగ్రామ్ యాప్‌లో లీక్ అయిన నీట్-యూజీ ప్రశ్న పత్రం ఫొటో నకిలీదని ఎన్‌టీఏ తన అఫిడవిట్‌లో పేర్కొంది. ముందస్తు లీక్ అనిపించేలా అందులో సమయం మార్చారని తెలిపింది. పేపర్ లీక్ ఆరోపణలు మొత్తం పరీక్షల నిర్వహణపై ఎలాంటి ప్రభావం చూపదని, హాజరైన వారితో పోలిస్తే, లీకైన పేపర్ అందినట్లుగా గుర్తించిన విద్యార్థుల సంఖ్య అత్యల్పమని ఎన్‌టీఏ వివరించింది.

మరో సూత్రధారి అరెస్ట్

నీట్-పీజీ ప్రశ్నాపత్రం లీకేజీ ఉదంతంలో కీలక సూత్రధారుల్లో ఒకరైన రాకేశ్ రంజన్‌ను సీబీఐ అధికారులు గురువారం అరెస్టుచేశారు. సూత్రధారి సంజీవ్ ముఖియాకు బంధువైన రంజన్ స్వస్థలం బిహార్‌లోని నలంద. రంజన్‌ను గురువారం పట్నాలోని స్పెషల్ కోర్టు ఎదుట సీబీఐ అధికారులు ప్రవేశపెట్టారు. రంజన్‌ను 10 రోజులపాటు సీబీఐ కస్టడీకి అప్పగిస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చింది.

మాజీ అగ్నివీర్‌లకు పారా మిలటరీలో రిజర్వేషన్

న్యూఢిల్లీ: మాజీ అగ్నివీర్‌లకు సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ తీపి కబురు చెప్పాయి. నియామకాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నీనా సింగ్, బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నితిన్ అగర్వాల్, సీఆర్‌పీఎఫ్ డైరెక్టర్ జనరల్ అనీశ్ దయాళ్ గురువారం ప్రకటించారు. ''మాజీ అగ్నివీర్‌లకు నూతన నియామకాల్లో అవకాశం ఇవ్వాలని కేంద్ర హోం శాఖ నిర్ణయం తీసుకుంది. అందుకే వారికి 10 శాతం రిజర్వేషన్ ప్రక్రియను త్వరలో ప్రారంభించబోతున్నాం' అని నీనా సింగ్, నితిన్ అగర్వాల్ చెప్పారు. కానిస్టేబుళ్లకు సంబంధించిన తదుపరి నియామకాల్లో 10 శాతం రిజర్వేషన్ అమలుచేస్తామని నీనా పేర్కొన్నారు. '' దేహదారుఢ్య పరీక్షల్లో మాజీ అగ్నివీర్‌లకు మినహాయింపు ఇస్తాం. వయోపరిమితిలోనూ మినహాయింపులు ఉంటాయి'' అని నీనా సింగ్ చెప్పారు.

తల్లిదండ్రులతో గడిపేందుకు సెలవు

అస్సాం ప్రభుత్వ ఉద్యోగులకు వెసులుబాటు

గువాహటి: అస్సాం ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులు లేదా అత్తమామలతో గడిపేందుకు రెండు రోజులు సెలవులిస్తున్నట్లు సీఎం కార్యాలయం గురువారం ప్రకటించింది. తల్లిదండ్రులు, అత్తమామలు లేని వారు స్పెషల్ కాజువల్ లీవ్‌కు అనర్హులని స్పష్టం చేసింది. నవంబర్ 6, 8వ తేదీల్లో స్పెషల్ కాజువల్ లీవ్ తీసుకునే వారు తమ తల్లిదండ్రులు, అత్తమామలతో గడిపేందుకే కేటాయించాలని వివరించింది. వయోవృద్ధులైన తల్లిదండ్రులు, అత్తమామలను జాగ్రత్త చూసుకునేందుకు వారికి గౌరవం, మర్యాద ఇచ్చేందుకు ఈ లీవ్ ప్రత్యేక సందర్భమని వెల్లడించింది. నవంబర్ 7న ఛాత్ పూజ, నవంబర్ 9న రెండో శనివారం, నవంబర్ 10న ఆదివారంతో పాటు ఈ రెండు రోజుల సెలవును ఉపయోగించుకోవచ్చని సీఎంఓ తెలిపింది.

ఆర్థిక ఉద్దీపన చర్యలు చేపట్టండి

ప్రధాని మోదీకి ఆర్థికవేత్తల వినతి

న్యూఢిల్లీ: దేశంలో ఆర్థిక వ్యవస్థ ప్రగతికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని మోదీకి పలువురు ఆర్థికవేత్తలు విజ్ఞప్తి చేశారు. కేంద్రం త్వరలో పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మోదీ గురువారం ఆర్థికవేత్తలతో సమావేశమయ్యారు. పలు అంశాలపై చర్చించారు. బడ్జెట్‌లో చేర్చాల్సిన అంశాలపై సలహాలు సూచనలు స్వీకరించారు. ఈ సమావేశంలో కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్, ప్రణాళిక శాఖ మంత్రి రావు ఇందర్‌జిత్, ముఖ్య ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్, ఆర్థికవేత్తలు సూర్జీత్ భల్లా, అశోక్ గులాటీ తదితరులు పాల్గొన్నారు. సీతారామన్ 23న బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

హరియాణాలో బీఎస్పీతో ఐఎన్ఎల్‌డీ పొత్తు

చండీగఢ్: హరియాణా అసెంబ్లీకి మరికొద్ది నెలల్లో జరగనున్న ఎన్నికల్లో ఇండియన్ నేషనల్ లోక్ దళ్(ఐఎన్ఎల్‌డీ), బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) కలిసి పోటీ చేయనున్నాయి. ఐఎన్ఎల్‌డీ నేత అభయ్ చౌతాలా ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఉంటారు. అసెంబ్లీలోని 90 సీట్లకుగాను బీఎస్పీ 37 సీట్లు, మిగతా చోట్ల ఐఎన్ఎల్‌డీ బరిలోకి దిగనుంది. బీఎస్పీ చీఫ్ మాయావతి గురువారం 'ఎక్స్'లో ఈ విషయాన్ని ప్రకటించారు. ప్రజల మనోభావాలకు అనుగుణంగా తాము జట్టుకట్టామే తప్ప స్వార్థ ప్రయోజనాల కోసం కాదని చౌతాలా అన్నారు. ఆప్ సహా బీజేపీ, కాంగ్రెసేతర పార్టీలేవైనా తమతో చేతులు కలపొచ్చన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఉమ్మడిగానే పోటీ చేస్తామన్నారు. ప్రస్తుత అసెంబ్లీలో ఐఎన్ఎల్‌డీకి ఏకైక ఎమ్మెల్యే అభయ్ చౌతాలా ఉండగా బీఎస్పీకి ప్రాతినిధ్యమే లేదు.

డిమాండ్లపై మళ్లీ ఉద్యమిస్తాం

సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన

న్యూఢిల్లీ: రైతు సంఘాల సమాఖ్య సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) మళ్లీ ఉద్యమబాట పట్టనుంది. పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ), రైతుల రుణ మాఫీ వంటి కీలక డిమాండ్ల సాధన కోసం మళ్లీ ఉద్యమిస్తామని ఎస్‌కేఎం గురువారం ప్రకటించింది. ఉద్యమంపై ప్రధాని మోదీకి, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీకి వినతిపత్రాలు సమర్పించాలని బుధవారం నాటి సంఘం సర్వసభ్య సమావేశం తర్వాత రైతు నేతలు నిర్ణయించారు. ''ఈనెల 16 లేదా 18వ తేదీన అపాయింట్‌మెంట్ తీసుకుని ప్రధాని మోదీని కలిసి మా సమస్యలను విన్నవించుకుంటాం. 2020–21 రైతు ఉద్యమం ఉధృతంగా కొనసాగిన కాలంలో ప్రాణాలు కోల్పోయిన రైతన్నలకు ఢిల్లీలోని టిక్రి, సింఘు సరిహద్దుల వద్ద స్మారకాలను నిర్మిస్తాం'' అని గురువారం ఢిల్లీలో పత్రికా సమావేశంలో రైతు నేతలు తెలిపారు. '' ఉద్యమపంథాను ఈసారి మార్చబోతున్నాం. గతంలో మాదిరి హస్తిన కేంద్రంగా 'ఢిల్లీ ఛలో' వంటి కార్యక్రమాలు చేయబోం. దేశవ్యాప్త ఉద్యమంపై దృష్టిసారిస్తాం. ముఖ్యంగా శాసనసభ ఎన్నికలకు సమాయత్తమవుతున్న మహారాష్ట్ర, జార్ఖండ్, జమ్మూకశ్మీర్, హరియాణాల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం. రైతు ఉద్యమం కారణంగానే తాజా లోక్‌సభ ఎన్నికల్లో గ్రామీణ జనాభా ఎక్కువగా ఉన్న 159 స్థానాల్లో బీజేపీ ఓడిపోయింది' అని ఆలిండియా కిసాన్ సభ నేత హన్నన్ అన్నారు.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
శుక్రవారం : 12 : జూలై : 2024



సంధ్యా చిత్రం

సంధ్యా సమయం గీసిన సుందర చిత్రలేఖనమిది. గురువారం బెంగళూరు కెంగేరిలో సాయంకాలం

న్యూస్‌రీల్

ఆటపాటలూ ముఖ్యమే



పీయూసీ ప్రతిభావనులకు సన్మానం

తుమకూరు: జీవితంలో కచ్చితమైన లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు సాగినప్పుడే అనుకున్న దానిలో రాణించడానికి సులభం అవుతుందని కన్నడ రచయిత, భాషా నిపుణులు సుహాస్ గోపాల్ అన్నారు. తుమకూరు సిద్దగంగా మహిళా కాలేజీలో వార్షిక ఆటల పోటీలు, ఎన్‌సీసీ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పీయూసీలో డిస్టింక్షన్‌లో పాసైన వారిని సన్మానించారు. విద్యార్థి దశలో చదువు ఎంత ముఖ్యమో ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం కూడా అంత ముఖ్యమని అన్నారు. పుస్తకాలకు అంటుకుని ఉంటే సరిపోదని, అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేయాలని అన్నారు. నేటి విద్యార్థులతో పాటు యువత మొబైల్‌ఫోన్లకు అతుక్కుపోతున్నారని, ఇది తగదని తెలిపారు.

ఫిర్యాదు లేకుండా ఈడీ దాడులా: డీకే

శివాజీనగర: వాల్మీకి అభివృద్ధి మండలిలో నిధుల కేసులో మోసం జరిగింది వాస్తవమే. ఈ కేసులో వాస్తవాలు మాకు తెలుసు. రాష్ట్ర ప్రభుత్వం సిట్ చేత తనిఖీ జరుపుతోంది. అక్రమంగా బదిలీ అయిన సొమ్మును ఇప్పటికే స్వాధీనం చేసుకోవడమైనదని డీసీఎం డీ.కే.శివకుమార్ చెప్పారు. నగరంలో మీడియాతో మాట్లాడుతూ ఈడీ వారు ఎలాంటి ఫిర్యాదు లేకుండానే దాడులు చేయాల్సిన పని లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈడీ ఏ ఆధారంతో దాడులు చేస్తున్నారనేది తనకు తెలియదన్నారు. సిట్ దర్యాప్తు సక్రమంగా సాగుతోంది, విచారణకు అడ్డంకులు రాకూడదని మంత్రి సొంతంగా రాజీనామా చేశారు. మేము కూడా విచారించగా, నిధుల బదిలీకి మంత్రి ఎలాంటి సంతకం చేయలేదని అన్నారు. ఈడీ ఏమి చేస్తుందో వేచి చూడాలన్నారు. మండలి నిధుల స్కాంలో మాజీ మంత్రి బి.నాగేంద్ర, ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్‌పై ఈడీ దాడులతో కాంగ్రెస్‌తో పాటు సర్కారులో కలవరం నెలకొంది.

తమిళనాడుకు రోజూ 1 టీఎంసీ నీరివ్వండి

- సీడబ్ల్యూఆర్‌సీ ఆదేశం

శివాజీనగర: తమిళనాడుకు రోజూ 1 టీఎంసీ కావేరి నీరు విడుదల చేయాలని కావేరి జల నిర్వహణ ప్రాధికార సంస్థ ఆదేశాలు జారీ చేసింది. జులై 12 నుండి 31 వరకు రోజూ 1 టీఎంసీ నీరు విడుదల చేయాలని సీడబ్ల్యూఆర్‌సీ సిఫార్సు చేసింది. తాజా ఆదేశాలు మరోసారి కలకలం రేపుతున్నాయి. గత ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా కర్ణాటకలో అన్ని జలాశయాలు అడుగంటాయి. ఈ ఏడాది వర్షాలు బాగానే కురుస్తున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు రావడం రైతులు, ప్రజా సంఘాలను విస్మయానికి గురిచేస్తోంది.

మహాదేవపురలో తనిఖీలు

కృష్ణరాజపురం: బీబీఎంపీ మహాదేవపుర ఉప విభాగం ఆఫీసులో లోకాయుక్త అధికారులు దాడులు చేసి పత్రాలను తనిఖీ చేశారు. ఇంతకుముందు రెవెన్యూ అధికారిగా ఉన్న బసవరాజు మాగి జారీ చేసిన అనుమతులను పరిశీలించారు. జాయింట్ కమిషనర్‌తో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు అక్కడే ఉన్నారు. అనుమతుల జారీలో పెద్దమొత్తంలో ముడుపులు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి.

కారును ఢీకొన్న క్యాంటర్

- ముగ్గురి దుర్మరణం
- మండ్య జిల్లాలో ఘోరం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

మండ్య: ఎదురుగా వస్తున్న కారును గూడ్స్ క్యాంటర్ ఢీకొన్న ప్రమాదంలో కారులోని ముగ్గురు మరణించారు. ఈ దుర్ఘటన చామరాజనగర–జీవర్గి జాతీయ రహదారిలో ఉన్న మండ్య జిల్లా నాగమంగళ తాలూకాలోని ఎ.శ్రీరామనహళ్ళి గ్రామం వద్ద బుధవారం రాత్రి జరిగింది. చిత్రదుర్గ జిల్లాలోని హొళల్కెరె తాలూకాలోని అరసనఘట్ట గ్రామానికి చెందిన ఎపి యువరాజు (45), హిరేమనూరువాసి సిద్దేష్ (32), జీఎస్ తిప్పేస్వామి దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన నటరాజ్ అనే వ్యక్తిని బెంగళూరుకు తరలించారు. హొళల్కెరె తాలూకాలోని వివిధ గ్రామాల వ్యవసాయ సేవా సహకార సంఘాల కార్యదర్శులుగా ఉన్న ఆరుమంది కారులో మైసూరుకు వెళుతున్నారు. ఈ సమయంలో ఎదురుగా వచ్చిన తమిళనాడుకు చెందిన గూడ్స్ క్యాంటర్ కారును ఎడమవైపు ఢీకొట్టింది, కారు కొంత దూరం బోల్తాలు కొట్టింది. కారులోని ఆరుమందిలో ముగ్గురు మరణించగా, ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరికి ఓ మోస్తరు గాయాలయ్యాయి. నాగమంగళ పట్టణ పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

అక్రమార్కులు గజగజ

- రాష్ట్రంలో 11 మంది అధికారులపై లోకాయుక్త దాడులు
- భారీగా బంగారం, ఆస్తుల గుర్తింపు
- అవినీతిపై ఫిర్యాదులతో కదలిక



బీబీఎంపీ అధికారి బసవరాజు ఇంట్లో పులిగోరు



ఓ అధికారి ఇంట్లో లభించిన నగలు, డబ్బు, విలువైన సొత్తు

బనశంకరి: అవినీతి అధికారులపై లోకాయుక్త పంజా విసిరింది. గురువారం తెల్లవారుజామునుంచి 11 మంది అధికారులు ఇళ్లు, కార్యాలయాలపై దాడులు చేసిన లోకాయుక్త సిబ్బంది కోట్లాది విలువచేసే ఆస్తిపాస్తులను చూసి ఆశ్చర్యపోయారు. విపరీతంగా లంచాలు తింటూ, ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు రావడంతో 11 మంది అధికారులు, విశ్రాంత ఇంజనీర్ల ఇళ్లు, ఆఫీసులు, బంధుమిత్రుల ఇళ్లలో 56 చోట్ల ఏకకాలంలో సోదాలు ప్రారంభించారు. లోకాయుక్త ఎస్పీలతో పాటు 100 మంది సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు. కలబురిగి, మైసూరు, దావణగెరె, చిత్రదుర్గ, ధారవాడ, బెళగావితో పాటు 9 జిల్లాల్లో సోదాలు కొనసాగాయి. ధారవాడలో రెండు చోట్ల పీజీ హాస్టళ్లు నిర్వహిస్తున్న అధికారి శేఖరగౌడ ఇళ్లు, ఆఫీసుతో పాటు పీజీల్లో తనిఖీలు చేశారు.

రామనగరలో

రామనగర జిల్లా అరెహళ్లి తహశీల్దార్ విజయణ్ణకు చెందిన ఆరు చోట్ల సోదాలు సాగాయి. చిక్కబళ్లాపుర, చింతామణి, అరెహళ్లి, తుమకూరు, రామనగర అరెహళ్లి, మండ్యలో, కోలారులో తనిఖీలు సాగాయి.

బెంగళూరు, కలబురిగి, బెళగావిలో

బీబీఎంపీ రెవెన్యూ అధికారి బసవరాజ్ మాగి బెంగళూరు, కలబురిగిలోని ఇళ్లలో సోదాలు చేశారు. ఇంట్లో భారీగా ఆస్తులతో పాటు పులి గోరు లభ్యమైంది. బెళగావి జిల్లా పంచాయతీ ఏఈఈ దురదుండేశ్వర బన్నూరకు చెందిన గోకాక్, హొనగా, హిండలగా, యళ్లూరలో దాడులు నిర్వహించారు. గోకాక్ నివాసం, హొనగాలో ఫాంహౌస్, యళ్లూరు ఇళ్లు, హిండలగా అపార్టుమెంట్‌లలో గాలించారు. 4 నెలలు క్రితం బన్నూర ఓ కాంట్రాక్టరు నుంచి డబ్బు తీసుకుంటూ దొరికిపోయాడు.

విశ్రాంత ఇంజినీరు.. అల్లుడు..

మండ్య నగరంలో విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరాజుకు చెందిన నాగమంగల తాలూకా ఇజ్జలఘట్ట గ్రామంలోని ఇళ్లు, ఫాంహౌస్, క్రషర్, మైసూరులో అల్లుని ఇంటితో పాటు పలుచోట్ల ముమ్మరంగా సోదాలు చేపట్టారు. దావణగెరెలో నివాసం ఉంటూ చిక్కమగళూరు జిల్లాలో కేపీటీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్‌గా పనిచేసే డీహెచ్. ఉమేశ్, అలాగే దావణగెరె బెస్కాం విజిలెన్స్ అధికారి ఏఈఈ ప్రభాకర్ ఇళ్లపైనా దాడులు జరిగాయి. పలువురి ఇళ్లు, ఫ్లాట్లలో ఖరీదైన బంగారు ఆభరణాలు, వాచ్‌లు, వెండి సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. కోట్ల ఖరీదైన భవనాలు, స్థలాల పత్రాలు బయటపడ్డాయి. అధికారులు, వారి కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల తనిఖీలు కొనసాగుతున్నాయి.



ఇంట్లో కాసినో కాయిన్లు

బనశంకరి: బీబీఎంపీ అసిస్టెంట్ కమిషనర్ బసవరాజ్ మాగి, ఎంజీ నగర నివాసంలో లోకాయుక్త పోలీసులు దాడిచేసిన సమయంలో రూ.12.50 లక్షల విలువచేసే క్యాసినో కాయిన్లు లభించాయి. క్యాసినో సభ్యత్వం కార్డు కూడా దొరికింది. బడా సంపన్నులు మాత్రమే క్యాసినోలకు వెళ్తుంటారు.

లోకాయుక్త దాడులు ఎక్కడెక్కడ?

1. విజయణ్ణ– తహశీల్దార్, అరెహళ్లి
2. మహేశ్.కే. సూపరింటెండెంట్ ఇంజనీర్, జలవనరుల శాఖ
3. కేజీ.జగదీశ్, సూపరిండెంట్ ఇంజనీర్ ప్రజాపనులశాఖ
4. శేఖర్‌గౌడ, యోజన డైరెక్టర్ నిర్మితి కేంద్రం ధారవాడ
5. శివరాజు.ఎస్, మండ్య, విశ్రాంత ఇంజనీర్ గ్రామీణతాగునీటి సరఫరా
6. బసవరాజ మాగి, రెవెన్యూ అధికారి బీబీఎంపీ కెంగేరి
7. డీహెచ్. ఉమేశ్, కార్యనిర్వాహక ఇంజనీర్
8. ఎంఎస్.ప్రభాకర్, అసిస్టెంట్ కార్యనిర్వాహక ఇంజనీర్ బెళగావి
9. దురదుండేశ్వర బన్నూర, బెళగావి జిల్లా పంచాయతీ ఏఈఈ
10. ఎస్ఎం.జగదీశ్, గ్రామ పంచాయతీ గ్రేడ్ –1 కార్యదర్శి హాసన్
11. ఎం.రవీంద్ర, చిన్ననీటిపారుదల శాఖ విశ్రాంత ఇంజనీర్



మరో అధికారి ఇంట్లో దొరికిన నగలు, డబ్బు



బీబీఎంపీ మహదేవపుర ఉప విభాగం ఆఫీసులో సోదాలు

మురుఘ మఠంలో వెండి విగ్రహం చోరీ



చోరీకి గురైన వెండి విగ్రహం ఇదే (ఫైల్)

సాక్షి, బళ్లారి: చిత్రదుర్గలోని మురుఘ రాజేంద్ర మఠంలో మురుఘ స్వామి వెండి విగ్రహాన్ని చోరీ చేశారు. మఠంలోని దర్బార్ హాల్‌లో ఉండే వెండి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు మఠం నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 26వ తేదీ నుంచి అక్కడి సీసీ కెమెరాలు పని చేయక పోవడం గమనార్హం. మురుఘ స్వామి పోక్సో కేసులలో చిక్కుకున్న తరువాత మఠం నిర్వహణలో సమస్యలు వచ్చాయి.

బాలికపై దారుణం

యశవంతపుర: ఇద్దరు బాలికలను కారులో బలవంతంగా ఎక్కించుకొని ఒక బాలికపై సామూహిక అత్యాచారం చేశారు. కొడగు జిల్లా కుట్ట గ్రామం నాథంగాల సమీపంలో కేరళ సరిహద్దులో బుధవారం సాయంత్రం ఈ దారుణం జరిగింది. ఒక బాలిక కారులోంచి తప్పించుకొని పోలీసులకు సమాచారం ఇచ్చింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నాథంగాలకు చెందిన నవీంద్ర (24), అక్షయ్, కేరళవాసి రాహుల్ (21), మను (25), సందీప్ (27)లను పోలీసులు అరెస్ట్ చేశారు.

అత్త కూతురిని ప్రేమిస్తే...

యశవంతపుర: అత్త కూతురిపై మోజు పడ్డ యువకుడు హత్యకు గురయ్యాడు. అత్త మామలే అతన్ని అంతమొందించిన ఘటన కలబురగిలో జరిగింది. నగరంలోని ఓజా లేఔట్‌కు చెందిన ప్రవీణ్ అత్త కూతురిని ప్రేమించాడు. అలాగే రెండు కుటుంబాల మధ్య ఆస్తి తారతమ్యాలు ఉండడంతో అత్తమామలు తిరస్కరించారు. అయినప్పటికీ అమ్మాయి వెంట పడుతున్నాడని ఆగ్రహించిన అత్తమామలు అతన్ని హత్య చేశారు. మృతుని తల్లి మల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో నిందితులను అరెస్టు చేశారు.

మా భూమి విలువే రూ.62 కోట్లు

- అంతే ఖరీదైన స్థలాలు ఇవ్వాలి: సీఎం



ఓ కార్యక్రమంలో సీఎం సిద్దు తదితరులు

మైసూరు: చాలాకాలం నుంచి మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా) గబ్బుపట్టి పోయిందని, దానిని తాము సరిచేస్తున్నట్లు ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. గురువారం మైసూరు టికే లేఔట్‌లో నివాసం వద్ద ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ తన భార్యకు ముడా ఇచ్చిన స్థలాలు అక్రమం కాదన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పుడు తన భార్య స్థలాన్ని అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా స్వాధీనం చేసుకుని స్థలాలు వేసి ప్రజలకు విక్రయించారన్నారు. ఎలాంటి పరిహారం కూడా ఇవ్వలేదని చెప్పారు. తాము పోగొట్టుకున్నదానికి పరిహారంగానే స్థలాలు ఇచ్చారని, ముడా తీసుకున్న మా భూమి ప్రస్తుత మార్కెట్ ధర రూ. 62 కోట్లు అని, అంతే విలువైన ఇళ్ల స్థలాలు ఇస్తే చాలని చెప్పారు. ముడాలో పాతుకుపోయిన అధికారులు, దళారుల వల్ల భ్రష్టుపట్టిందని, తాము అధికారంలోకి వచ్చాక దానిని శుభ్రం చేస్తున్నామని అన్నారు.



రాడ్ పడింది: గురువారం బెంగళూరు నాయండహళ్లిలో మినీ లారీ నుంచి ఇనుప కడ్డీలు పడిపోయిన దృశ్యం. ఎవరికీ అపాయం కలగలేదు

సీఏ విద్యార్థిని ఆత్మహత్య



శ్రీనిధి శెట్టి (ఫైల్)

యశవంతపుర: ఉడుపి జిల్లా మణిపాల్‌లో చార్టర్డ్ అకౌంటెంట్ చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. చిక్కమగళూరు జిల్లా కొప్ప తాలూకాకు హరందూరుకు చెందిన శ్రీనిధి శెట్టి (20) మంగళూరు ఆళ్వాస్ కాలేజీలో సీఏ చదువుతోంది. వారి కుటుంబం ఉడుపిలో బాడుగ ఇంటిలో ఉంటోంది. ఆమె రోజూ బస్సులో కాలేజీకి వచ్చి వెళ్లేది. కానీ ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. కారణం చదువులో ఇబ్బందులా, కుటుంబ సమస్యలా అనేది తెలియాల్సి ఉంది.

ఆ గ్రామంలో మృత్యుకేళి

- ఒకేరోజు ఏడుగురు మృతి



ఓ ఇంటి వద్ద విషాద వాతావరణం

యశవంతపుర: దావణగెరె తాలూకా హొస కుందవాడ గ్రామంలో గురువారం ఒకే రోజు ఏడు మంది మరణించడంతో తీవ్ర కలకలం నెలకొంది. వేర్వేరు కారణాలతో వేర్వేరు కుటుంబాలలో సునీల్ (28), సంతోష్ (39), దొడ్డమారమ్మ (68), భీమక్క (68), ఈరమ్మ (72), శాంతమ్మ (73), రెండు రోజుల శిశువు మృతి చెందారు. దావణగెరె పాలికె పరిధిలోని 43వ వార్డు అయిన హొస కుందవాడ గ్రామంలో 10 వేల జనసంఖ్య ఉంది. 8 వందల ఇళ్లకు పైగా ఉన్నాయి. ఒకేరోజు ఇంత మంది చనిపోయారు, గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని గ్రామస్థులు వాపోయారు. ఇటీవల పొరుగునే ఉన్న పాత కుందవాడ గ్రామంతో సంబంధం లేకుండా హొస కుందవాడలో ఊరి పండుగను జరిపారు. ఈ నేపథ్యంలో మృతదేహాలను తమ గ్రామం గుండా తీసుకువెళ్లరాదని పాత కుందవాడ ప్రజలు అడ్డుకున్నారు. మరోవైపు గ్రామంలో ఆరోగ్యశాఖ అధికారులు, పోలీసులు, తహశీల్దార్ పర్యటించారు. ఇద్దరు వాంతులు విరేచనాలతో మృతి చెందారు. వృద్ధునిది సహజమరణమని తెలిపారు. అంత్యక్రియలకు అవకాశం కల్పించాలని గ్రామస్తులు ధర్నా చేయగా అధికారులు నచ్చజెప్పారు.

ఎమ్మెల్యేలు నాగేంద్ర, దద్దల్ సహాయకుల విచారణ



గురువారం ఉదయం రాయచూరులో దద్దల్ మాజీ పీఏ ఫ్లాటుకు వస్తున్న ఈడీ అధికారులు

- దద్దల్, నాగేంద్రను ఈడీ అరెస్టు చేసే అవకాశం

బనశంకరి: మహర్షి వాల్మీకి ఆదివాసీ అభివృద్ధి కార్పొరేషన్‌లో జరిగిన కోట్లాది రూపాయాల కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణ కొనసాగుతోంది. విచారణ సమయంలో కాంగ్రెస్ మాజీమంత్రి బీ.నాగేంద్ర, ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ఆప్తులు కోట్లాది రూపాయల నగదు బదిలీ చేసినట్లు నోరు విప్పారు. దాడి సమయంలో లభించిన అక్రమ వ్యవహారాలకు సంబంధించిన ఆధారాలు, ఆప్తుల విచారణ అనంతరం ఏక్షణంలోనైనా ఇద్దరు ఎమ్మెల్యేలను ఈడీ అరెస్ట్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

దద్దల్ మాజీ పీఏకు విలాస ఫ్లాటు

బసవనగౌడ దద్దల్ మాజీ పీఏ పంపణ్ణ ఇంటిపై ఈడీ అధికారులు దాడి చేశారు. అక్కడ లభించిన ఆధారాల మేరకు బిచ్చాలి గ్రామపంచాయతీ పీడీఓగా నియమితులైన పంపణ్ణ పీడీఓ చార్జ్ తీసుకోకుండా రాయచూరు తాలూకా పంచాయతీలో కేస్ వర్కర్‌గా కొనసాగుతున్నారు. పంపణ్ణ రాయచూరు ఆజాద్‌నగరలో విలాసవంతమైన ఫ్లాట్ కొనుగోలు చేసి అక్కడే నివాసం ఉంటున్నారు. తాలూకా పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ ఎమ్మెల్యే బసనగౌడదద్దల్ ప్రైవేటు వ్యవహారాలు చూసుకునేవాడు. కుంభకోణంలో పంపణ్ణ రూ.50 లక్షలు కమీషన్ తీసుకున్నారనే ఆరోపణ ఉంది. ఇతను జూలై 5న సిట్ విచారణకు హాజరయ్యారు. పంపణ్ణ నుంచి కీలక సమాచారం రాబట్టి కీలకపత్రాలను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టిన వెంటనే ఈడీ అధికారులు షాక్ ఇచ్చారు. పంపణ్ణ ఇంట్లో లభించిన ఆధారాలను ఈడీ అధికారులు స్కాన్ చేసి సీనియర్ అధికారులకు పంపించారు.



మాజీ పీఏ పంపణ్ణ

మాజీ మంత్రి పీఏ ఏం చెప్పాడంటే..

మాజీ మంత్రి బీ.నాగేంద్ర పీఏ హరీశ్‌ను ఈడీ అధికారులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా మల్లేశ్వరం శ్రీసాగర హోటల్ వద్ద డీల్ జరిగినట్లు చెప్పినట్లు తెలిసింది. హరీశ్ రెండు బ్యాగుల్లో రూ.25 లక్షల నగదు తీసుకుని వాల్మీకి అభివృద్ధి మండలి ఎండీ పద్మనాభ, అకౌంటెంట్ పరశురామ వద్ద రూ.25 లక్షల కమీషన్ తీసుకోవడానికి ఈ హోటల్‌కు వెళ్లాడు. పీఏ.హరీశ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా మాజీ మంత్రి నాగేంద్రను ఈడీ అధికారులు విచారణ చేపడుతున్నారు. రూ.25 లక్షలు నగదు ఇచ్చింది ఎవరు, ఆ డబ్బు ఎక్కడిది అనే సమాచారంపై కూపీలాగుతున్నారు. ప్రస్తుతం ఐదుగురు ఈడీ అధికారుల బృందం నాగేంద్ర ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్నారు.

బ్యాంకు సిబ్బంది కక్కుర్తి

అక్రమంగా నగదు బదిలీ చేయడానికి బ్యాంకు సిబ్బందికి లక్షలాది రూపాయలు కమీషన్ అందించారు. అక్రమంగా నగదు బదిలీ చేయడానికి మంత్రి, అధ్యక్షుడు, పీఏలు బ్యాంకుకు వరుసగా వెళ్లారు. ఇప్పటికే బ్యాంకులోని సీసీ కెమెరాలో రికార్డులను సిట్ పరిశీలించి వాటిని కూడా ఈడీ సేకరించింది. మాజీ మంత్రి నాగేంద్ర ఇంటికి ఈడీ అధికారులు ఉదయం 5 గంటలకు చేరుకుని ఇంట్లో పత్రాలను పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు విచారణకు రావాలని మాజీ మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే బసవనగౌడ దద్దల్‌లకు ఈడీ నోటీసులు ఇచ్చింది.

చిన్న కుటుంబమే మేలు



జనాభా నియంత్రణకు కృషిచేసిన వైద్య సిబ్బందికి సత్కారం

- ఘనంగా జనాభా దినోత్సవం

బనశంకరి: దేశాభివృద్ధిలో జనాభా ముఖ్య పాత్ర పోషిస్తుంది, అయితే జనాభా నియంత్రణ కూడా ముఖ్యమని బీబీఎంపీ ఆరోగ్య విభాగం ప్రత్యేక కమిషనర్ సురళ్కర్ వికాస్‌కిశోర్ అన్నారు. బీబీఎంపీ ఆధ్వర్యంలో గురువారం టౌన్‌హాల్‌లో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. కిశోర్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పథకం గురించి ప్రజలను జాగృతం చేయాలన్నారు. జనాభాలో చైనా, భారత్‌లు తొలిస్థానాల్లో ఉన్నాయి. జనసంఖ్య పెరుగుదలను నియంత్రించాలి. కుటుంబంలో ఎక్కువ మంది పిల్లలు నాణ్యమైన జీవనం అందించడం కష్టమౌతుంది. అందుకే ఒకరు, లేదా ఇద్దరు పిల్లలు ఉంటే మంచి జీవితాన్ని అందించవచ్చునని, తల్లిదండ్రులు జనాభా నియంత్రణకు చేతులు కలపాలని తెలిపారు. ఈ సందర్భంగా జనాభా నియంత్రణ తదితరాలపై పిల్లలకు చిత్రాలు, రీల్స్ పోటీలు నిర్వహించారు. అధికారులు సిరాజుద్దీన్ మదాని, నిర్మలాబుగ్గి, డాక్టర్ పద్మిని ప్రసాద్, శశిదర్‌కోటే, సుధా బరగూర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చురుగ్గా ఎన్నికల ప్రచారం



ఓట్లను అభ్యర్థిస్తున్న పంచాక్షరప్ప ప్యానల్

బళ్లారిఅర్బన్: అఖిల భారత వీరశైవ మహాసభ జిల్లా శాఖ ఐదేళ్ల అవధికి 30 మంది కార్యనిర్వాహక సభ్యులు, 10 మంది మహిళా సభ్యులతో పాటు ఓ అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా త్రివిధ దాసోహి సిద్ధ గంగా స్వామి బృందం పంచాక్షరప్ప అధ్యక్ష పదవికి, కార్యనిర్వాహక సభ్యత్వానికి సంబంధించి శుక్రవారం జోరుగా ప్రచారం చేశారు. నగరంలోని పలువురు వీరశైవ ప్రముఖులను కలిసి తమ బృందాన్ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తమను గెలిపిస్తే చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించినట్లు జిల్లా కార్యనిర్వాహక కమిటీ సభ్యత్వ స్థాన అభ్యర్థిని ఛాయా మంజునాథ్ ఓ ప్రకటనలో తెలిపారు.

మహిళలపై దౌర్జన్యం తగదు



ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: పశ్చిమ బెంగాల్‌లో మహిళలపై నిరంతరంగా దౌర్జన్యాలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎస్‌డీపీఐ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో జిల్లా సంచాలకుడు తాజుద్దీన్ మాట్లాడారు. ఆ రాష్ట్రంలోని చోప్రాలో మహిళలపై అత్యాచార ఘటనలతో శాంతి భద్రతలు సన్నగిల్లాయన్నారు. ఈ విషయంలో సీఎం జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని రాష్ట్రపతికి జిల్లాధికారి ద్వారా విన్నవించారు.

నియామకం



అయేషా ఖానం

రాయచూరు రూరల్: కర్ణాటక మీడియా అకాడమి అధ్యక్షురాలిగా పాత్రికేయురాలు అయేషా ఖానంను రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య సలహాదారుడు ప్రభాకర్ నియమించారు. ఆమె కళ్యాణ కర్ణాటక విభాగంలోని కలబుర్గి పాత్రికేయురాలుగా పని చేశారు. సభ్యులుగా బెంగళూరు వెంకటపతి, కొప్పళ జిల్లా గంగావతి నింగజ్జ, చిత్రదుర్గ అహోబళపతిలను నియమించారు

ఆక్రమణలు తొలగించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా భూ ఆక్రమణదారులు వేసుకున్న గుడిసెలను తొలగించాలని కరవే డిమాండ్ చేసింది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు జిలాని మాట్లాడారు. పాత ఆశ్రయ కాలనీలోని సర్వే నంబర్– 581లో ఏడేళ్ల కిందట వాజపేయి ఆవాస్ యోజన కింద పేదలకు, మురికి వాడల వాసులకు మంజూరు కాగా నేడు భూఆక్రమణదారులు ఆక్రమించి గుడిసెలు వేసుకున్నారని, వాటిపై విచారణ జరిపి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

గురుకుల పాఠశాలల్లో పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కరెమ్మ నాయక్

రాయచూరు రూరల్: ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి నూతన జిల్లాధికారి నితీష్, దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ భోజనం ఆరగించారు. గురువారం నగరంలోని మాస్‌దొడ్డి రహదారిలోని మొరార్జి దేశాయి వసతి పాఠశాలలో జిల్లాధికారి, దేవదుర్గ తాలూకాలోని గణేకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ భోజనం చేశారు.

బీఎన్ఆర్ లగ్జూర్‌లో ఆషాఢం సేల్

విజయవాడ: బెంగళూరు జయనగరలోని బీఎన్ఆర్ లగ్జూర్‌లో ఆషాఢ గ్రాండ్ ఆఫర్ ఈ నెల 14వ తేదీతో ముగియనుంది. జూన్‌లో ప్రారంభమైన ఈ ఆషాఢ ఆఫర్స్‌లో బంగారు ఆభరణాలపై 9 శాతం వీఏ, సున్నా శాతం మేకింగ్ చార్జెస్, పోల్కి డైమండ్స్‌పై 25 శాతం డిస్కౌంట్, 50 శాతం తరుగు, మేకింగ్ చార్జెస్ వెసులుబాటుతో నగల విక్రయాలు జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. డైమండ్స్‌పై క్యారెట్ ధర రూ. 54,999, ఐజీఐ సర్టిఫికేషన్‌తో లభిస్తాయని తెలిపారు. ఇవి 50 శాతం మేకింగ్ చార్జెస్, వీఏతో వస్తాయని లగ్జూర్ ఎండీ లోహిత్ చరణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆషాఢ సేల్‌కు వినియోగదారుల నుంచి మంచి స్పందన వస్తోందని, 14వ తేదీ లోపు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నిలిచి ఉన్న టిప్పర్‌కు ప్రైవేటు బస్సు ఢీ



టిప్పర్‌ను ఢీకొన్న బస్సు



ధ్వంసమైన బస్సు ముందు భాగం



- 15 మందికి తీవ్ర గాయాలు
- హొసకోటె వద్ద దుర్ఘటన

కృష్ణరాజపురం: గురువారం రాత్రి ప్రైవేటు బస్సు తీవ్ర ప్రమాదానికి గురైంది. బెంగళూరు నుంచి ముళబాగిలుకు వెళ్తున్న ప్రైవేటు బస్సు రాత్రి 10 గంటల సమయంలో హొసకోటె వద్ద నిలిచి ఉన్న టిప్పర్ లారీని ఢీకొట్టింది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా సుమారు 15 మంది పైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బాధితులను బయటకు తీసి స్థానిక ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఆర్తనాదాలతో ఘటనాస్థలి బీభత్సంగా మారింది. గాయపడిన వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. బస్సు డ్రైవర్ అజాగ్రత్తగా నడపడమే దుర్ఘటనకు కారణమని ప్రయాణికులు ఆరోపించారు. గాయపడిన వారిలో స్కూలు పిల్లలు కూడా ఉన్నారు. వారి బ్యాగులు, పుస్తకాలు విసిరేసినట్లు పడిపోయాయి. ప్రమాద విషయం తెలిసి బంధువులు ఆస్పత్రులకు పరుగున వచ్చారు. కొందరిని మెరుగైన చికిత్స కోసం బెంగళూరులోని ఆస్పత్రులకు తరలించారు. మరికొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు చేరుకుని కేసు నమోదు చేశారు.

పంద్రాగస్టుకు ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో సమావేశమైన తుషార్

బనశంకరి: రాబోయే స్వాతంత్ర్య దినోత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ సూచించారు. గురువారం పాలికె కేంద్ర కార్యాలయంలో పాలికె అధికారులతో సమావేశమయ్యారు. బెంగళూరు ఫీల్డ్ మార్షల్ మాణిక్‌షా పరేడ్ మైదానంలో రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్లపై చర్చించారు. కుర్చీల వ్యవస్థ, ప్రవేశ గేట్లు, పార్కింగ్ తదితరాలలో గందరగోళం లేకుండా చూసుకోవాలని తెలిపారు. జలమండలి ద్వారా తాగునీటి వ్యవస్థ, అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలన్నారు. చుట్టూ సీసీ కెమెరాలను అమర్చాలని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలకు బృందాలను ఎంపిక చేయాలన్నారు. నాడ గీత, రైతు గీతం ఆలపించడానికి బృందాలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేకకమిషనర్ కే.హరీశ్‌కుమార్, సురళ్కర్ వికాస్‌కిశోర్, ప్రీతి గెహ్లాట్, ఆర్‌ఎల్.దీపక్, కరిగౌడ, స్నేహల్, వినోత్‌ప్రియా, జిల్లాకలెక్టర్ దయానంద్ పాల్గొన్నారు.

గేమింగ్ యాప్‌లో డబ్బులు కోల్పోయి విద్యార్థి ఆత్మహత్య



రాకేష్(ఫైల్)

హుబ్లీ: ఓ విద్యార్థి ఇక్కడి శిరిడి నగర డాక్టర్ అంబేడ్కర్ ప్రభుత్వ మెట్రిక్ అనంతర వృత్తిపర బాలుర విద్యార్థి నిలయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం జరిగింది. విజయపుర రాకేష్ శ్రీశైల్ జంబలదిన్ని(22) ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి. రాకేష్ బుధవారం సాయంత్రం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రాకేష్ బీవీబీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూకేషన్ ఇంజినీరింగ్‌లో 6వ సెమిస్టర్ చదువుతున్నాడు. జంట నగరాల పోలీస్ కమిషనర్ శశికుమార్ హాస్టల్‌కు వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అశోక్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రాకేష్ మొబైల్ యాప్‌ల్లో గేమ్ ఆడేవాడు. అందులో డబ్బులు పోగొట్టుకున్నాడని అతడి స్నేహితులు తెలిపారు. ఈ విషయాన్ని అతడి తల్లిదండ్రులకు తెలియజేసి లోతుగా దర్యాప్తు చేపట్టినట్లు కమిషనర్ వివరించారు. ఈ నెల 8న పరీక్షలు ముగిశాయి. అతడి గదిలో ఉన్న ముగ్గురు విద్యార్థులు తమ ఊర్లకు వెళ్లిపోయారు. బుధవారం ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఫోన్ స్వీకరించలేదు. దీంతో గది తలుపులు పగులగొట్టి చూడగా రాకేష్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందని ఆ హాస్టల్ విద్యార్థి సచిన్ తెలిపారు.

బాటిళ్లలో నాసిరకం మద్యం.. అధిక ధరకు విక్రయం

- గుట్టురట్టు చేసిన కలఘటిగి పోలీసులు
- రూ.32 లక్షల విలువ చేసే సరుకు సీజ్
- అక్రమ నిల్వ కేసులో నలుగురు అరెస్ట్

హుబ్లీ: నాసిరకం మద్యాన్ని బాటిళ్లలో నింపి ఎక్కువ ధరకు విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా గోడౌన్లలో నిల్వ ఉంచిన సరుకుపై కలఘటిగి పోలీసులు దాడి చేసి రూ.32 లక్షల విలువ చేసే అక్రమ సారాయిని స్వాధీనం చేసుకున్నారు. కలఘటిగి తాలూకాలోని మిస్త్రికోటె క్రాస్ వద్ద గోడౌన్‌లో అక్రమంగా మద్యాన్ని నింపుతున్న వైనంపై విశ్వసనీయ సమాచారం మేరకు ధార్వాడ జిల్లా ఎస్పీ గోపాల్ బ్యాకోడ్ మార్గదర్శకత్వంలో ఏఎస్పీ నారాయణ బరమని, ధార్వాడ గ్రామీణ ఉపవిభాగం డీఎస్పీ ఎస్ఎం నాగరాజ్ నేతృత్వంలో కలఘటిగి సీఐ శ్రీశైల కౌజలిగి, ఎస్ఐ బసవరాజ యద్దలగుడ్డ బృందం ఈ దాడి చేసింది. కేసులో హుబ్లీ గోకుల్ రోడ్డు నివాసి వినాయక జిత్తూరి, ఆనంద్ నగర్ వినాయక సిద్ధలింగ, చెన్నపేట ఈశ్వర పవార్, రోహిత్ అరసిద్దిని అరెస్ట్ చేశారు. కాగా గోవా నుంచి తక్కువ ధరకు లిక్కర్ కొనుగోలు చేసి ఇక్కడకు తెచ్చి వేరే బాటిళ్లలో నింపి తిరిగి ప్యాక్ చేసి విక్రయించే కుట్రకు నిందితులు పాల్పడ్డారని జిల్లా ఎస్పీ గోపాల్ బ్యాకోడ్ తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ గోవా నుంచి విస్కీని ప్రతి బాక్స్ రూ.1500 చొప్పున కొనుగోలు చేసి వాటిని అక్రమంగా ఇక్కడకు తెచ్చి వాటికి ఎసెన్స్ ద్రావకం, రంగు కలిపి కర్ణాటకలో విక్రయించేలా బాటిళ్లలో నింపుతున్నారన్నారు. ఒక్కో బాక్స్‌ను రూ.12,500 చొప్పున విక్రయించి ఎక్కువ లాభాలు పొందవచ్చని నిందితులు కుట్ర పన్నారన్నారు. కాగా కార్యాచరణలో పాల్గొన్న అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించారు.

ప్రజలకు దర్వేసి కంపెనీ కుచ్చుటోపీ



మాట్లాడుతున్న విరుపాక్షి

రాయచూరు రూరల్: నగరంలో దర్వేసి గ్రూప్ ఆఫ్ కంపెనీ రూ.500 కోట్ల మేర ప్రజలకు టోపీ వేసిందని జేడీఎస్ జిల్లాధ్యక్షుడు విరుపాక్షి ఆరోపించారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 శాతం వడ్డీ చెల్లిస్తామంటూ ప్రజల నుంచి రూ.వేలల్లో, లక్షల్లో డబ్బులు వసూలు చేసుకొని రూ.500 కోట్ల మేర సొమ్ములు పోగేసుకొని కంపెనీ యజమాని మహ్మద్ హుసేన్ సుజా చాలా రోజుల నుంచి పరారయ్యాడన్నారు. అధిక వడ్డీ చెల్లిస్తామంటూ పేదలు, పోలీసులు, అధికారులు, ఉద్యోగులు, కార్మికులు తక్కువ వడ్డీకి డబ్బులు తెచ్చి అధిక వడ్డీ ఆశతో దర్వేసి కంపెనీలో పెట్టుబడి పెట్టారన్నారు. నెల రోజుల నుంచి పరారు కావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. దర్వేసి కంపెనీ యజమాని మహ్మద్ హుసేన్ సుజాపై సుమోటో కేసు నమోదు చేయాలని పోలీస్ అధికారులను ఒత్తిడి చేశారు.

ఫిర్యాదులపై విచారణతో 9 కేసులకు పరిష్కారం



విచారణలో సమస్యలను ఆలకిస్తున్న అధికారులు

హొసపేటె: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ టీ.శ్యాం భట్, సభ్యుడు ఎస్‌కే వంటిగోడి సమక్షంలో గురువారం ఫిర్యాదులపై విచారణ సమావేశం జరిగింది. జిల్లా పరిపాలన భవనంలోని ఆడిటోరియం హాల్‌లో జరిగిన సమావేశంలో ఫిర్యాదుదారులు, అధికారుల సమక్షంలో జిల్లాకు సంబంధించి కమిషన్‌కు సమర్పించిన మొత్తం 9 ఫిర్యాదులను విచారించి పరిష్కరించారు. హూవినహడగలి తాలూకా దాసనహళ్లికి చెందిన డెటా ఎంట్రీ ఆపరేటర్‌కు 12 నెలల జీతం ఇవ్వలేదన్న ఫిర్యాదుపై నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. కొట్టూరుకు చెందిన అజ్జప్ప తండ్రి విరుపాక్షప్ప వలి తన సోదరిని హత్య చేసి దాచి పెట్టిన నిందితుడిని అరెస్ట్ చేయాలని, తన సోదరిని కట్నం కోసం వేధించి ఇంటి నుంచి వెళ్లగొట్టాడని హొసపేటెకు చెందిన టీహెచ్.అశోక్ అభిషేక్ ఇచ్చిన ఫిర్యాదుపై సమావేశంలో చర్చించారు. ఈ రెండు కేసులపై ఇప్పటికే కమిషన్‌కు విచారణ నివేదిక అందజేశామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. విజయనగర జిల్లా హడగలి తాలూకా సోవేనహళ్లిలో 1963లో కొత్త ప్లాట్లు కేటాయించి వాటి రద్దు చేసి మళ్లీ కేటాయించడంపై దాఖలైన ఫిర్యాదుపై సమావేశంలో చర్చ జరిగింది. కేసును సమీక్షించి అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేసేందుకు కమిషన్‌కు మధ్యంతర నివేదిక అందించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాధికారి దివాకర్, జెడ్పీ సీఈఓ నోంగ్‌జోయ్ మహమ్మద్ అలీ అక్రమ్ షా తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు లేని బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసులు

శ్రీనివాసపురం: ఆర్‌సీ, ఇన్సూరెన్స్ తదితర సరైన రికార్డులు లేని ద్విచక్రవాహనాలను పట్టణ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం బి.గొరవనకొళ్ల మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపే వారు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ప్రతి రికార్డును దగ్గర ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ద్విచక్రవాహనం నడిపే సమయంలో ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. పట్టణంలోని ఎంజీ రోడ్డు, కేఎస్‌ఆర్టీసీ బస్టాండు తదితర ప్రాంతాల్లో 50కి పైగా ద్విచక్ర వాహనాలను స్వాధీనపర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ జయరాం తదితర సిబ్బంది ఉన్నారు.

పంటల సమీక్ష పోస్టర్ విడుదల

మైసూరు: ప్రభుత్వ అతిథి గృహంలో వ్యవసాయ శాఖ నిర్వహించిన పంటల సమీక్షతో కూడిన పోస్టర్‌ను సీఎం సిద్దరామయ్య ఆవిష్కరించారు. రైతులు స్మార్ట్ ఫోన్‌లో ప్లే స్టోర్ ద్వారా పంటల సమీక్ష యాప్‌ని డౌన్‌లోడు చేసుకొని సొంతంగా తమ పంటల వివరాలను నమోదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహాదేవప్ప, ఎమ్మెల్సీలు తిమ్మయ్య, యతీంద్ర సిద్దరామయ్య, అధికారులు పాల్గొన్నారు.

భార్యాభర్తల ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న భార్యాభర్తలు

కోలారు: భార్యాభర్తలు చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన తాలూకాలోని వేమగల్ ఫిర్కా మంజలి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ లక్ష్మణ్(38), భార్య మాలాశ్రీ(35) దంపతులు కాగా మాలాశ్రీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అక్షర దాసోహ సహాయకురాలిగా పని చేస్తోంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం ఉదయం గ్రామ సమీపంలోని చెట్టుకు దంపతులు ఉరి వేసుకుని ఉండడాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. వారు ఆత్మహత్య చేసుకోవడానికి కారణాలు తెలియరాలేదు. మృతదేహాలను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం సంబంధీకులకు అప్పగించారు. దంపతుల మరణంతో వారి ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. వేమగల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కోలారు వార్తలు...

జనాభా పెరుగుదలను అరికట్టాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కోలారు: ప్రపంచంలో అతి ఎక్కువ జనాభా కలిగిన దేశంగా ప్రఖ్యాతి గాంచిన భారత దేశంలో జనాభా నియంత్రణ చేయాల్సిన అవసరం ఉందని జిల్లాధికారి అక్రం పాషా తెలిపారు. గురువారం తన కార్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో 144 కోట్ల జనాభా ఉంది. చైనా దేశాన్ని వెనక్కు నెట్టి భారత దేశ జనాభా పెరుగుతోందన్నారు. దేశంలో 18–40 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు అధికంగా ఉన్నారు. వీరిని క్రియాశీలురుగా, గుణాత్మక సంపన్మూల వ్యక్తులుగా చేయడానికి ఉత్తమ శిక్షణ, కౌశల్యం, పేదరిక నివారణ, వసతి, తదితర మౌలిక సౌకర్యాలను కల్పించినప్పుడే ఆర్థిక అభివృద్ధి సాధ్యం అన్నారు. జనాభాతో దుష్పరిణామాలైన పేదరికం, నిరుద్యోగం, వసతి, నీరు, విద్యుత్, అనారోగ్యంపై పాఠ్యపుస్తకాల్లో విద్యార్థులకు తెలియజేయాలన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ జగదీష్, డాక్టర్ చందన్‌కుమార్, జిల్లా కుష్ఠురోగ నివారణ అధికారి డాక్టర్ ఎస్‌సీ నారాయణస్వామి, జిల్లా సర్వేక్షణాధికారి డాక్టర్ చారిణి పాల్గొన్నారు.

పాల ధర తగ్గింపు విరమించుకోవాలి



సమావేశమైన జేడీఎస్, బీజేపీ కార్యకర్తలు

కోలారు: పాడి రైతుల నుంచి పాల సేకరణ ధరను కోచిముల్ రూ.2 తగ్గించిన నేపథ్యంలో గురువారం నగరంలోని బీజేపీ నాయకుడు ఓంశక్తి చలపతి కార్యాలయంలో సమావేశమైన జేడీఎస్, బీజేపీ కార్యకర్తలు తగ్గించిన పాల సేకరణ ధరను వెంటనే తిరిగి పెంచాలని, కోచిముల్‌కు వారం రోజులు గడువు ఇస్తున్నామని, ఆలోగా తగ్గించిన పాల సేకరణ ఆదేశాలను వెనక్కు తీసుకోవాలని, లేనిపక్షంలో కోచిముల్‌కు వ్యతిరేకంగా తీవ్ర స్థాయిలో ఆందోళన చేయాలని నిర్ణయించారు. శుక్రవారం సాంకేతికంగా కోచిముల్ ఎండీ, జిల్లాధికారులకు వినతిపత్రం సమర్పించాలని తీర్మానించారు. వారం గడువు అనంతరం పాల సేకరణ తగ్గింపు ఆదేశాలను వెనక్కు తీసుకోకపోతే ఆందోళన బాట పట్టాలని సమావేశంలో తీర్మానం చేశారు. జేడీఎస్ నాయకుడు సీఎంఆర్ శ్రీనాథ్ మాట్లాడుతూ పాల సేకరణ ధరను తగ్గించడం వల్ల పాడి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కోచిముల్ తీసుకున్న నిర్ణయం వల్ల జిల్లాలో పాడి పరిశ్రమ ఉనికి ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. దీనిని ఖండిస్తూ బీజేపీ, జేడీఎస్ పార్టీలు సంయుక్తంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇరు పార్టీలు పాడి రైతులకు అండగా నిలవాలన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓం శక్తి చలపతి మాట్లాడుతూ పాల సేకరణ ధరను తగ్గించడం వల్ల కోలారు, చిక్కబళ్లాపుర ఉభయ జిల్లాల్లోని పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని, ఉభయ పార్టీలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు బాబు మౌని, కార్యాధ్యక్షుడు బణకనహళ్లి నటరాజ్, యలవార సొణ్ణేగౌడ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పీఏ ఇంటిపై ఈడీ దాడి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన రూ.187 కోట్ల అవినీతిపై విచారణలో భాగంగా గురువారం నగరంలో మండలి అధ్యక్షుడు, గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ఆప్త సహాయకుడు పంపణ్ణకు చెందిన నగరంలోని ఆశాపూర్ రోడ్డులోని ఇంటిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు గురువారం సోదా చేశారు. అలాగే గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ అల్లుడు చెన్నబసవను కూడా అధికారులు విచారణ జరిపారు.

ఈడీ అధికారుల ప్రశ్నలకు షాక్

అవినీతి అంశంపై విచారణలో ఈడీ అధికారులు వేసిన ప్రశ్నలకు మండలి అధ్యక్షుడు, గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ఆప్త సహాయకుడు పంపణ్ణ నీళ్లు నమిలారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ



తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి సునీల్ హొసమని

కోలారు: అపౌష్టికత నిర్మూలన రాష్ట్ర సలహా సమితి, రాష్ట్ర న్యాయ సేవా ప్రాధికార ఆదేశాల మేరకు గురువారం ప్రధాన జిల్లా, సెషన్స్ జడ్జి జీపీ మంజునాథ్, సీనియర్ సివిల్ జడ్జి సునీల్ ఎస్.హొసమని నగరంలోని గాంధీనగర్ కాలనీలో ఉన్న మూడు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల సమస్య, ఆహార సామగ్రి నాణ్యత లోపించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వీటిలో ఒకటి స్వంత కట్టడంలో ఉండగా, మిగిలిన రెండు బాడుగ కట్టడాల్లో ఉన్నాయి. ఒకే గదిలో వంటగది, మరుగుదొడ్డి, సామగ్రి నిల్వ చేసి ఉండడంపై న్యాయమూర్తి మండిపడ్డారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న 15 నుంచి 18 మంది పిల్లలు ఆడుకోవడానికి స్థలం లేకపోవడంపై ప్రశ్నించారు. పిల్లలకు పౌష్టిక ఆహారంగా ఇస్తున్న గోధుమ రవ్వ, మసాలాపొడి నాణ్యత లేకపోవడాన్ని నిలదీశారు. సరైన తాగునీటి వ్యవస్థ లేక అంగన్‌వాడీ కార్యకర్తలే క్యాన్‌లలో ఖరీదు చేసుకుని వస్తుండడాన్ని గమనించారు. ఇదే సమయంలో జిల్లాలోని వివిధ తాలూకాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను న్యాయమూర్తులు తనిఖీ చేశారు. జిల్లా పంచాయతీ పాలక మండలి అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలను కల్పించాలన్నారు.

లంచం కేసులో ఇద్దరి సస్పెండు

మాలూరు: లంచం తీసుకుంటూ లోకాయుక్తకు చిక్కి అరెస్టయి జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న ఏడీఎల్ఆర్ అశ్విని, డీ గ్రూప్ ఉద్యోగి నాగప్పలను సస్పెండు చేస్తూ భూ దాఖలాల అసిస్టెంట్ డైరెక్టర్ గురువారం ఆదేశాలను జారీ చేశారు.

మొబైల్ పోతే పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి



వారసుదారులకు మొబైల్ ఫోన్ అందిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని కేజీఎఫ్ ఎస్పీ కేఎం శాంతరాజు తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసిన వారికి సుమారు 5.25 లక్షల విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన మొబైల్ ఫోన్లను వారసుదారులకు అందించి మాట్లాడారు. మొబైల్ ఫోన్ల దొంగతనంపై ఫిర్యాదు అందిన వెంటనే పోలీస్ శాఖ తక్షణమే స్పందిస్తుందన్నారు. సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా దొంగతనం జరిగిన ఫోన్‌ను వెంటనే కనుగొంటారన్నారు. ఇతరులు మొబైల్ ఫోన్‌ను దుర్వినియోగం చేయడాన్ని నివారించడానికి సాధ్యం అవుతుందన్నారు. ఇదే సమయంలో 50 ఫోన్లను వారసుదారులకు అందించారు. డీఎస్పీ ఎస్ పాండురంగ, సీఈఎస్ లక్ష్మీనారాయణ, ఉరిగాం సీఐ ఎస్టీ మార్కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చరూ



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

మాలూరు : డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పదాధికారులు గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తాలూకా అధ్యక్షుడు వి.మునేగౌడ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 7వ వేతన సంఘం ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను యథావిధిగా అమలు చేయాలని, ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను తిరిగి అమలు చేయాలని, ఆరోగ్య సంజీవిని పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు 7వ వేతన సంఘం నివేదిక ఆధారంగా 27.50 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సంధ్యాకాలంలో జీవించడానికి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. డిమాండ్లను నెరవేర్చకుంటే రాబోయే రోజుల్లో తీవ్ర పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రమేష్ ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు. ప్రతినిధులు వెంకటస్వామి, షణ్ముఖయ్య, నరసింహ, కాశీనాథ్, వినయ్‌కుమార్, అంబిక, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బీమాపై జీఎస్టీ వెనక్కు తీసుకోవాలి



ఎంపీకి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: బీమా రంగంలో జీఎస్టీ వెనక్కు తీసుకోవాలని కోరుతూ ఎంపీ ఎం.మల్లేష్‌బాబుకు గురువారం ఆయన నివాసంలో బీమా ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ పదాధికారులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీమా రంగంలో జీఎస్టీ వెనక్కు తీసుకొనేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు కె.మురళి, కార్యదర్శి ఎస్. రమేష్, కోశాధికారి జీఆర్ శ్రీధర్, సి.నాగరాజు, కెఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ. 22 కోట్లతో పోలీసు క్వార్టర్స్



పూజా కార్యక్రమం నెరవేరుస్తున్న హోం మంత్రి

తుమకూరు: పోలీసు కుటుంబాల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని, నగరంలోని చిలుమే సముదాయ భవనం సమీపంలో రూ. 22 కోట్లతో పోలీసు వసతి గృహాల నిర్మాణం చేపడుతామని హోం మంత్రి పరమేశ్వర్ అన్నారు. గురువారం ఆయన శిలాఫలకాన్ని ఆవిష్కరించి పూజా కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలో నేర నియంత్రణకు 24 గంటల పాటు పనిచేస్తున్న పోలీసు సిబ్బంది కృషి అభినందనీయమని, వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



ఉప తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సిద్దగంగప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం కార్యకర్తలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ.., కార్మిక వ్యతిరేక విధానాలు, ఏపీఎంసీ చట్టం తదితర వాటిని కూడా రద్దు చేయాలన, కనీస వేతన చట్టాన్ని అమలు చేసి పాత పెన్షన్ పద్ధతిని పునరుద్ధరించాలన్నారు. అనంతరం ఉపతహసీల్దార్ ఆశాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆనూడి నాగరాజు, వెంకటలక్ష్మమ్మ, రాధమ్మ, సరస్వతమ్మ, నౌషాద్, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బాదర్లి ప్రమాణం

శివాజీనగర: ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీగా ఎన్నికైన బసనగౌడ బాదర్లిచే గురువారం విధానసౌధలో విధానపరిషత్ సభాపతి బసవరాజ హొరట్టి ప్రమాణం చేయించారు. జగదీశ్ శెట్టర్ రాజీనామాతో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ నేత బాదర్లి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమయ్యారు. బాదర్లిని సీఎం, డీసీఎంలు అభినందించారు.

వస్త్రాలు, స్కూల్ బ్యాగుల పంపిణీ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: బెంగళూరు నగరంలోని బొమ్మనహళ్లి పరిధి అరికెరె వార్డులో ఉన్న అంగనవాడీ కేంద్రం చిన్నారులకు చిలుమే ఫౌండేషన్ సహకారంతో నూతన వస్త్రాలతో పాటు షూలు, స్కూల్‌బ్యాగులు, నోటు పుస్తకాలు,, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఆరికెరెవార్డు మాజీ కార్పొరేటర్ భాగ్యలక్ష్మి మురళి పాల్గొని చిన్నారులకు నూతన వస్త్రాలతో పాటు షూలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులను అభినందించారు.

దివ్యాంగులకు వైద్య పరీక్షలు



దివ్యాంగులను పరీక్షిస్తున్న సిబ్బంది

గౌరిబిదనూరు: కేంద్ర ప్రభుత్వపు అడిప్ పథకం కింద ఉపకరణాల పంపిణీకి అర్హులైన దివ్యాంగులు, వృద్ధులను గుర్తించి వారి అంగ వైకల్య నిర్ధారణ కార్యక్రమం గురువారం కోటె పాఠశాలలో జరిగింది. తాలూకాలోని దివ్యాంగులు, వృద్ధులు తరలివచ్చారు. అలింకో సంస్థ సిబ్బంది పరీక్షించి ఆయా దివ్యాంగులకు కావలసిన ఉపకరణాలకు సిఫారసు చేయనుంది. కృత్రిమ కాళ్లు, చేతులు, వినికిడి యంత్రాల కోసం పలువురు వచ్చారు.

పరిశుభ్రత ప్రధానం



స్వచ్ఛ సేవలో పాల్గొన్న విద్యార్థులు, పౌర కార్మికులు

గౌరిబిదనూరు: నగర శుభ్రతలో పౌరుల భాగస్వామ్యం చాలా అవసరమని, వారు సహకరించినపుడే సుందర గౌరిబిదనూరును చూడడం సాధ్యమని నగరసభ కమిషనర్ గీత తెలిపారు. గురువారం ఉదయం నగరంలో విద్యార్థులు, పౌరకార్మికులు కలిసి పార్కుల్లో చెత్త చెదారం తొలగించారు. స్వచ్ఛ సేవా కార్యక్రమంలో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. తాలూకాలో ఇప్పటి వరకు 12 డెంగీ కేసులు గుర్తించామన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఈ వ్యాధిపై అవగాహన కల్పించామని, దోమల నాశనానికి ఫాగింగ్ చేస్తున్నామన్నారు.

9 రోజుల్లో 1500 డెంగీ కేసులు

- సిలికాన్‌సిటీలో మొత్తం 4500 కేసుల నమోదు
- డెంగీ హాట్‌స్పాట్‌గా మహదేవపుర
- డెంగీ కట్టడికి స్పెషల్ డ్రైవ్ ఏదీ ?



బనశంకరి: రాజధాని బెంగళూరు నగరంలో డెంగీ కేసులు సంఖ్య రోజురోజుకు హెచ్చుమీరుతున్నాయి. జూలై 1 నుంచి 9 తేదీ వరకు 1500 డెంగీ కేసులు నమోదు కాగా జనవరి నుంచి ఇప్పటి వరకు డెంగీ కేసుల సంఖ్య 4,500కు చేరుకుంది. బీబీఎంపీ వివరాల ప్రకారం... గత 9 రోజుల్లో నగరంలో మొత్తం 1,482 కేసులు నమోదు కాగా బీబీఎంపీ తూర్పు వలయం, మహదేవపుర వలయంలో అధికంగా డెంగీ కేసులు నిత్యం నమోదవుతున్నాయి. 9 రోజుల్లో తూర్పు వలయం 302, మహదేవపుర వలయంలో 319 డెంగీ కేసులు నమోదు కావడంతో హాట్‌స్పాట్‌గా మారింది. ఈ ఏడాదిలో తూర్పు వలయంలో మొత్తం 996, మహదేవపురలో 1,159 కేసులు వెలుగుచూశాయి. ఈ ఏడాది నగరంలో 4,385 డెంగీ కేసులు నమోదయ్యాయి. బీబీఎంపీలో అధికారులు సిబ్బంది పకడ్బందీగా జాగృతం చేయడం లేదని, అక్కడక్కడ జాగృతి ఫ్లెక్సీలు అమర్చడం మాత్రమే కనబడుతుంది. ఇక ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఇంటింటిని సందర్శించడం లేదు. కేవలం మీడియాలో ఇంటింటి సమీక్ష చేస్తున్నామని జాగృతం చేస్తున్నామని సమాచారం ఇస్తున్నారు. ఫాగింగ్‌తో పాటు దోమలు నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలు చేయడం లేదు. కొన్ని రోడ్లలో మాత్రమే ఫాగింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. బీబీఎంపీ పరిధిలో నమోదైన డెంగీ కేసులు పైకి జూలై 1 నుంచి 9 తేదీ అవధిలో 199 డెంగీ రోగులు అడ్రస్‌లు లభించడంలేదు. అడ్రస్ ఆచూకీ కనిపెట్టడం బీబీఎంపీ ఆరోగ్య సిబ్బందికి పెద్ద తలనొప్పిగా మారింది.

డెంగీతో చిన్నారి మృతి

యశవంతపుర: బెళగావి జిల్లాలో డెంగీ జ్వరం ప్రజలను వణికిస్తోంది. హుక్కేరి తాలూకా సంకేశ్వరలో శ్రేయాకృష్ణా దేవదాతె (11) అనే బాలిక డెంగీతో మృతి చెందింది. తీవ్రమైన జ్వరంతో బీమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శ్రేయా మృతి చెందినట్లు జిల్లా ఆరోగ్యాధికారి మహేశ్ కోని తెలిపారు.

బెంగళూరు నగరంలో డెంగీ వివరాలు...

వలయం	మొత్తం కేసులు	జూలై 1 నుంచి 9 వరకు
బొమ్మనహళ్లి	430	110
దాసరహళ్లి	44	18
తూర్పు వలయం	996	302
మహదేవపుర	1,159	319
ఆర్ఆర్.నగర	349	98
బెంగళూరు దక్షిణ	589	147
బెంగళూరు పశ్చిమ	432	147
యలహంక	281	58
అడ్రస్ లభించని కేసులు		199
బీబీఎంపీ పరిధిలోకి రాని కేసులు		84
మొత్తం	4,385	1,482 కేసులు

నటి దివ్యా వసంత అరెస్ట్



బనశంకరి: బెదిరింపులు, దోపిడీ యత్నం కేసులో కన్నడ నటి, గిచ్చిగిలిగిలి షో పోటీదారు దివ్యవసంతను గురువారం జీవనబీమా నగర పోలీసులు అరెస్ట్ చేశారు. గతవారం నుంచి అదృశ్యమై తమిళనాడు నుంచి కేరళకు వెళ్లి అక్కడ తలదాచుకున్న దివ్య వసంతను పక్కా సమాచారం మేరకు పోలీసులు అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. స్పా మేనేజర్‌ను బెదిరించి డబ్బు లాక్కోవడానికి ప్రయత్నించిన కేసులో పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఓ చానల్ మాజీ సీఈఓ వెంకటేశ్, దివ్యా వసంత సోదరుడు సందేశ్‌ను అరెస్ట్ చేసి విచారణ చేపడుతున్నారు.

ఏకగ్రీవ ఎన్నిక



ఉపాధ్యక్షురాలిని సన్మానించిన దృశ్యం

తుమకూరు: తుమకూరు జిల్లా శిరా తాలూకా మదలూరు గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షురాలిగా దాసరహళ్లి శాంతమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యక్షురాలిని అధ్యక్షురాలు సావిత్రమ్మ, తదితరులు అభినందించారు.

బస్సు ఢీ.. వృద్ధుడు దుర్మరణం



ప్రమాద దృశ్యం



ధ్వంసమైన బస్సు

- బైక్‌ను తప్పించే యత్నంలో ప్రమాదం
- పలువురికి గాయాలు

బనశంకరి: బన్నేరుఘట్ట రోడ్డులో వరుస ప్రమాదాలు సంభవించిన ఘటనలో బీఎంటీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. గురువారం బన్నేరుఘట్టరోడ్డులో ఎదురుగా అడ్డంగా వచ్చిన బైక్‌ను తప్పించే క్రమంలో బీఎంటీసీ బస్సు రెండు బైకులు, టాటాఎస్ వాహనాలను ఢీకొట్టింది. అనంతరం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడు ప్రసాద్‌రావ్ (60) అక్కడికక్కడే మృతి చెందగా పలువురు గాయపడ్డారు. బన్నేరుఘట్ట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

స్మశాన వాటిక సిబ్బందికి పరికరాలు వితరణ



పరికరాలు అందజేస్తున్న తుషార్ తదితరులు

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె పరిధిలోని స్మశాన వాటికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి పార, పికాసీ, బాండ్లీ లాంటి పరికరాలను బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ అందజేశారు. గురువారం బీఆర్.అంబేడ్కర్ స్మశానవాటిక, విద్యుత్ స్మశానవాటిక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బీబీఎంపీ కేంద్ర కార్యాలయ ఆవరణంలో నగరంలోని 34 స్మశాన వాటికల్లో పనిచేసే ఉద్యోగులకు పరికరాలను తుషార్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక కమిషనర్ హరీశ్‌కుమార్, సురళ్కర్ వికాస్‌కిశోర్, సంఘం అధ్యక్షుడు ఆంథోని, ప్రధాన కార్యదర్శి సౌరిరాజ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ హ్యారీస్‌కు డీకే వార్నింగ్

బనశంకరి: యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ హ్యారీస్ నలపాడ్ పేరుతో విధానసౌధ చుట్టుపక్కల అమర్చిన ఫ్లెక్సీలను గమనించిన డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ ఆయనకు తీవ్రంగా హెచ్చరించారు. కేసు పెడతానని గురువారం వార్నింగ్ ఇచ్చారు. బెంగళూరు నగరంలో ఫ్లెక్సీలు బ్యానర్లు అమర్చరాదని హైకోర్టు ఆదేశించింది. దీని గురించి గతంలో డీకే.శివకుమార్ విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. అయితే మళ్లీ బ్యానర్లు అమర్చడంతో కోపోద్రిక్తుడైన డీకే.శివకుమార్, నలపాడ్‌కు వార్నింగ్ ఇచ్చారు.

వాల్మీకి మండలి కుంభకోణంపై ఇవిగో ఆధారాలు

బనశంకరి: మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలి కుంభకోణానికి సంబంధించి అవినీతి వ్యతిరేక వేదిక అధ్యక్షుడు ఎన్ఆర్ రమేశ్ 104 పేజీల ఆధారాలను ఈడీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలి చట్టంలో నిబంధనలు ఉల్లంఘించి హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్ ప్రదేశంలో గల ఆర్‌బీఎల్ అనే ప్రైవేటు బ్యాంకులో ఖాతాలు కలిగిన ప్రైవేటు సంస్థలు పేరుతో రూ.89.62 కోట్లు నగదు బదిలీ చేయడానికి సంబంధించి ఆధారాలతో ఫిర్యాదు చేశామని చెప్పారు. ప్రస్తుతం మరిన్ని ఆధారాలు లభ్యం కావడంతో 104 పేజీల ఆధారాలు ఈడీ కార్యాలయంలో అందజేశామన్నారు. ప్రజా సొమ్ము దుర్వినియోగానికి పాల్పడిన ముఖ్యమంత్రి సిద్దరామయ్య, మాజీ మంత్రి బీ.నాగేంద్ర, అప్పుడు నాగరాజ్, మండలి అధ్యక్షుడు పద్మరాజ్, అకౌంటెంట్ పరశురామ్ జీ.దురగణ్ణనవర్‌తో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మంగళూరు ఎమ్మెల్యేకి నోటీసులు

యశవంతపుర: కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నేత రాహుల్‌గాంధీపై అవహేళన వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎమ్మెల్యే భరత్‌శెట్టిపై కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేశారు. మంగళూరు పాలికె సభ్యుడు అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కామూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణకు హాజరు కావాలని సూచించారు.

అవ్వను చంపిన మనవడు అరెస్ట్

అవ్వను హత్య చేసిన బాలుడిని కొడగు జిల్లా విరాజపేట పోలీసులు అరెస్ట్ చేశారు. బెటోళి గ్రామానికి చెందిన జానకి (45) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. ఆమె మైనర్ మనవడు గణేశ్ రోజు పీకలదాక మద్యం తాగి అవ్వతో గొడవ పడేవాడు. ఆమె మందలించడంతో తీవ్ర ఆగ్రహానికి గురైన గణేశ్ అవ్వ తలపై రాడ్‌తో కొట్టి హత్య చేశాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

కోలారు డెయిరీకి నిధులు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుధాకర్

చింతామణి: బెంగళూరు, తుమకూరు, మండ్య, పాల డెయిరీలను పోల్చుకుంటే ఉభయ కోలారు చిక్కబళ్లాపుర పాల డెయిరీలకు అదనంగా రూ. 30 కోట్ల నిధులు విడుదల అవుతున్నాయని ఉన్నత విద్యాశాఖ మంత్రి ఎంసీ సుధాకర్ తెలిపారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో కోచిముల్ అధ్యక్షుడు, మాలూరు ఎమ్మెల్యే నంజేగౌడ, మాజీ మంత్రి చౌడరెడ్డి, పాడిరైతులు పాల్గొన్నారు.

బంగాకు విక్రయం, యువకుడి అరెస్ట్



యువకున్ని అరెస్టు చేసిన పోలీసులు

చింతామణి: బంగాకు విక్రయిస్తున్న యువకుడిని బట్లపల్లి పోలీసులు గురువారం అరెస్టు చేశారు. హోసకోట తాలూకా శివనాపుర గ్రామానికి చెందిన శివరాజ్ తాలూకాలోని నిమ్మకాయలపల్లి గ్రామంలో విక్రయిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని అతన్ని అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు.

శిరస్తెదార్‌పై చాకుతో దాడి

యశవంతపుర: తాలూకా కార్యాలయంలో శిరస్తెదార్‌పై ఓ వ్యక్తి చాకుతో పొడిచి పరారైన ఘటన బీదర్‌లో జరిగింది. బీదర్ తహశీల్దార్ కార్యాలయంలో విధుల్లో ఉన్న ఆహారశాఖ శిరస్తెదార్ అనిల్‌కుమార్ వ్యాస్‌పై అమన్ జుబేర్ అనే వ్యక్తి చాకు పొడిచాడు. దాడికి కారణాలు తెలియరాలేదు. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

అర్చకుడి మృతి

దక్షిణ కన్నడ జిల్లా భట్కళకు చెందిన సీనియర్ పురోహితుడు చిత్రాపుర మఠం అర్చకుడు రామేశ్వర గంగాధర హరిదా (68) గుండెపోటుతో మృతి చెందారు. 44 ఏళ్లగా ఆయన చిత్రాపుర మఠంలో అర్చకుడిగా పని చేస్తున్నారు.

దర్గా హుండీ లెక్కింపు



లెక్కించిన నగదుతో సభ్యులు

చింతామణి: తాలుకా మురగమల్ల అమ్మాజాన్, భావాజాన్ దర్గా హుండీ కానుకలను గురువారం లెక్కించారు. ఉదయం వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో లెక్కించగా రూ. 29.55 లక్షల నగదు భక్తులు హుండీలో వేశారు. నవీద్, అమానుల్లా, అబ్దుల్ సలాం, బ్యాంకు మేనేజర్ అఫ్సల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కార్యాలయం ఎదుట ఏబీవీపీ ధర్నా



ఆందోళనకారులను తరలిస్తున్న పోలీసులు

శివమొగ్గ: శివమొగ్గ నగరంలోని జిల్లా పంచాయతీ కార్యాలయం భవనంలో ఉన్న శివమొగ్గ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మధు బంగారప్ప కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పటికే వివిధ సమస్యలపై అక్కడికి వచ్చి ప్రజలు వస్తుండటంతో పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులను అరెస్ట్ చేసి తరలించారు. విద్యార్థుల పలు డిమాండ్లను పరిష్కరించాలని వారు నినాదాలు చేశారు.

హోసూరు వార్తలు..

పెన్షనర్ల మొర

హోసూరు: సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతూ పెన్షన్‌దారుల సంఘం సభ్యులు క్రిష్ణగిరి ఎంపీ కే. గోపినాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆగస్ట్ 6, 7, 8వ తేదీల్లో ఈపీఎఫ్ పెన్షన్ దారుల సంక్షేమ సంఘం నిర్వహించే ధర్నాలో పాల్గొనాలని కోరారు. తమ సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని, కనీస పెన్షన్ రూ. 9 వేలు అందజేయాలని కోరారు. పెన్షన్‌దారుల కోసం ప్రవేశపెట్టిన కొత్త పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు. సభ్యులు పన్నీర్ సెల్వం, సుకుమార్, తేన్‌స్వామి, ఇళంగోవన్, జగన్నాథన్ పాల్గొన్నారు.

సోమేశ్వరునికి విశేష పూజలు



విశేష అలంకరణతో సోమేశ్వరస్వామి మూలవిరాట్

హోసూరు: హోసూరు పట్టణంలోని రామ్‌నగర్‌లో వెలసిన ప్రసిద్ధ శ్రీ సోమేశ్వరస్వామి ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. గురువారం వేకువజాము గణపతి పూజ, గణపతి హోమం, లక్ష్మీ హోమం, నవగ్రహ హోమం, రుద్రపారాయణం, దీపారాధన, లక్షార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. హోసూరు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులకు మహామంగళారతి దర్శనం, తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

కళాశాల విద్యార్థి ఆత్మహత్య

హోసూరు: తల్లిదండ్రులు ప్రేమను వ్యతిరేకించడంతో జీవితంపై విరక్తి చెందిన యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... తిరువణ్ణామలై జిల్లాకు చెందిన పన్నీర్‌సెల్వం కుటుంబంతో కలిసి హోసూరులో నివాసముంటున్నారు. ఇతడి కొడుకు శివాజీ (19) ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఓ అమ్మాయిని ప్రేమిస్తున్న విషయం తెలుసుకొన్న తల్లిదండ్రులు నిలదీశారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన శివాజీ బుధవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

ప్రైవేటు కంపెనీల విరాళం

హోసూరు: హోసూరు, సూళగిరి యూనియన్‌లలో ప్రజా సంక్షేమానికి ప్రైవేట్ కంపెనీలు ప్రజా సేవ కోసం ఆర్థిక సాయాన్ని కలెక్టర్ శరయుకు అందజేశారు. సూళగిరి సమీపంలో నిర్వహిస్తున్న క్యాటర్‌పిల్లర్, యునైటెడ్ వే సంస్థలు హోసూరు తాలూకాలోని కొత్తగొండపల్లి, పూనపల్లి, సూళగిరి తాలూకాలోని కానలట్టి తదితర ప్రాంతాల్లో 343 సోలార్ లైట్ల ఏర్పాటుకు, 112 పిల్లల సంక్షేమ కేంద్రాల నిర్వహణకు కోసం రూ. 1.19 కోట్లను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. రమేష్ ఆనంద నారాయణన్, రాఘవేంద్రారెడ్డి, శక్తివేల్, మురుగన్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న వ్యాన్.. డ్రైవర్ మృతి

క్రిష్ణగిరి: వ్యాన్ అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా క్లీనర్ తీవ్రంగా గాయపడిన ఘటన మహారాజగడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... కోయంబత్తూరు జిల్లా పోల్లాచ్చి తాలూకాకు చెందిన ధనపాల్ (35) అదే గ్రామానికి చెందిన క్లీనర్ వేల్‌మురుగన్ (28)లు కలిసి వ్యాన్‌లో కుప్పం-క్రిష్ణగిరి రోడ్డులో వెళ్తుండగా కమ్మపల్లి వద్ద అకస్మాత్తుగా అదుపుతప్పి రోడ్డుపక్కన చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ ఘటనా స్థలంలోనే మృతి చెందగా వేల్‌మురుగన్‌కు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

గుండెపోటుతో గాయకుడి మృతి



ప్రముఖ గాయకులతో వైద్యుడు సతీశ్ (ఫైల్)

యశవంతపుర: ఫిట్నెస్ ప్రియుడు, ఉత్తమ గాయకుడిగా పేరుగాంచిన వైద్యుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన ఉడుపి జిల్లా కుందాపురలో చోటుచేసుకుంది. ప్రైవేట్ వైద్యుడు డాక్టర్ సతీశ్ పూజారి (54) మృతి చెందారు. గురువారం కోటతట్టులోని తన నివాసంలో సతీశ్‌కు గుండెపోటుతో మృతి చెందారు. కుందాపుర పట్టణంలో ఆయన శ్రీమతా పేరుతో ఆస్పత్రిని నడుపుతున్నారు. నిత్యం జిమ్ చేస్తూ ఫిట్నెస్ డాక్టర్‌గా కుందాపురలో పేరుపొందారు. దీంతో పాటు ఆయన అనేక మంది గాయకులతో కలిసి వేదికలపై పాటలు పాడారు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు.

ప్రజా సమస్యలను తీర్చాలి



సమావేశంలో చైర్‌పర్సన్, సభ్యులు

క్రిష్ణగిరి: సూళగిరి యూనియన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై గురువారం యూనియన్ చైర్‌పర్సన్ లావణ్యమధు అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. 42 గ్రామ పంచాయతీలకు చెందిన యూనియన్ కౌన్సిలర్లు పాల్గొని ప్రజా సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య, రోడ్ల వసతి, వీధి దీపాల ఏర్పాటు తదితరాలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. బీడీవో అధికారులు, యూనియన్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కార్మికుడిపై కత్తితో దాడి - వ్యక్తి అరెస్ట్

కెలమంగలం: తండ్రీ కొడుకుల మధ్య గొడవను సర్ది చెప్పేందుకు వెళ్లిన వ్యక్తిపై కత్తితో దాడి చేసిన నిందితుడిని డెంకణీకోట పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... డెంకణీకోట సమీపంలోని సందనపల్లి గ్రామానికి చెందిన మాదేష్ (30) బుధవారం సాయంత్రం మద్యం మత్తులో ఇంటికెళ్లి తండ్రితో ఆస్తి విషయంగా గొడవపడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన బంధువు సంతోష్‌కుమార్ (36) సర్ది చెప్పడానికి వెళ్లాడు. తీవ్ర ఆవేశంతో మాదేష్ సంతోష్‌కుమార్‌పై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు డెంకణీకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డెంకణీకోట పోలీసులు కేసు నమోదు చేసుకొని మాదేష్‌ను అరెస్ట్ చేశారు.

డబ్బు కోసం బాలిక విక్రయం

- కాపాడిన పోలీసులు

తుమకూరు: మానవత్వం మరిచి తల్లిదండ్రులు డబ్బు ఆశతో కుమార్తెను విక్రయించిన ఘటన వెలుగుచూసింది. తుమకూరు జిల్లాలోని డిట్టూరు ప్రాంతానికి చెందిన చౌడయ్య దంపతులు తమ 11 ఏళ్ల బాలికను ఆంధ్రప్రదేశ్‌లోని బాతుల వ్యాపారికి రూ.35 వేలకు విక్రయించారు. ఈ విషయంపై బాలిక అత్త పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎస్పీ అశోక్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన పోలీసులు బాలికను రక్షించి ఆస్పత్రికి తరలించారు. అనంతరం బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

తారు రోడ్డు నిర్మాణం



తారురోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళి యూనియన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి వెళ్లి పరిశీలించారు. కొమానరపల్లి గ్రామంలో రూ. 20 లక్షల ఖర్చుతో జరుగుతున్న ఓవర్ ట్యాంక్ నిర్మాణ పనులను, దాసరపల్లిలో రూ. 63 లక్షల ఖర్చుతో జరుగుతున్న తారురోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించి త్వరగా ముగించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీడీవో కార్యాలయ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆయన వెంట ఉన్నారు.

యువర్స్

2.0

● టెక్... టాక్

వన్‌ప్లస్ వాచ్ 2



డిస్‌ప్లే	:	1.43 అంగుళాలు
బ్యాటరీ	:	500 ఎంఏహెచ్
ర్యామ్	:	2జీబి
స్టోరేజ్	:	32 జీబి
రిజల్యూషన్	:	466×466 పిక్సెల్స్
		● 100 స్పోర్ట్స్ మోడ్స్
కలర్స్	:	బ్లాక్, గ్రీన్

షావోమి పోకో ప్యాడ్



డిస్‌ప్లే	:	12.10 అంగుళాలు
బరువు	:	571 గ్రా.
రిజల్యూషన్	:	1600×2560 పిక్సెల్స్
మెమోరీ	:	256జీబి/ 8జీబి ర్యామ్
బ్యాటరి	:	10000 ఎంఏహెచ్
ఫ్రంట్ కెమెరా	:	8ఎంపీ

దిగంతర

● సక్సెస్ స్టోరీ: స్పేస్ టెక్ స్టార్టప్

కాలేజీ రోజుల్లో కల కనని వారు అంటూ ఉండరు. ఆ కలకు కష్టం, అంకితభావం తోడైతే ఎంత పెద్ద విజయం సాధించవచ్చో 'దిగంతర' నిరూపించింది. అనిరుధ్ శర్మ, రాహుల్ రావత్, తన్వీర్ అహ్మద్ అనే కుర్రవాళ్లు కాలేజీ రోజుల్లో కన్న కలను స్పేస్–టెక్ స్టార్టప్ 'దిగంతర' రూపంలో సాకారం చేసుకొని తిరుగు లేని విజయాన్ని సాధించారు....



'దిగంతర మొదలైనప్పుడు, ఇప్పటికి తేడా ఏమిటి?' అనే ప్రశ్నకు వినిపించే జవాబు... 'దిగంతర' అంటే అంతరిక్ష వ్యర్థాలను గుర్తించే సంస్థగానే ఎక్కువ గుర్తింపు ఉండేది. తాజా విషయానికి వస్తే... విని యోగదారులకు సేవలు అందించడం మాత్రమే కాకుండా మన దేశ రక్షణ ప్రయోజనాల విషయంలో మౌలిక సదుపాయాలను అందించే సంస్థగా అభివృద్ధి చెందింది. 'అంతరిక్షంలో ఏం జరుగుతుంది?' అనేది అర్థం చేసుకోవడానికి స్పేస్ డొమైన్ అవేర్‌నెస్ కంపెనీగా ఎదిగింది. దిగంతరకు సంబంధించిన ఐడియా కాలేజీ రోజుల్లోనే అనిరుధ్ శర్మ, రాహుల్ రావత్లకు వచ్చింది. బెంగళూరులో శాటిలైట్ క్లబ్ నిర్వహిస్తున్న తన్వీర్ అహ్మద్‌తో కలిసి 'దిగంతర' కలను సాకారం చేసుకున్నారు.

విమానయానం, సముద్ర నావిగేషన్‌కు సంబంధించి అంతర్జాతీయ గుర్తింపు ఉన్న సంస్థలు, నియమాలు ఉన్నాయి. అంతరిక్షానికి సంబంధించి అలాంటివి లేవు. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'స్పేస్ డొమైన్ అవేర్‌నెస్'కు ప్రాధాన్యత ఇస్తోంది దిగంతర. దీనికి సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేస్తోంది. స్పేస్ డొమైన్ అవేర్‌నెస్ వల్ల అంతరిక్షంలో ఏం జరుగుతుందో అవగాహన చేసుకోవడానికి వీలవుతుంది. స్పేస్–మ్యాప్ (స్పేస్ మిషన్ ఎష్యూరెన్స్ ప్లాట్‌ఫామ్), స్టార్స్(స్పేస్ థ్రెట్ అసెస్‌మెంట్ అండ్ రెస్పాన్స్ సూట్) అనే రెండు సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫామ్‌లను అభివృద్ధి చేసింది కంపెనీ. అంతరిక్ష ఆధారిత సెన్సర్లు, గ్రౌండ్ ఆధారిత టెలిస్కోపిక్ అబ్జర్వేటరీల కాంబినేషన్‌ను ఉపయోగిస్తోంది దిగంతర. ఈ అబ్జర్‌వేటరీలలో మొదటిది లద్దాఖ్‌లో రానుంది. సెన్సర్‌ల నుంచి తీసుకున్న డెటా, వివిధ ప్రభుత్వ ఏజెన్సీలు, ఇతరత్రా సంస్థల నుంచి సేకరించిన డేటాతో తన సొంత లైబ్రరీలను ఏర్పాటు చేసే పనిలో ఉంది. ఈ లైబ్రరీలను ఉపయోగించి విశ్లేషణలు అందించే సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తోంది.

'దిగంతర'కు 'సింగపూర్ స్పేస్ అండ్ టెక్నాలజీ'లాంటి అంతర్జాతీయ కస్టమర్‌లు ఉన్నారు. మైత్రి(మిషన్ ఫర్ ఆస్ట్రేలియా–ఇండియా టెక్నాలజీ, రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్)లో భాగంగా ఆప్టికల్ సెన్సర్‌ల సప్లైకు సంబంధించి ఆస్ట్రేలియాకు చెందిన స్పేస్ మెషిన్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. స్పేస్ ఆపరేషన్స్, సిచ్యుయేషనల్ అవేర్‌నెస్‌కు సంబంధించిన సమస్యలను పరిష్కరించడానికి కటింగ్–ఎడ్జ్ టెక్నాలజీతో దూసుకుపోతున్న 'దిగంతర' అంతరిక్షానికి సంబంధించి అంతర్జాతీయ కంపెనీగా ఎదిగింది. 'వర్క్ హార్డ్ డ్రీమ్ బిగ్' అనేది ముగ్గురు మిత్రులకు ఇష్టమైన మాట. ఆ మాటకు అర్థం ఏమిటో 'దిగంతర' విజయం చెప్పకనే చెబుతోంది.

● మ్యూజిక్ వరల్డ్



న్యూ రిలీజ్ 'అస్సీ సజ్నా'తో ప్రేక్షకులకు హాయ్ చెప్పింది సింగర్, సాంగ్ రైటర్, కంపోజర్ జస్లీన్ రాయల్. 2009లో 'ఇండియాస్ గాట్ టాలెంట్' షోలో ఒకే సమయంలో ఎన్నో ఇన్‌స్ట్రుమెంట్‌లు ప్లే చేసి వావ్ అనిపించింది. ఇండీ ఆర్టిస్ట్‌గా ప్రయాణం ప్రారంభించిన రాయల్ బాలీవుడ్‌లోనూ తన టాలెంట్ నిరూపించుకుంది. 'నేనొక మ్యూజిక్ కంపోజర్‌ని. విత్ అవుట్ ఎనీ ట్రెనింగ్' అంటుంది రాయల్. సంగీతంలో శిక్షణ తీసుకోనప్పటికీ ఆత్మన్యూనతకు మాత్రం ఎప్పుడూ లోనుకాలేదు. 'యస్. నేను చేయగలను' అంటూ స్వర విహారం చేస్తుంది. 'ఐయామ్ బ్యాక్ టూ ది బేసిక్స్' అంటూ తన ప్రయాణాన్ని పునఃసమీక్షించుకుంటుంది రాయల్. పాట హిట్ అయితే కాసేపు సంతోషించి ఆ సక్సెస్‌తో డిస్‌కనెక్ట్ అయ్యి 'నెక్స్ట్ ప్రాజెక్ట్'లోకి జంప్ చేయడం రాయల్ అనుసరిస్తున్న విధానం. 'ప్రతి పాట నాకు ఎంతో ఇచ్చింది' అంటున్న రాయల్ తన తాజా పాట 'అస్సీ సజ్నా' గురించి ఏంచెబుతుంది? ఆమె మాటల్లోనే చెప్పాలంటే...

మధురానురాగ రాయల్

జీవితంతో ప్రేమలో పడేలా చేసే సాంగ్. జీవనోత్సాహాన్ని వెలిగించే సాంగ్. జీవితంలోని ఆనంద క్షణాలు గుర్తు తెచ్చుకొని ఆస్వాదించేలా చేసే సాంగ్. 'బాధ నుంచి బయట పడేలా చేసే పాట' అంటుంది రాయల్. పెళ్లి పాటల్లో తనదైన పేరు తెచ్చుకున్న రాయల్‌ను 'పెళ్లి పాటల మహారాణి' అని పిలుస్తారు అభిమానులు.

మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ గురించి రాయల్‌కు చిన్నప్పటి నుంచే ఆసక్తి. వాటిని ఎలా ప్లే చేయాలో నేర్చుకునేది. ఎప్పుడైనా మెలోడి తన బుర్రలోకి వస్తే....అది ఏదో ఒక ఇన్‌స్ట్రుమెంట్ మీద తీయగా పలికేది. బాలీవుడ్‌లో బంధువులు లేరు. గాడ్ ఫాదర్ లేరు. కేవలం తన మీద నమ్మకంతో పంజాబ్‌లోని లుథియానా నుంచి ముంబైకి వచ్చి సింగర్, కంపోజర్‌గా మంచి పేరు తెచ్చుకుంది జస్లీన్ రాయల్.

● ఏఐ ఏరియా



వీలైనన్ని చోట్ల ఏఐ ఫీచర్‌లను తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది గూగుల్. గూగుల్ జెమిని యాప్స్, మోడల్స్‌లో ఇది ఎక్కువగా కనిపిస్తున్నాయి. వాటిలో కొన్ని....

హెల్ప్ మీ రైట్: రాసేటప్పుడు కొన్నిచోట్ల ఏం రాయలో తెలియక స్ట్రక్ అవుతుంటాం. ఇలాంటి సందర్భంలో రచన ముందుకు సాగడానికి ఉపయోగపడే ఫీచర్ ఇది. ఏఐ టెక్స్ట్‌ను జెనరేట్ చేస్తుంది.


ఏఐ వాల్‌పేపర్ అండ్ బ్యాక్‌గ్రౌండ్స్: ఒక్క ప్రాంప్ట్ ఇస్తే చాలు కొత్త వాల్‌పేపర్, బ్యాక్‌గ్రౌండ్స్‌కు ఉపయోగపడే ఏఐ ఫీచర్ ఇది. ఉదా: ఏ క్యాబిన్ ఇన్ ది మిడిల్ ఆఫ్ ఏ పీస్‌ఫుల్ మెడో.

మ్యాజిక్ ఎడిటర్: గూగుల్ ఫొటోస్‌లోని మ్యాజిక్ ఎడిటర్ ఇప్పుడు క్రోమ్ బుక్‌లో కూడా అందుబాటులో ఉంది. చిత్రంలోని వ్యక్తులు, వస్తువులను మూవ్ చేయడానికి, పూర్తిగా తొలగించడానికి ఇది ఉపయోగపడుతుంది.

క్లీయర్ ది డెక్స్

ఒక పని ప్రారంభించడానికి సన్నద్ధం అయ్యే విషయంలో, ముఖ్యమైన ప్రాజెక్ట్ ప్రారంభానికి ముందు చిన్న చిన్న పనులు పూర్తిచేసే సందర్భంలో వాడే మాట....క్లియర్ ది డెక్స్

ఉదా: వి నీడ్ టు క్లియర్ ది డెక్స్ అండ్ గెట్ అవర్ ప్రాజెక్ట్ డన్ ఆన్ టైమ్



ఇన్ లివ్ ఆఫ్

ఒకరి స్థానంలో మరొకరు, ఒక వస్తువుకు బదులుగా మరొకటి... రీప్లేస్‌మెంట్‌కు సంబంధించిన విషయాలలో వాడే మాట... ఇన్ లివ్ ఆఫ్.


ఉదా: వి మేడ్ ఏ డొనేషన్ టు చారిటీ ఇన్ లివ్ ఆఫ్ సెండింగ్ గిఫ్ట్స్ ఫర్ ది వెడ్డింగ్.

మూలం: ఇది 'లివ్ దె' అనే ఫ్రెంచ్ పదబంధం నుంచి వచ్చింది.

దీని అర్థం... ప్రదేశం. 15వ శతాబ్దంలో ఈ పదబంధం ఫ్రెంచ్ నుంచి ఇంగ్లిష్‌లోకి వచ్చింది.

● గేమింగ్

ఆ కొండకు చేరాలంటే కొండంత గుండె కావాలి



డార్కెస్ట్ దంజన్‌కు సీక్వెల్‌గా వస్తున్న డార్కెస్ట్ డంజన్ 2 ఈ నెల 15న విడుదల అవుతుంది. గత గేమ్స్‌లాగే తాజా గేమ్ కూడా రోగ్‌లైక్ రోల్–ప్లేయింగ్ వీడియో గేమ్. తమ వైన శక్తిసామర్థ్యాలతో ఉండే విభిన్నమైన క్యారెక్టర్లు దీనిలో ఉంటాయి. ఈ గేమ్ అంతిమ లక్ష్యం కొండకు చేరడం. కొన్ని శక్తులు ప్రపంచాన్ని ఆక్రమించడంలో కీలక పాత్ర పోషించిన కొండ ఇది. కొండను అన్వేషించే క్రమంలో ప్లేయర్‌కు రకరకాల అడ్డంకులు ఎదురవుతుంటాయి. ఈ టర్న్–బేస్డ్ గేమ్‌లో రాంగ్ స్పాట్‌లో ఉన్నప్పుడు ప్లేయర్ తన స్కిల్స్‌ను ఉపయోగించలేరు.

డెవపర్స్: రెడ్ హుక్ స్టూడియోస్ ఇంజిన్: యూనిటీ

ప్లాట్‌ఫామ్స్: విండోస్, ప్లేస్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, నిన్‌టెండో స్విచ్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

జానర్స్: రోల్–ప్లేయింగ్, రోగ్‌లైక్ మోడ్ సింగిల్–ప్లేయర్

సినిమా

నా కల నెరవేరుతోంది

- శంకర్



● కియారా, రామ్‌చరణ్



● శంకర్

''తెలుగులో నేరుగా ఓ సినిమా తెరకెక్కించాలనే నా కల 'గేమ్ ఛేంజర్' సినిమాతో నెరవేరుతోంది''అంటున్నారు దర్శకుడు శంకర్. ఆయన దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'భారతీయుడు 2'. కమల్‌హాసన్ హీరోగా నటించిన ఈ చిత్రం తెలుగులో 'భారతీయుడు 2', తమిళంలో 'ఇండియన్ 2', హిందీలో 'హిందుస్తానీ 2' పేరుతో నేడు రోజు రిలీజ్ అవుతోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో శంకర్ మాట్లాడుతూ... రామ్‌చరణ్ హీరోగా తాను తెరకెక్కిస్తున్న 'గేమ్ ఛేంజర్' చిత్రం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ''నేను తీసిన తమిళ సినిమాలకు తెలుగులో అపూర్వ ఆదరణ దక్కింది. తెలుగు ప్రేక్షకులు నా సినిమాలను బాగా ఆదరించారు. ఈ కారణంగా తెలుగులో నేరుగా ఓ సినిమా తెరకెక్కించాలని ఎప్పుడూ అనుకునే వాణ్ణి. ఆ మేరకు కొన్ని ప్రయత్నాలు చేసినా విఫలమయ్యాయి. ఎట్టకేలకు 'గేమ్ ఛేంజర్' సినిమాతో నా కల నెరవేరుతోంది. డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజు ఇచ్చిన కథతో ఈ సినిమా తెరకెక్కించాను. ఇది పూర్తి స్థాయి యాక్షన్ చిత్రం. నా దర్శకత్వంలో 'గేమ్ ఛేంజర్' లాంటి మాస్ మూవీ వచ్చి చాలా కాలమైంది'' అని ఆ ఇంటర్వ్యూలో శంకర్ తెలిపారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న 'గేమ్ చేంజర్'లో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

ప్యాలెస్‌లో ప్రారంభం

హీరో వెంకటేశ్, దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్ కాంబినేషన్‌లో ముచ్చటగా మూడో సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. వెంకటేశ్ హీరోగా మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై రూపొందుతున్న 58వ చిత్రమిది. ఈ సినిమా రెగ్యులర్‌ను షూటింగ్ గురువారం హైదరాబాద్‌లో ఆరంభించారు మేకర్స్. ''హీరో, అతని భార్య... మాజీ ప్రేయసి... ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే ఎక్స్‌ట్రార్డినరీ ట్రయాంగిల్ క్రైమ్ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీ రూపొందుతోంది. ప్రస్తుతం ఓ ప్యాలెస్‌లో జరుగుతున్న షూటింగ్‌లో సినిమాలోని ప్రధాన తారాగణం పాల్గొంటున్నారు. ఈ మూవీ కోసం టాప్ టెక్నీషియన్స్ పని చేస్తున్నారు. 2025 సంక్రాంతి పండగకి ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: సమీర్ రెడ్డి.



● వెంకటేశ్

ప్రతి ముఖం ఓ కథ చెబుతుంది



● జాన్వీ కపూర్

ఇండియన్ ఫారిన్ సర్వీసెస్ (ఐఎఫ్ఎస్) విభాగంలో ఆఫీసర్‌గా ఉద్యోగం చేసి ఓ కుట్రను గురించి కాన్ఫిడెన్షియల్ ఫైల్‌ను రెడీ చేశారు జాన్వీ కపూర్. మరి... ఈ ఫైల్‌లో ఉన్న వివరాలు ఏంటి? నిజమైన కుట్రదారులు ఎవరు? అనే ప్రశ్నలకు సమాధానం 'ఉలజ్' సినిమాలో చూడాలి. ఈ సినిమాలోనే జాన్వీ కపూర్ ఐఎఫ్ఎస్ ఆఫీసర్‌గా నటించారు. ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీకి సుధాంశు సరియ దర్శకత్వం వహించారు. ముందు 'ఉలజ్'ను జూలై 5న విడుదల చేయాలనుకున్నారు. కానీ రిలీజ్ కాలేదు. దీంతో ఆగస్టు 2న రిలీజ్ చేస్తున్నట్లుగా ప్రకటించి, కొత్త ఫోటోలను విడుదల చేసింది యూనిట్. ''ప్రతి ముఖం ఓ కథ చెబుతుంది. ప్రతి కథ ఓ ఉచ్చులాంటిదే'' అని ఈ సినిమాను ఉద్దేశించి పేర్కొన్నారు జాన్వీ కపూర్. ఇక తెలుగులో ఎన్టీఆర్ 'దేవర', రామ్‌చరణ్ 'పెద్ది' (ప్రచారంలో ఉన్న టైటిల్), హిందీలో వరుణ్ ధావన్ 'సన్నీ సంస్కారీకీ తులసీ కుమారి' చిత్రాల్లో హీరోయిన్‌గా చేస్తున్నారు జాన్వీ కపూర్.

ఇండియా ఫైల్స్‌లాంటి సినిమా అవసరం

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



● అద్దంకి దయాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కీరవాణి, సుమన్, బొమ్మకు మురళి

''ప్రస్తుత సమాజానికి 'ఇండియా ఫైల్స్' లాంటి సినిమా చాలా అవసరం. బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలే మూలాలుగా తెరకెక్కిన ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నా'' అని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. అద్దంకి దయాకర్ లీడ్ రోల్‌లో ఇంద్రజ, సుమన్, 'శుభలేఖ' సుధాకర్ ఇతర పాత్రల్లో నటించిన చిత్రం 'ఇండియా ఫైల్స్'. బొమ్మకు హిమమాల సమర్పణలో డా. బొమ్మకు మురళి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఎంఎం కీరవాణి సంగీతం అందించిన ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ– ''అద్దంకి దయాకర్ నటన చూడలేదు. కానీ ఆయనకు ప్రతి సబ్జెక్ట్, సమస్యల పట్ల ఉన్న అవగాహన నాకు తెలుసు. దయాకర్ ఎప్పటికైనా పెద్ద నాయకుడు కావాలి'' అన్నారు. ''గద్దర్‌గారు పాడి, నటించిన పాటకి నేను సంగీతం అందించడం సంతోషంగా ఉంది'' అన్నారు ఎంఎం కీరవాణి. డా. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ– ''నటనంటే తెలియని నాకు 40 రోజులు శిక్షణ ఇచ్చి, మంచి కంటెంట్ ఉన్న సినిమాలో నటించే చాన్స్ కల్పించిన మురళిగారికి కృతజ్ఞతలు'' అన్నారు. ''ఈ సినిమా సమాజం గురించి చాలా విషయాలు నేర్పిస్తుంది... ఆలోచింపజేస్తుంది'' అన్నారు బొమ్మకు మురళి. గీత రచయిత మౌనశ్రీ మల్లిక్, దివంగత ప్రజా గాయకుడు గద్దర్ కూతురు వెన్నెల, కొరియోగ్రాఫర్ సుచిత్రా చంద్రబోస్ మాట్లాడారు.

వారం ఆలస్యంగా తుఫాన్



● విజయ్ ఆంటోని

థియేటర్లలోకి తుఫాన్ రాక వారం ఆలస్యం కానుంది. విజయ్ ఆంటోని హీరోగా నటించిన తాజా చిత్రం 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మేఘా ఆకాశ్ హీరోయిన్‌గా నటించారు. కమల్ బోరా, డి. లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 26న విడుదల చేయనున్నట్లు మేకర్స్ తొలుత ప్రకటించారు. అయితే వారం ఆలస్యంగా ఆగస్టు 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తాజాగా కొత్త తేదీని ప్రకటించారు. ''పొయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా 'తుఫాన్' సినిమాని తెరకెక్కించారు విజయ్ మిల్టన్. తనని చిన్న చూపు చూసే సమాజం భవితను మార్చిన ఓ వ్యక్తి కథ ఇది. ఓ దీవి నేపథ్యంలో ఈ కథ సాగుతుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

డేట్ ఫిక్స్



● రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా

రాజ్ తరుణ్ హీరోగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందిన రొమాంటిక్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ 'తిరగబడర సామీ'. ఈ చిత్రంలో మాల్వీ మల్హోత్రా హీరోయిన్‌గా నటించగా, హీరోయిన్ మన్నారా చోప్రా ఓ కీలక పాత్ర చేశారు. మల్కాపురం శివకుమార్ నిర్మించిన చిత్రం ఇది. ఈ సినిమాను ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లుగా చిత్రయూనిట్ ప్రకటించింది. ''యువతను ఆకట్టుకునే ఫ్యామిలీ, రొమాన్స్ అంశాలతో పాటుగా సెంటిమెంట్, మాస్ అంశాలు కూడా ఈ సినిమాలో ఉన్నాయి. మన్నారా చోప్రా ఈ సినిమాలో ఓ డిఫరెంట్ రోల్ చేశారు. ఓ స్పెషల్ సాంగ్‌లోనూ కనిపిస్తారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

నీ ప్రేమలో..!

రణ్‌బీర్ కపూర్ 'యానిమల్'లో జోయా పాత్రలో గ్లామరస్‌గా నటించి బాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు హీరోయిన్ త్రిప్తీ దిమ్రి. 'యానిమల్' సినిమా కూడా బాక్సాఫీస్ బ్లాక్‌బస్టర్‌గా నిలవడంతో ఈ బ్యూటీకి వరుస అవకాశాలు క్యూ కట్టాయి. ఈ క్రమంలో రాజ్‌కుమార్ రావుతో 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో', కార్తీక్ ఆర్యన్‌తో 'భూల్ భూలయ్యా 3', సిద్ధాంత్ చతుర్వేదితో 'ధడక్ 2' సినిమాల్లో హీరోయిన్‌గా చాన్స్‌లు దక్కించుకున్నారు త్రిప్తి. ఈ బ్యూటీకి మరో హిందీ సినిమా ఆఫర్ దక్కిందని టాక్. 'రాంఝుణా', 'అత్రంగి రే' చిత్రాల తర్వాత హీరో ధనుష్, దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్ కాంబినేషన్‌లో మూడో సినిమా తెరకెక్కనుంది. ప్రేమకథ నేపథ్యంలో 'తేరే ఇష్క్ మే' (నీ ప్రేమలో) టైటిల్‌తో ఈ సినిమా చేయనున్నారు. ఈ చిత్రం షూటింగ్‌ను అక్టోబరులో ప్రారంభించాలనుకుంటున్నారు. హీరోయిన్ పాత్రకు త్రిప్తీ దిమ్రిని సంప్రదించారనే ప్రచారం బాలీవుడ్‌లో జరుగుతోంది. మరి... 'తేరే ఇష్క్ మే' అంటూ ధనుష్‌తో త్రిప్తి జోడీ కడతారా? అనేది త్వరలో తెలిసిపోతుంది.



● త్రిప్తీ దిమ్రి

నాది వన్ సైడ్ లవ్

- దర్శకుడు అశ్విన్ రామ్



''చిన్నప్పట్నుంచీ తెలుగు సినిమాలు చూసి ఎంజాయ్ చేస్తున్నాను. తమిళ దర్శకుడు అట్లీ తీసిన 'రాజా రాణి'కి దర్శకత్వ విభాగంలో చేశాను. దర్శకుడు మురుగదాస్ ప్రొడక్షన్‌లోని మూడు సినిమాల్లో భాగమయ్యాను. ధనుష్‌గారి సినిమాలకూ వర్క్ చేశాను. తమిళంలో ఓ సినిమాకు దర్శకత్వం వహించాను. తెలుగు సినిమాలపై నాది వన్ సైడ్ లవ్ (నవ్వుతూ). ఇప్పుడు తెలుగులో 'డార్లింగ్' చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నందుకు హ్యాపీగా ఉంది'' అన్నారు అశ్విన్ రామ్. ప్రియదర్శి, నభా నటేశ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'డార్లింగ్'. కె. నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సందర్భంగా అశ్విన్ రామ్ మాట్లాడుతూ– ''భార్యాభర్తల అనుబంధం నేపథ్యంలో సాగే సినిమా 'డార్లింగ్'. ఈ అనుబంధం నేపథ్యంలో కొన్ని సినిమాలు వచ్చాయి. కానీ మా 'డార్లింగ్' కొత్తగా ఉంటుంది. ఇప్పటివరకూ మా సినిమాను చూసిన నలభైమంది ఈ కొత్తదనాన్నే ఫీలయ్యారు. ఈ సినిమా ట్రైలర్ చూసి నభా పాత్రలో స్ప్లిట్ పర్సనాలిటీ ఉంది కాబట్టి కొందరు 'అపరిచితుడు'తో పోల్చుతున్నారు. 'డార్లింగ్', 'అపరిచితుడు' సినిమాల మధ్య ఉన్న కామన్ పాయింట్ స్ప్లిట్ పర్సనాలిటీ మాత్రమే'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
27	8
79,897	24,316

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,312	△ 336
డోజోన్స్	39,764	△ 43
ఎఫ్‌టీఎస్ఈ 100	8,223	△ 30
డాక్స్	18,535	△ 127
షాంఘై	2,970	△ 31
నికాయ్	42,224	△ 392

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	
72,563 ▽	53
బంగారం (99.5 స్వచ్ఛత)	
72,273 ▽	52
వెండి (కేజీ)	
92,204 ▽	411

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.10	84.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.69	108.26
€	యూరో	ఎస్‌బీఐ	89.29	91.65
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	51.47	52.60
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.42	57.36
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.50	64.16
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.35	22.92
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.44

బ్రూక్‌ఫీల్డ్ చేతికి లీప్ గ్రీన్ ఎనర్జీ



న్యూఢిల్లీ: పునరుత్పాదక ఇంధన సంస్థ లీప్ గ్రీన్ ఎనర్జీలో మెజారిటీ వాటాను కొనుగోలు చేసినట్లు కెనడియన్ అసెట్ మేనేజ్‌మెంట్ దిగ్గజం బ్రూక్‌ఫీల్డ్ పేర్కొంది. ఇందుకు ముందస్తుగా 20 కోట్ల డాలర్ల(రూ. 1,670 కోట్లు) చెల్లించనున్నట్లు వెల్లడించింది. భవిష్యత్‌లో మరో 35 కోట్ల డాలర్ల(రూ. 2,920 కోట్లు) ఇన్వెస్ట్ చేయనున్నట్లు తెలియజేసింది. రెండు కంపెనీలు వ్యూహాత్మక తప్పనిసరి పెట్టుబడుల ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు బ్రూక్‌ఫీల్డ్ ఒక ప్రకటనలో వివరించింది. తద్వారా లీప్ గ్రీన్ ఎనర్జీలో మెజారిటీ వాటా సొంతం చేసుకున్నట్లు తెలియజేసింది. ఒప్పందంలో భాగంగా తొలుత 20 కోట్ల డాలర్లను కొత్త షేర్లతోపాటు, ప్రస్తుత వాటాదారుల వద్ద గల షేర్ల కొనుగోలుకి వెచ్చించనుంది. కంపెనీ భవిష్యత్ వృద్ధికి మద్దతుగా మరో 35 కోట్ల డాలర్ల పెట్టుబడులు సమకూర్చనుంది. కాగా.. లీప్ గ్రీన్‌లో ఎంతమేర వాటాను కొనుగోలు చేస్తున్నదీ నిర్దిష్టంగా వెల్లడించకపోవడం గమనార్హం! ప్రస్తుతం లీప్ గ్రీన్ 775 మెగావాట్ల ఎనర్జీ సౌర, పవన విద్యుత్ ఆస్తులను కలిగి ఉంది. వీటిలో నిర్మాణం, నిర్వహణలోని ఆస్తులు కలసి ఉన్నాయి.

- ముందస్తుగా రూ. 1,670 కోట్ల చెల్లింపు
- మరో రూ. 2,920 కోట్ల పెట్టుబడులకు సై

• చమురు రంగంలో అవకాశాలు

100 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: చమురు, గ్యాస్ అన్వేషణ, ఉత్పత్తి (ఈ అండ్ పీ) రంగంలో 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవకాశాలు ఉన్నాయని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. ఈ రంగంలో స్వీయ సమృద్ధి సాధిస్తే దిగుమతులపై ఆధారపడటం తగ్గుతుందని, అలాగే ఇంధనాల ధరలు తగ్గడానికి కూడా ఆస్కారం ఉంటుందని ఆయన చెప్పారు. సుస్థిర ఆర్థికాభివృద్ధికి కీలకమైన ఇంధన రంగం స్వీయ సమృద్ధి సాధించడంలో 'ఈ అండ్ పీ' ముఖ్య పాత్ర పోషించగలదని 'ఊర్జా వర్తా' సదస్సులో పాల్గొన్న సందర్భంగా మంత్రి చెప్పారు. భారత్‌లో వనరులు పుష్కలంగా అందుబాటులో ఉన్నప్పటికీ చమురు కోసం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తుండటం ఆశ్చర్యకరమైన అంశమన్నారు. దేశీయంగా చమురు, గ్యాస్ వెలికితీయడానికి సంబంధించి ఇంకా బైటపడని వనరులను అన్వేషించడంపై మరింతగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పురి చెప్పారు. ఈఅండ్‌పీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం తన వంతు కృషి చేస్తోందని ఆయన తెలిపారు. 2015లో ప్రవేశపెట్టిన డిస్కవర్డ్ స్మాల్ ఫీల్డ్ (డీఎస్ఎఫ్) పాలసీతో ఇప్పటివరకు 29 కొత్త సంస్థలు, 2 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని వివరించారు. ఈ రంగంలో వ్యాపారాలకు అనువైన పరిస్థితులు కల్పించడంలో ఉన్న సమస్యల అధ్యయనానికి, తగు సిఫార్సులు చేయడానికి సంయుక్త వర్కింగ్ గ్రూప్ (జేడబ్ల్యూజీ)ని ఏర్పాటు చేసినట్లు పురి తెలిపారు. ఇందులో ప్రైవేట్ ఈఅండ్‌పీ ఆపరేటర్లు, ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు, డీజీహెచ్, పెట్రోల్.. సహజవాయువు శాఖ నుంచి ప్రతినిధులు ఉంటారన్నారు.



- దిగుమతులు తగ్గించుకునే ఆస్కారం
- కేంద్ర మంత్రి హర్‌దీప్ సింగ్ పురి వెల్లడి

టీసీఎస్ బోణీ భేష్!



ముంబై: ఐటీ సేవలకు దేశీయంగా నంబర్ వన్‌గా నిలుస్తున్న టీసీఎస్ ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్–జూన్ (క్యూ1)లో నికర లాభం 8.7% ఎగసి రూ. 12,040 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 11,074 కోట్లు ఆర్జించింది. ఇక మొత్తం ఆదాయం సైతం 5.4% వృద్ధితో రూ. 62,613 కోట్లకు చేరింది. అయితే త్రైమాసికవారీగా అంటే క్యూ4 (జనవరి–మార్చి)తో పోలిస్తే నికర లాభం 3.1%, ఆదాయం 2.2% చొప్పున నీరసించాయి.

మార్జిన్లు గుడ్

వార్షిక వేతన పెంపు నేపథ్యంలోనూ తాజా త్రైమాసికంలో కంపెనీ మెరుగైన నిర్వహణ మార్జిన్లను సాధించినట్లు సీఎఫ్‌వో సమీర్ సేక్సారియా వెల్లడించారు. పటిష్ట నిర్వహణ సామర్థ్యాన్ని ఇది ప్రతిఫలిస్తున్నదని పేర్కొన్నారు. వార్షిక వేతన పెంపును విజయవంతంగా అమలు చేసినట్లు కంపెనీ చీఫ్ హెచ్ఆర్ అధికారి మిలింద్ లక్కడ్ తెలియజేశారు. పరిశ్రమలో అగ్రస్థానం, పటిష్ట బిజినెస్ పనితీరు, నికరంగా ఉద్యోగులను జత చేసుకోవడంపై నిరంతర దృష్టి సంతృప్తినిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్ నేతృత్వంలో వర్ధమాన మార్కెట్లలో 62 శాతం వృద్ధిని సాధించింది. ప్రధానంగా బీఎస్ఎన్ఎల్ డీల్ ఇందుకు సహకరించింది. త్రైమాసికవారీగా మాత్రం అన్ని ప్రధాన మార్కెట్లలోనూ వృద్ధి నమోదైనట్లు కంపెనీ పేర్కొంది. కంపెనీకి అత్యంత కీలకమైన బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) విభాగం 1% తగ్గగా.. కన్జూమర్ బిజినెస్, టెక్నాలజీ, సర్వీసులు, కమ్యూనికేషన్స్, మీడియా రంగాలు 7.4% వెనకడుగు వేశాయి. తయారీ 9.4% ఎగసింది.

ఇతర విశేషాలు

- మార్జిన్లు 1.5 శాతం మెరుగుపడి 24.7 శాతానికి చేరాయి.
- 13.2 బిలియన్ డాలర్ల విలువైన కాంట్రాక్టులను పొందింది.
- మూడు త్రైమాసికాల తర్వాత క్యూ1లో 5,452 మంది ఉద్యోగులు జతయ్యారు.
- మొత్తం సిబ్బంది సంఖ్య 6,06,998కి చేరింది.
- ఐటీ సర్వీసుల్లో ఉద్యోగ వలసల రేటు 12.1%గా ఉంది.
- ఒక్కో షేరుపై రూ. 10 డివిడెండ్ చెల్లించనుంది.

టీసీఎస్ షేరు ధర గురువారం స్వల్పంగా పెరిగి రూ. 3,923 వద్ద ముగిసింది.

క్యూ1 రిపోర్ట్ కార్డ్

- లాభం రూ. 12,040 కోట్లు
- ఆదాయం రూ. 62,613 కోట్లు
- డివిడెండ్ రూ. 10
- కొత్త ఉద్యోగులు 5452
- మొత్తం సిబ్బంది 6,06,998
- వలసల రేటు 12.1%

కొత్త ఏడాది ఉత్సాహంగా..



కొత్త ఆర్థిక సంవత్సరాన్ని పటిష్టంగా ప్రారంభించామని చెప్పేందుకు ఉత్సాహపడుతున్నాను. విభిన్న రంగాలు, మార్కెట్లలో అన్ని అంశాలలోనూ వృద్ధిని అందుకున్నాం. క్లయింట్ సంబంధాల విస్తరణ, కొత్త సామర్థ్యాల సృష్టి, సాంకేతికతల మెరుగు, ఆవిష్కరణలపై పెట్టుబడులు కొనసాగిస్తున్నాం. వీటిలో ఫ్రాన్స్‌లో ఏఐ కేంద్రం, యూఎస్‌లో ఐవోటీ ల్యాబ్, లాటిన్ అమెరికా, కెనడా, యూరప్‌లలో డెలివరీ సెంటర్ల విస్తరణ తదితరాలున్నాయి.

–కె.కృతివాసన్, సీఈవో, ఎండీ, టీసీఎస్

• రియల్టీ కింగ్..

డీఎల్‌ఎఫ్ 'సింగ్'

ముంబై: రియల్ ఎస్టేట్ దిగ్గజం డీఎల్‌ఎఫ్ చైర్మన్ రాజీవ్ సింగ్ .. రియల్టీ రంగ కుబేరుడిగా నిల్చారు. రూ. 1,24,420 లక్షల కోట్ల సంపదతో అగ్రస్థానం దక్కించుకున్నారు. మాక్రోటెక్ డెవలపర్స్ వ్యవస్థాపకుడు మంగళ్ ప్రభాత్ లోధా, ఆయన కుటుంబం రూ. 91,700 కోట్ల సంపదతో రెండో ర్యాంకు దక్కించుకుంది. దేశీయంగా టాప్ 100 రియల్టీ దిగ్గజాలతో గ్రోహె–హురున్ రూపొందించిన జాబితాలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ దేశంలోనే అత్యంత సంపన్నుల్లో రెండో స్థానంలో ఉన్నప్పటికీ, రియల్టీ విభాగానికి సంబంధించి రూ. 56,500 కోట్ల సంపదతో అదానీ, ఆయన కుటుంబానికి మూడో స్థానం దక్కింది. గౌతమ్ అదానీకి చెందిన అదానీ రియల్టీ ఈ ఏడాది టాప్ 10లోకి చేరినట్లు హురున్ ఒక ప్రకటనలో తెలిపింది. 2024 మే 31 నాటికి రియల్టీ సంస్థల వేల్యుయేషన్, బడా రియల్టర్ల సంపద గణాంకాలను ఈ లిస్టుకు ప్రాతిపదికగా తీసుకున్నట్లు పేర్కొంది. కంపెనీలపరంగా చూస్తే డీఎల్‌ఎఫ్ వేల్యుయేషన్ 72% పెరిగి రూ. 2 లక్షల కోట్లకు, మ్యాక్రోటెక్ డెవలపర్స్ వేల్యుయేషన్ 160% వృద్ధితో రూ. 1.4 లక్షల కోట్లకు చేరింది. అన్‌లిస్టెడ్ సంస్థ అదానీ రియల్టీ రూ. 56,500 కోట్ల వేల్యుయేషన్‌తో ఏడో స్థానంలో ఉంది.

టాప్ 20లో అపర్ణ, ఎన్‌సీసీ..

వేల్యుయేషన్‌పరంగా టాప్ 20 రియల్టీ దిగ్గజాల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్, ఎన్‌సీసీ చోటు దక్కించుకున్నాయి. రూ. 33,130 కోట్ల వేల్యుయేషన్‌తో అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ 11వ స్థానంలో, రూ. 18,040 కోట్ల విలువతో ఎన్‌సీసీ 20వ స్థానంలో నిల్చాయి. నగరాలవారీగా చూస్తే 6 కంపెనీలతో హైదరాబాద్ అయిదో స్థానంలో ఉంది. మహిళలు నేతృత్వం వహిస్తున్న రెండు సంస్థల్లో ఒకటిగా జి. ఇందిరా కృష్ణారెడ్డి సారథ్యంలోని తాజ్ జీవీకే నిల్చింది.



- రూ. 1.24 లక్షల కోట్ల సంపద; గ్రోహె–హురున్ లిస్ట్‌లో అగ్రస్థానం
- మూడో స్థానంలో అదానీ

టీవీఎస్ జూపిటర్ సీఎన్‌జీ!



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ జూపిటర్ సీఎన్‌జీ స్కూటర్‌ను తీసుకొచ్చే పనిలో నిమగ్నమైంది. అన్నీ అనుకూలిస్తే ఈ ఏడాదే ఈ స్కూటర్ భారత రోడ్లపై పరుగు తీయనుంది. బజాజ్ ఆటో ఇటీవలే ప్రపంచంలో తొలి సీఎన్‌జీ బైక్ 'ఫ్రీడమ్ 125' విడుదల చేసిన నేపథ్యంలో.. పోటీ కంపెనీ అయిన టీవీఎస్ ప్రపంచంలో తొలి సీఎన్‌జీ స్కూటర్‌ను పరిచయం చేయాలని కృతనిశ్చయంతో ఉన్నట్టు సమాచారం. యూ740 కోడ్ నేమ్‌తో సీఎన్‌జీ వర్షన్‌పై టీవీఎస్ పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక టీవీఎస్ నుంచి 2024లో కొత్తగా ఎలక్ట్రిక్ టూవీలర్, పెట్రోల్ ఇంజన్‌తో ద్విచక్ర వాహనంతోపాటు ఎలక్ట్రిక్ త్రీవీలర్ రోడ్డెక్కనుంది.

సైయంట్ 'సెమికండక్టర్స్' అనుబంధ సంస్థ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెక్నాలజీ కంపెనీ సైయంట్ తాజాగా అనుబంధ కంపెనీ ఏర్పాటు చేసింది. ఏఎస్ఐసీ సెమికండక్టర్ వ్యాపారంలో పూర్తి స్థాయి టర్న్‌కీ పరిష్కారాల కోసం ప్రత్యేక విభాగం ఉండాలని సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. వ్యాపార పునర్‌వ్యవస్థీకరణ కోసం ఈ మేరకు బోర్డు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఏఎస్ఐసీ టర్న్‌కీ డిజైన్, చిప్ విక్రయాల్లో దశాబ్దంపైగా అనుభవం ఉందని సైయంట్ వెల్లడించింది.

మార్కెట్‌కు స్వల్ప నష్టాలు



ముంబై: కార్పొరేట్ కంపెనీల జూన్ త్రైమాసిక ఫలితాల ప్రారంభం, అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అధిక వెయిటేజీ షేర్లలో లాభాలు స్వీకరించారు. ఉదయం లాభాలతో మొదలైన స్టాక్ సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంట్రాడేలో 706 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరికి 27 పాయింట్లు నష్టపోయి 79,897 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 24,194 – 24,403 శ్రేణిలో ట్రేడైంది. ఆఖరికి 8 పాయింట్ల నష్టంతో 24,316 వద్ద ముగిసింది. రియల్టీ, ఆటో, యుటిలిటీ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఫెడ్ వడ్డీరేట్లను ప్రభావితం చేసే అమెరికా ద్రవ్యోల్బణం తగ్గొచ్చనే అంచనాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా కన్జూమర్ షేర్లు 1% నుంచి అరశాతం నష్టపోయాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..
ఆహార ధరలు ఇంకా తీవ్రమే: దాస్
హైదరాబాద్‌లో తగ్గిన ఇళ్ల అమ్మకాలు



ఇన్నింగ్స్ విజయం దిశగా ఇంగ్లండ్

లండన్: వెస్టిండీస్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ విజయం దిశగా సాగుతోంది. మ్యాచ్ రెండో రోజు 250 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన వెస్టిండీస్ ఆట ముగిసే సమయానికి 6 వికెట్లు కోల్పోయి 79 పరుగులు సాధించింది. అండర్సన్, అట్కిన్‌సన్, స్టోక్స్ రెండు వికెట్ల చొప్పున తీశారు. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే వెస్టిండీస్ మరో 171 పరుగులు చేయాలి. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 189/3తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 90 ఓవర్లలో 371 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (68 : 7 ఫోర్లు), హ్యారీ బ్రూక్ (50 : 5 ఫోర్లు, 1 సిక్స్), తొలి టెస్టు ఆడుతున్న జేమీ స్మిత్ (70 : 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. విండీస్ బౌలర్లలో జేడెన్ సీల్స్ 4 వికెట్లు పడగొట్టగా... హోల్డర్, గుడకేశ్ మోతీ 2 వికెట్లు చొప్పున తీశారు.

జాస్మిన్ జయహో

- రెండు మ్యాచ్ పాయింట్లు కాపాడుకొని ఫైనల్ చేరిన ఇటలీ ప్లేయర్
- 2 గంటల 51 నిమిషాలపాటు జరిగిన సెమీఫైనల్ పోరులో డోనా వెకిచ్‌పై విజయం
- రేపు క్రిచికోవాతో వింబుల్డన్ టైటిల్ కోసం అమీతుమీ



జాస్మిన్

లండన్: గత మూడేళ్లు వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టిన ఇటలీ క్రీడాకారిణి జాస్మిన్ పావోలిని... ఈసారి మాత్రం విన్నర్స్ ట్రోఫీని ఇంటికి తీసుకెళ్లేందుకు విజయం దూరంలో ఉంది. ఈ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన ప్రపంచ ఏడో ర్యాంకర్ జాస్మిన్ వింబుల్డన్ టోర్నీలోనూ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి సెమీఫైనల్లో 28 ఏళ్ల జాస్మిన్ 2 గంటల 51 నిమిషాల్లో 2–6, 6–4, 7–6 (10/8)తో ప్రపంచ 37వ ర్యాంకర్ డోనా వెకిచ్ (క్రొయేషియా)పై గెలిచింది. రెండో సెమీఫైనల్లో ప్రపంచ 32వ ర్యాంకర్, 2021 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ బర్బోరా క్రిచికోవా (చెక్ రిపబ్లిక్) 2 గంటల 7 నిమిషాల్లో 3–6, 6–3, 6–4తో 2022 విజేత, ప్రపంచ నాలుగో ర్యాంకర్ రిబాకినా (కజకిస్తాన్)పై విజయం సాధించింది. తన కెరీర్‌లో తొలిసారి వింబుల్డన్ టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించింది. రేపు జరిగే తుది పోరులో జాస్మిన్‌తో క్రిచికోవా తలపడుతుంది. ఎవరు నెగ్గినా వారికి తొలి వింబుల్డన్ టైటిల్ అవుతుంది.

వెకిచ్‌తో జరిగిన సెమీఫైనల్లో తొలి సెట్‌ను కోల్పోయిన జాస్మిన్ రెండో సెట్‌ను నెగ్గి మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో సెట్‌లో స్కోరు 4–5 వద్ద... టైబ్రేక్‌లో 5–6 వద్ద జాస్మిన్ రెండుసార్లు మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో వింబుల్డన్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో ఫైనల్ చేరిన తొలి ఇటలీ క్రీడాకారిణిగా జాస్మిన్ రికార్డు నెలకొల్పింది. 2 గంటల 51 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్ వింబుల్డన్ చరిత్రలోనే సుదీర్ఘంగా సాగిన మహిళల సెమీఫైనల్‌గా రికార్డు పుస్తకాల్లోకి ఎక్కింది. 2009లో సెరెనా విలియమ్స్ (అమెరికా), ఎలీనా దెమెంతియెవా (రష్యా) మధ్య సెమీఫైనల్ 2 గంటల 49 నిమిషాలు సాగింది. కెరీర్‌లో తొలిసారి సెమీఫైనల్ ఆడిన వెకిచ్ అందివచ్చిన అవకాశాలను చేజార్చుకొని మూల్యం చెల్లించుకుంది. జాస్మిన్ సర్వీస్‌ను బ్రేక్ చేసేందుకు వెకిచ్‌కు 14 సార్లు అవకాశం లభించగా ఆమె నాలుగుసార్లు మాత్రమే సద్వినియోగం చేసుకుంది. 42 విన్నర్స్ కొట్టిన వెకిచ్ ఏకంగా 57 అనవసర తప్పిదాలు చేసింది.

నేడు జరిగే పురుషుల సింగిల్స్ సెమీఫైనల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ అల్‌కరాజ్ (స్పెయిన్)తో మెద్వెదెవ్ (రష్యా); ముసెట్టి (ఇటలీ)తో జొకోవిచ్ (సెర్బియా) ఆడతారు. సాయంత్రం 6 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌లను స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.



క్రిచికోవా

శ్రీలంకతో 3 టి20లు, 3 వన్డేలు ఆడనున్న భారత్

- ఈనెల 26 నుంచి సిరీస్
- రెండు జట్లకు కొత్త కోచ్‌లు





న్యూఢిల్లీ: ఈనెల చివర్లో శ్రీలంకలో పర్యటించే భారత క్రికెట్ జట్టు షెడ్యూల్‌ను విడుదల చేశారు. రెండు వేదికల్లో 13 రోజులపాటు జరిగే ఈ సిరీస్‌లో శ్రీలంకతో భారత జట్టు మూడు టి20 మ్యాచ్‌లు, మూడు వన్డేలు ఆడుతుంది. పల్లెకెలె మైదానంలో జూలై 26, 27, 29వ తేదీల్లో వరుసగా మూడు టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. అనంతరం ఆగస్టు 1, 4, 7 తేదీల్లో కొలంబోలోని ఆర్.ప్రేమదాస స్టేడియంలో మూడు వన్డేలు జరుగుతాయి. కొత్త హెడ్ కోచ్‌ల పర్యవేక్షణలో రెండు జట్లు ఈ సిరీస్‌లో పోటీపడనున్నాయి. టీమిండియాకు గౌతమ్ గంభీర్... శ్రీలంకకు సనత్ జయసూర్య హెడ్ కోచ్‌లుగా వ్యవహరించనున్నారు. ఈ సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును ఇంకా ప్రకటించలేదు. సీనియర్ ప్లేయర్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఈ పర్యటనకు దూరంగా ఉండే అవకాశముంది.

శ్రీలంక కెప్టెన్సీకి హసరంగ రాజీనామా



కొలంబో: శ్రీలంక టి20 క్రికెట్ జట్టు కెప్టెన్సీ బాధ్యతల నుంచి వైదొలుగుతున్నట్లు లెగ్ స్పిన్నర్ హసరంగ ప్రకటించాడు. శ్రీలంక క్రికెట్ మేలు కోరే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు, జట్టులో సభ్యుడిగా కొనసాగుతానని హసరంగ వివరించాడు. హసరంగ రాజీనామా నేపథ్యంలో ఈ నెలాఖరులో స్వదేశంలో భారత జట్టుతో జరిగే మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో శ్రీలంక కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో ఆడుతుంది. గత నెలలో వెస్టిండీస్–అమెరికాలలో జరిగిన టి20 ప్రపంచకప్‌లో హసరంగ నేతృత్వంలో ఆడిన శ్రీలంక లీగ్ దశలోనే ఇంటిదారి పట్టింది. జట్టు పేలవ ప్రదర్శన కారణంగా హెడ్ కోచ్ క్రిస్ సిల్వర్‌వుడ్ తన పదవికి రాజీనామా చేయగా, కోచ్ బాటనే కెప్టెన్ అనుసరించాడు.

23 ఏళ్ల తర్వాత...

కోపా అమెరికా కప్ ఫైనల్లో కొలంబియా



లెర్మా

చార్లోటి (నార్త్ కరోలినా): రెండోసారి కోపా అమెరికా కప్ చాంపియన్‌గా నిలిచేందుకు కొలంబియా జట్టు విజయం దూరంలో నిలిచింది. గతంలో 15 సార్లు చాంపియన్‌గా నిలిచిన ఉరుగ్వే జట్టుతో గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో కొలంబియా 1–0 గోల్ తేడాతో గెలిచింది. 39వ నిమిషంలో జెఫర్సన్ లెర్మా సాలిస్ గోల్ చేసి కొలంబియాకు ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత కొలంబియా ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని విజయాన్ని ఖరారు చేసుకుంది. తొలి అర్ధభాగం చివర్లో కొలంబియా ప్లేయర్ మునోజ్ రెడ్ కార్డుకు గురై మైదానం వీడాడు. దాంతో రెండో అర్ధభాగం మొత్తం కొలంబియా పది మంది ఆటగాళ్లతోనే ఆడాల్సి వచ్చింది. మ్యాచ్ మొత్తంలో ఉరుగ్వే 62 శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకున్నా కొలంబియా రక్షణ శ్రేణిని ఛేదించి గోల్ చేయడంలో విఫలమైంది. భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం జరిగే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనాతో కొలంబియా ఆడుతుంది. 1975లో తొలిసారి ఈ టోర్నీలో ఫైనల్ చేరిన కొలంబియా రన్నరప్‌గా నిలువగా ... 2001లో రెండోసారి ఫైనల్ ఆడి తొలి టైటిల్ సొంతం చేసుకుంది.



వాట్కిన్స్

ఇంగ్లండ్ ఫినిషింగ్ టచ్

సబ్‌స్టిట్యూట్ వాట్కిన్స్ గెలుపు గోల్

సెమీస్‌లో నెదర్లాండ్స్‌పై విజయంతో వరుసగా రెండోసారి 'యూరో' ఫైనల్లోకి ఇంగ్లండ్

డార్ట్‌మండ్: అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో 58 ఏళ్ల టైటిల్ నిరీక్షణకు తెర దించేందుకు ఇంగ్లండ్ జట్టుకు మరో అవకాశం లభించింది. ప్రతిష్టాత్మక 'యూరో' టోర్నీలో ఇంగ్లండ్ వరుసగా రెండోసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. నెదర్లాండ్స్‌తో గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో ఇంగ్లండ్ 2–1 గోల్స్ తేడాతో గెలిచింది. ఇంగ్లండ్ తరఫున కెప్టెన్ హ్యారీ కేన్ (18వ ని.లో), ఓలీ వాట్కిన్స్ (90+1వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... నెదర్లాండ్స్ జట్టుకు సిమోన్స్ (7వ ని.లో) ఏకైక గోల్ అందించాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి తర్వాత జరిగే ఫైనల్లో స్పెయిన్‌తో ఇంగ్లండ్ తలపడుతుంది. 1966లో ఏకైక ప్రపంచకప్ టైటిల్ నెగ్గిన ఇంగ్లండ్ ఆ తర్వాత అంతర్జాతీయ వేదికపై మరో టైటిల్ గెలవలేకపోయింది. 2020 యూరో టోర్నీలో ఇంగ్లండ్ ఫైనల్‌కు చేరినా ఇటలీ జట్టు చేతిలో ఓడిపోయి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. నెదర్లాండ్స్‌తో సెమీఫైనల్ మ్యాచ్ అదనపు సమయానికి దారి తీయడం ఖాయమనిపించిన దశలో... స్టాపేజ్ ఇంజ్యూరీ టైమ్‌లో (90+1వ నిమిషంలో) సబ్‌స్టిట్యూట్ ఓలీ వాట్కిన్స్ గోల్ సాధించి ఇంగ్లండ్‌ను 2–1తో ఆధిక్యంలో నిలిపాడు. ఆ తర్వాత మరో మూడు నిమిషాలు నెదర్లాండ్స్‌ను నిలువరించిన ఇంగ్లండ్ విజయాన్ని ఖరారు చేసుకుంది. నిర్ణీత సమయంలో పలు కారణాలతో రిఫరీ ఆటను నిలిపివేయాల్సి వచ్చినపుడు అలా వృథా అయిన సమయాన్ని 90 నిమిషాల తర్వాత స్టాపేజ్ ఇంజ్యూరీ టైమ్‌గా జత చేస్తారు. ఇంగ్లండ్, నెదర్లాండ్స్ మ్యాచ్‌కు అదనంగా నాలుగు నిమిషాలు జోడించారు. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ హెడ్ కోచ్ గ్యారెత్ సౌత్‌గేట్ తీసుకున్న సమయోచిత నిర్ణయం విజయవంతమైంది. తొలి గోల్ చేసిన ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ కేన్‌ను 81వ నిమిషంలో వెనక్కి రప్పించి అతని స్థానంలో సబ్‌స్టిట్యూట్‌గా ఓలీ వాట్కిన్స్‌ను... మిడ్‌ఫీల్డర్ ఫిల్ ఫోడెన్ స్థానంలో కోల్ పాల్మెర్‌ను సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి పంపించారు. పది నిమిషాల తర్వాత సౌత్‌గేట్ నిర్ణయం సరైనదేనని తేలింది. సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన పాల్మెర్, వాట్కిన్స్ అద్భుత సమన్వయంతో రెండో గోల్ సాధించి పెట్టారు. కుడి వైపు నుంచి పాల్మెర్ అందించిన పాస్‌ను 'డి' ఏరియాలో వాట్కిన్స్ అందుకొని కళ్లు చెదిరే కిక్‌తో నెదర్లాండ్స్ గోల్‌కీపర్‌ను బోల్తా కొట్టించి బంతిని లక్ష్యానికి చేర్చడంతో ఇంగ్లండ్ శిబిరం సంబరాలు చేసుకుంది.



వాట్కిన్స్‌తో హ్యారీ కేన్ సంబరం

మహిళా కమిషన్‌కూ వేధింపులు

చైర్‌పర్సన్, సభ్యులకు వేతనాలు నిలిపివేత

- టీఏ, డీఏలు, ఆఫీస్ నిర్వహణ ఖర్చులూ ఇవ్వకుండా ఇబ్బందులు
- వేతనాలు అడిగితే రాజీనామా చేసి వెళ్లిపోవాలని అధికారులతో సలహాలు
- మిమ్మల్ని ఉండనివ్వరంటూ ఓ అధికారి బెదిరింపు
- కమిషన్ ఆదేశాలను పట్టించుకోని అధికారులు
- గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి
- మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శికీ ఫిర్యాదు
- న్యాయ పోరాటానికీ సిద్ధమని వెల్లడి


గజ్జల వెంకటలక్ష్మి

సాక్షి, అమరావతి: రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై కూటమి ప్రభుత్వం కక్షకట్టింది. గత ప్రభుత్వ హయాంలో రాజ్యాంగబద్ధంగా నియమితులైన పలు కమిషన్ల చైర్‌పర్సన్లు, సభ్యులను వేధింపులకు గురి చేస్తోంది. వారికి వేతనాలు, టీఏ, డీఏలు నిలిపివేసింది. కనీసం కార్యాలయ నిర్వహణ ఖర్చులూ ఇవ్వడంలేదు. వేతనాలు, టీఏ, డీఏ, నిర్వహణ ఖర్చులు ఇవ్వాలని కోరితే రాజీనామా చేసి వెళ్లిపోవడం మంచిదని, లేదంటే ఇబ్బందులు తప్పవంటూ అధికారులతో చెప్పిస్తోంది. చివరకు మహిళలకు రక్షణగా నిలిచే మహిళా కమిషన్‌ను సైతం ఇదే విధంగా కక్షపూరితంగా వేధిస్తోంది. దీంతో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాష్ట్ర గవర్నర్‌కు, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శికీ ఫిర్యాదు చేశారు. చైర్‌పర్సన్లు, సభ్యులు రాజీనామా చేసి వెళ్లిపోతే, ఆ స్థానాల్లో తమ వారికి పదవులు కట్టబెట్టేందుకే చంద్రబాబు ప్రభుత్వం ఈ కుయుక్తులకు పాల్పడుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి పదవీకాలం 2026 మార్చి వరకు ఉంది. అయితే, గత నాలుగు నెలల వేతన బకాయిలను కోరినా ప్రభుత్వం చెల్లించడంలేదు. సభ్యులకు ఒక నెల వేతనాన్ని నిలిపివేసింది. ఇటీవల మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయి. కమిషన్ చైర్‌పర్సన్, సభ్యులు విశాఖపట్నం, నర్సీపట్నం, నెల్లూరు, చిత్తూరు తదితర ప్రాంతాల్లో పర్యటించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచేలా చర్యలు చేట్టారు. ఈ పర్యటనల టీఏ, డీఏలు విడుదల చేయకుండా ప్రభుత్వం కక్ష సాధిస్తోంది. మంగళగిరిలోని రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయానికి నిర్వహణ ఖర్చులూ నిలిపివేసింది. దీంతో ఆఫీస్ నిర్వహణ, టీఏ, డీఏలు సైతం కమిషన్ చైర్‌పర్సన్ సొంతంగా పెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించింది. రాష్ట్రవ్యాప్తంగా దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలకు గురైన ఘటనల్లో బాధితులను ఆదుకోవలంటూ కమిషన్ ఇస్తున్న ఆదేశాలను సైతం అధికారులు, పలు జిల్లాల ఎస్పీలు బేఖాతరు చేస్తున్నారు. ఎస్పీలు కనీసం యాక్షన్ టేకెన్ రిపోర్టులు కూడా పంపించడంలేదు.

కమిషన్లకు వేతనాలు ఆపాలంటూ సీఎం ఆదేశాలు

రాష్ట్రంలో రాజ్యాంగబద్ధంగా గత ప్రభుత్వం నియమించిన అనేక కమిషన్లకు నెలవారీ ఇచ్చే గౌరవ వేతనాలను నిలిపివేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు ఇచ్చినట్టు అధికారులు చెబుతున్నారు. దీంతో రాష్ట్ర మహిళా కమిషన్, మైనార్టీ కమిషన్, ఎస్టీ కమిషన్, ఆర్టీఐ కమిషన్ వంటి వాటికి ఈ నెలలో గౌరవ వేతనాలు, టీఏ, డీఏలు ఇవ్వలేదు. ఇలా ఇబ్బందులకు గురిచేసి, రాజకీయంగా వేధించి వారు రాజీనామా చేసి వెళ్లిపోయేలా చేయాలన్నది చంద్రబాబు సర్కారు ఎత్తుగడగా తేటతెల్లమవుతోంది.

న్యాయ పోరాటం చేస్తా: గజ్జల వెంకటలక్ష్మి

నాకు, తోటి సభ్యులకు గౌరవ వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు. సభ్యులకు ఒక నెల వేతనం ఆపేశారు. నాకు 4 నెలల వేతన బకాయిలకు అర్జీ పెట్టుకున్నా చెల్లించలేదు. కనీసం టీఏ, డీఏలు, ఆఫీసు నిర్వహణ ఖర్చులు కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. గౌరవ వేతనం అడిగితే రాజీనామా చేసి వెళ్లిపోవాలని అధికారులతో ప్రభుత్వం సలహాలు ఇప్పిస్తోంది. బిల్లులు మంజూరు చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్‌ను అడిగితే మహిళా కమిషన్‌గా మిమ్మల్ని ఉండనివ్వరని, రాజీనామా చేయిస్తారంటూ బెదిరించినట్టు మాట్లాడారు. ఇదే విషయమై గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి జి.జయలక్ష్మికి ఫిర్యాదు చేశాను. వారు ఏ చర్యలు తీసుకుంటారో చూస్తాను. రాజ్యాంగ బద్ధమైన నా పదవి రెండేళ్లపాటు (2026 మార్చి వరకు) ఉంటుంది. రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై ప్రభుత్వం తీరు మారకుంటే న్యాయ పోరాటానికి సిద్ధం.

కౌలుదారులందరికీ

కార్డులివ్వాలి

రూ.20 వేల పెట్టుబడి సాయం చేయాలి

వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నకు ఏపీ కౌలు రైతు సంఘం వినతి


కౌలు రైతు సమస్యలను మంత్రి అచ్చెన్నకు వివరిస్తున్న రైతు సంఘం నేతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నూటికి 80 శాతం కౌలుదారులున్నారని, వాందరినీ గుర్తిస్తూ ప్రభుత్వం కౌలు కార్డులివ్వాలని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలపై గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. పంటల నమోదులో కౌలురైతుల పేర్లతోనే నమోదు చేయాలన్నారు. భూమి లేని ఓసీ రైతులతో సహా కౌలుదారులందరికీ రూ.20వేల పెట్టుబడి సాయం అందించాలని కోరారు. కౌలురైతులకు పంట రుణాలు, పంట నష్టపరిహారం, పంటల బీమా తదితర సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అయితే 2019లో తీసుకొచ్చిన పంట సాగుదారుల హక్కు చట్టంలో భూ యజమాని విధిగా కౌలు ఒప్పంద పత్రంపై సంతకం చేయాలని లేదా వీఆర్వోకు ఫోన్ చేసి తన అంగీకారాన్ని తెలియజేయాల్సి ఉంటుందన్నారు. మెజార్టీ భూ యజమానులు అంగీకార పత్రంపై సంతకాలు చేయకపోవడం వలన కౌలు దారులు కౌలుకార్డులు పొందలేక, పంట రుణాలతో పాటు ప్రభుత్వ రాయితీలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన 2011లో తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ భూ అధీకృత రైతుల చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ చట్టం ప్రకారం భూ యజమానుల అంగీకారంతో సంబంధం లేకుండా ప్రభుత్వమే కౌలురైతులను గుర్తించి, గ్రామసభల్లో కౌలుకార్డులు ఇచ్చేదని గుర్తు చేశారు. భూ యజమానులు ఏమైనా అభ్యంతరాలు లేవనెత్తితే వాటిని అధికారులే పరిష్కరించేవారన్నారు. గ్రామాల వారీగా కౌలు రైతుల జాబితాలను బ్యాంకులకు పంపి పంట రుణాలు, ప్రభుత్వ రాయితీలు అందించేవారని గుర్తు చేశారు.

క్లుప్తంగా...

జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ పొడిగింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ (డబ్ల్యూజేహెచ్‌ఎస్)ను 2024–25 సంవత్సరానికి పొడిగిస్తూ ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జర్నలిస్టులు, వారి కుటుంబాల ఆరోగ్యం పట్ల తమ ప్రభుత్వం సానుకూలంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ప్రజావసరాలకు తగ్గట్టు విద్యుత్ ఉత్పత్తి పెంచండి

మంత్రి గొట్టిపాటి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజల అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్ ఉత్పత్తిని పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్‌పై గురువారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. గతంలో సీఎం చంద్రబాబు సోలార్ పార్కులను ఏర్పాటు చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ విజయానంద్, ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ ఎండీ ఎం.కమలాకర్ బా బు, ఇంధనశాఖ జేఎస్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఆర్టీసీ ఈయూ ఆవిర్భావ దినోత్సవం

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) 73వ ఆవిర్భావ దినోత్సవం విజయవాడలో గురువారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.దామోదరరావు, జీవీ నరసయ్య కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు మాట్లాడుతూ 1959 నుంచి ఇప్పటివరకు 15 సార్లు పీఆర్సీలు అమలు చేస్తే వాటిలో తొమ్మిది పీఆర్సీలను ఎంప్లాయీస్ యూనియనే సాధించిందన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు రామచంద్రరావు, ఎం. శంకరరావు, టీవీ భావన, మొహిద్దీన్, నారాయణ పాల్గొన్నారు.

ఏఐఎస్ అధికారులకు పరీక్షల షెడ్యూల్ విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పనిచేస్తున్న అఖిల భారత సర్వీసు అధికారులకు సెప్టెంబర్–2024 అర్ధవార్షిక పరీక్షలకు ఏపీపీఎస్సీ షెడ్యూల్ విడుదల చేసింది. భాషా పరీక్షతో పాటు ఇతర పరీక్షలు సెప్టెంబర్ 10 నుంచి 13వ తేదీ వరకు జరుగుతాయని సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 11వ తేదీ వరకు దరఖాస్తు స్వీకరిస్తామని, పూర్తి వివరాలకు https://psc.ap.gov.inలో వెబ్‌సైట్‌లో చూడవచ్చని పేర్కొన్నారు.

'ఆలస్యంగా వస్తే చర్యలు'

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆలస్యంగా విధులకు హాజరైన ఫ్యాకల్టీలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఆదేశించారు. ఈ చర్యలకు సంబంధించిన వివరాలను ప్రిన్సిపాల్స్ సోమవారంలోగా డీఎంఈ కార్యాలయానికి సమర్పించాల్సి ఉంది. బుధవారం వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్‌లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

జనాభా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం మూడేళ్ల అంతరం తల్లీబిడ్డల శ్రేయస్సుకు మంచిదని కృష్ణబాబు అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం ప్రచార పోస్టర్‌లను మంగళగిరిలో గురువారం ఆయన ఆవిష్కరించారు. గర్భధారణ, ప్రసవానంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

స్టీల్ ప్లాంట్‌కు అన్ని విధాలా సహకారం

- కేంద్ర భారీ, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి
- విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని పలు విభాగాలను సందర్శించిన కేంద్ర మంత్రి
- ప్లాంట్ సీఎండీ, డైరెక్టర్లు, సీనియర్ అధికారులతో సమీక్ష


స్టీల్‌ప్లాంట్ మోడల్ రూమ్ పరిశీలిస్తున్న మంత్రులు, అధికారులు

ఉక్కునగరం: విశాఖ స్టీల్ ప్లాంట్‌కు అన్ని విధాలా సహకరిస్తామని కేంద్ర భారీ, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసశర్మ తదితరులతో కలిసి గురువారం ఆయన స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాలను సందర్శించారు. మొదట ఈడీ(బిల్డింగ్)లోని మోడల్ రూమ్‌ను సందర్శించారు. అక్కడ సీఎండీ అతుల్ భట్ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రక్రియ, ముడి పదార్థాల సరఫరా, ఉత్పత్తుల రవాణా తదితర అంశాలను వివరించారు. అక్కడే ఉన్న అవార్డు గ్యాలరీకి వెళ్లి స్టీల్‌ప్లాంట్ సాధించిన అవార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన కోక్ ఓవెన్స్, బ్లాస్ట్‌ఫర్నేస్–3, ఎస్ఎంఎస్–2, వైర్ రాడ్ మిల్–2 విభాగాలను సందర్శించారు. అనంతరం ఉక్కు పరిపాలన భవనంలో సీఎండీ, డైరెక్టర్లు, సీనియర్ అధికారులతో స్టీల్‌ప్లాంట్ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ప్లాంట్‌కు సాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర ఉక్కు సంయుక్త కార్యదర్శి సంజయ్ రాయ్, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, సెయిల్ డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు

ఆయన సందర్శన పుస్తకంలో ఇలా రాశారు 'ఈ స్టీల్ ప్లాంట్ సందర్శించాక దేశ ఆర్థిక అభివృద్ధికి ఈ ప్లాంట్ సహాయపడుతుందని నాకు అర్థమైంది. అనేక కుటుంబాలు వారి రోజువారీ అవసరాలు, జీవనోపాధి కోసం ఈ ప్లాంట్‌పైన ఆధారపడి ఉన్నారు. ఈ ప్లాంట్‌ను రక్షించడం నా బాధ్యత. ప్లాంట్ మూతపడుతుందని ఎవరూ ఆందోళన చెందొద్దు.. ప్రధాని ఆశీస్సులు, సాయంతో ప్లాంట్ నూరు శాతం సామర్థ్యంతో ఉత్పత్తి చేస్తుంది' అని రాశారు.

ప్రధానితో చర్చించాకే నిర్ణయం

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో చర్చించాక నిర్ణయం తీసుకుంటామని మంత్రి హెచ్‌డీ కుమారస్వామి చెప్పారు. ఇందుకు తమకు రెండు నెలలు వ్యవధి అవసరమన్నారు. అయితే ప్రైవేటీకరణ రద్దుపై కుమారస్వామి పూర్తి భరోసా ఇవ్వకపోవడంతో కార్మిక సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

రైతులపై విద్యుత్ భారం మోపితే ప్రతిఘటిస్తాం


- వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ చారిత్రక అవసరం
- మీటర్ల బిగింపుపై పూటకో మాట మాట్లాడడం సరికాదు
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం హెచ్చరిక

సాక్షి, అమరావతి: వ్యవసాయానికి ఉచిత విద్యుత్ చారిత్రక అవసరమని, దానిని కొనసాగించకుండా రాష్ట్ర ప్రభుత్వం డొంక తిరుగుడుగా రైతులపై విద్యుత్ భారం మోపితే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రతిఘటిస్తుందని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి. కృష్ణయ్య, కె. ప్రభాకరరెడ్డి హెచ్చరించారు. వ్యవసాయ రంగంలో విద్యుత్ మోటార్లకు మీటర్ల బిగింపు అంశంపై ఎన్నికల్లో ఓ మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడడం సరికాదని గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా మంత్రి నారా లోకేశ్ వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని పిలుపు ఇచ్చారని.. అలాగే, అదే పార్టీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అయితే స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా స్వయంగా తాను హైకోర్టులో కేసు వేశానని ప్రకటించారని వారు గుర్తుచేశారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ మోటార్లకు మీటర్ల బిగింపుపై దాటవేసే వైఖరిని ప్రదర్శించడం విస్మయానికి గురిచేస్తోందని.. విద్యుత్ రంగంపై శ్వేత పత్రం విడుదల సందర్భంగా వ్యవసాయ రంగంలో విద్యుత్ మోటార్లకు మీటర్ల అంశంపై సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. సోలార్ ప్యానళ్ల ద్వారా రైతులకు ప్రయోజనం కలిగేలా చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించే జీఓ నెంబర్ 22 రద్దుచేసి, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలన్నది తమ డిమాండ్ అన్నారు. ఇక రాష్ట్ర ప్రజలపై రూ.17వేల కోట్ల ట్రూఅప్ చార్జీల రికవరీ భారాన్ని ఇప్పటికైనా రద్దుచేయాలని వారు కోరారు. రైతులు, విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాలకు అనుగుణంగా విద్యుత్ రంగంలో విధానాలను రూపొందించాలన్నారు.

వివరణ ఇవ్వండి

వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం కూల్చివేతపై స్పందించిన హైకోర్టు

- సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కు నోటీసులు
- వారిపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలన్న వైఎస్సార్‌సీపీ



సాక్షి, అమరావతి: కోర్టు ఆదేశాలకు విరుద్ధంగా తమ పార్టీ కేంద్ర కార్యాలయ భవనం కూల్చివేతకు పాల్పడిన అధికారులపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలంటూ వైఎస్సార్‌సీపీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు స్పందించింది. కూల్చివేతలకు బాధ్యులైన సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌లకు వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 8వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మాణంలో ఉన్న వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయాన్ని కూల్చివేసేందుకు మున్సిపల్ కమిషనర్ జారీ చేసిన ప్రాథమిక ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ.. చట్ట ప్రకారం నడుచుకుంటామని కోర్టుకు హామీ ఇచ్చారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. వైఎస్సార్‌సీపీ భవనం కూల్చివేత విషయంలో తదుపరి చర్యలు చేపట్టే ముందు చట్టప్రకారం నడుచుకోవాలని సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మున్సిపల్ కమిషనర్ నిర్మల్ కుమార్‌లను ఆదేశిస్తూ గత నెల 21న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలను వైఎస్సార్‌సీపీ తరఫు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి లిఖితపూర్వకంగా సీఆర్‌డీఏ కమిషనర్, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. కానీ కోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆ మరుసటి రోజు తెల్లవారుజామున వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయాన్ని కూల్చివేశారు. దీంతో సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్, మునిసిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్‌లపై కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు శేషగిరిరావు పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా.. పిటిషనర్ తరఫు న్యాయవాది నన్నపనేని శ్రీహరి అధికారుల వ్యవహార్శైలిని.. కోర్టు ధిక్కారాన్ని న్యాయమూర్తికి వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి ప్రతివాదులుగా ఉన్న అధికారులిద్దరికీ నోటీసులు జారీ చేశారు.

తొందరపాటు చర్యలొద్దు

- వైఎస్సార్‌సీపీ నేతల విషయంలో పోలీసులకు హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ 16వ తేదీకి వాయిదా

సాక్షి, అమరావతి: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించి పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత దేవినేని అవినాష్‌కు హైకోర్టు ఊరటనిచ్చింది. తదుపరి విచారణ వరకు వారిపై ఎలాంటి తొందరపాటు.. కఠిన చర్యలేవీ తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 16వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనకు సంబంధించి పలువురు వైఎస్సార్‌సీపీ నేతలపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కొందరిని అరెస్ట్ కూడా చేశారు. ఈ నేపథ్యంలో తమకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ లేళ్ల అప్పిరెడ్డి, రఘురాం, సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. గురువారం ఈ వ్యాజ్యాలపై జస్టిస్ కృపాసాగర్ విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించేందుకు సిద్ధమవ్వగా.. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతి స్పందిస్తూ.. పోలీసుల తరఫున అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తారని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు ఒకేసారి వింటానని న్యాయమూర్తి స్పష్టం చేశారు. పొన్నవోలు జోక్యం చేసుకుంటూ.. అలా అయితే అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ.. పిటిషనర్లకు తదుపరి విచారణ వరకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తామని స్పష్టం చేశారు. తదుపరి విచారణ వరకు పిటిషనర్ల విషయంలో ఎలాంటి తొందరపాటు, కఠిన చర్యలేవీ తీసుకోవద్దని పోలీసులను ఆదేశించారు. కాగా, గతంలో చంద్రబాబు ఇంటి వద్ద జరిగిన గొడవకు సంబంధించి నమోదైన కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ విషయంలో కూడా తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను న్యాయమూర్తి ఆదేశించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

చురుగ్గా ఎన్నికల ప్రచారం



ఓట్లను అభ్యర్థిస్తున్న పంచాక్షరప్ప ప్యానల్

బళ్లారిఅర్బన్: అఖిల భారత వీరశైవ మహాసభ జిల్లా శాఖ ఐదేళ్ల అవధికి 30 మంది కార్యనిర్వాహక సభ్యులు, 10 మంది మహిళా సభ్యులతో పాటు ఓ అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా త్రివిధ దాసోహి సిద్ధ గంగా స్వామి బృందం పంచాక్షరప్ప అధ్యక్ష పదవికి, కార్యనిర్వాహక సభ్యత్వానికి సంబంధించి శుక్రవారం జోరుగా ప్రచారం చేశారు. నగరంలోని పలువురు వీరశైవ ప్రముఖులను కలిసి తమ బృందాన్ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తమను గెలిపిస్తే చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించినట్లు జిల్లా కార్యనిర్వాహక కమిటీ సభ్యత్వ స్థాన అభ్యర్థిని ఛాయా మంజునాథ్ ఓ ప్రకటనలో తెలిపారు.

మహిళలపై దౌర్జన్యం తగదు



ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: పశ్చిమ బెంగాల్‌లో మహిళలపై నిరంతరంగా దౌర్జన్యాలు జరుగుతున్నాయని, వాటి నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఎస్‌డీపీఐ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో జిల్లా సంచాలకుడు తాజుద్దీన్ మాట్లాడారు. ఆ రాష్ట్రంలోని చోప్రాలో మహిళలపై అత్యాచార ఘటనలతో శాంతి భద్రతలు సన్నగిల్లాయన్నారు. ఈ విషయంలో సీఎం జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని రాష్ట్రపతికి జిల్లాధికారి ద్వారా విన్నవించారు.

నియామకం



అయేషా ఖానం

రాయచూరు రూరల్: కర్ణాటక మీడియా అకాడమి అధ్యక్షురాలిగా పాత్రికేయురాలు అయేషా ఖానంను రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య సలహాదారుడు ప్రభాకర్ నియమించారు. ఆమె కళ్యాణ కర్ణాటక విభాగంలోని కలబుర్గి పాత్రికేయురాలుగా పని చేశారు. సభ్యులుగా బెంగళూరు వెంకటపతి, కొప్పళ జిల్లా గంగావతి నింగజ్జ, చిత్రదుర్గ అహోబళపతిలను నియమించారు


ఆక్రమణలు తొలగించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: నగరంలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా భూ ఆక్రమణదారులు వేసుకున్న గుడిసెలను తొలగించాలని కరవే డిమాండ్ చేసింది. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో అధ్యక్షుడు జిలాని మాట్లాడారు. పాత ఆశ్రయ కాలనీలోని సర్వే నంబర్– 581లో ఏడేళ్ల కిందట వాజపేయి ఆవాస్ యోజన కింద పేదలకు, మురికి వాడల వాసులకు మంజూరు కాగా నేడు భూఆక్రమణదారులు ఆక్రమించి గుడిసెలు వేసుకున్నారని, వాటిపై విచారణ జరిపి తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.


గురుకుల పాఠశాలల్లో పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే కరెమ్మ నాయక్

రాయచూరు రూరల్: ప్రభుత్వ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి నూతన జిల్లాధికారి నితీష్, దేవదుర్గ ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ భోజనం ఆరగించారు. గురువారం నగరంలోని మాస్‌దొడ్డి రహదారిలోని మొరార్జి దేశాయి వసతి పాఠశాలలో జిల్లాధికారి, దేవదుర్గ తాలూకాలోని గణేకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే కరెమ్మ నాయక్ భోజనం చేశారు.

ఎడమ కాలువకు గేజ్ అమర్చాలి



జిల్లాధికారితో మాట్లాడుతున్న రైతులు

రాయచూరు రూరల్: తుంగభద్ర ఎడమ కాలువ ఆయకట్టు చివరి భూములకు సక్రమంగా నీరందాలంటే గేజ్‌ను అమర్చాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లాధికారి కార్యాలయం వద్ద కార్యకర్తల నిరసనలో సంచాలకుడు బసనగౌడ మాట్లాడారు. 69వ మైల్ వద్ద నీటి నిర్వహణ గేజ్‌ను అమర్చాలని జిల్లాధికారికి వివరించి వినతిపత్రం సమర్పించారు.

జోరందుకున్న అభివృద్ధి పనులు

- రోడ్ల వెడల్పు ప్రక్రియతో నేలకూలిన పచ్చని చెట్లు
- రాయల్ నుంచి సంగం సర్కిల్ వరకు రూ.6 కోట్ల వ్యయం
- శబరి హోటల్ నుంచి కేఈబీ సర్కిల్ వరకు రూ.8 కోట్ల ఖర్చు



రాయల్ నుంచి సంగం సర్కిల్ వరకు చేపట్టిన రోడ్డు వెడల్పు పనులు చురుగ్గా సాగుతున్న దృశ్యం

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదు గ్యారెంటీలతో సంక్షేమ పథకాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడంతో అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపులు జరగడం లేదు. ఏడాదిగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా అభివృద్ధి పనులు మూడు అడుగులు ముందుకు, ఆరు అడుగులు వెనక్కు అన్న చందంగా మారాయి. దీంతో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రోడ్డు వెడల్పు పనులతో పాటు ప్రధానంగా రాయల్ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తున్న టవర్ క్లాక్ పనులు స్తబ్దుగా జరుగుతూ ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి కృషితో నగరంలో అభివృద్ధి పనులు ఊపందుకుంటున్నాయి. టవర్‌క్లాక్ అభివృద్ధి పనులకు దాదాపు రూ.7 కోట్ల వ్యయం, రాయల్ సర్కిల్ నుంచి సంగం సర్కిల్ వరకు రోడ్డు వెడల్పు పనులతో పాటు తారు రోడ్డు పనులకు రూ.6 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

వాహన రాకపోకల మళ్లింపు

గత 10 రోజుల నుంచి రోడ్డు వెడల్పు, తారు రోడ్డు పనులు జోరుగా జరుగుతుండటంతో అటు, ఇటు రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు. జిల్లాకు అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి వచ్చే వాహనాలు నేరుగా రాయల్ సర్కిల్‌కు వెళ్లే రహదారిని మూసి వేసి అభివృద్ధి పనులు చేసేందుకు ట్రాఫిక్‌ను పూర్తిగా పక్కకు మళ్లించారు. అటు వైపున రాయల్ సర్కిల్‌లో ఆర్‌టీహెచ్ హోటల్ వద్ద వాహనాల రాకపోకలకు అడ్డుకట్ట వేశారు. మధ్యలో రోడ్డు వెడల్పు, తారు రోడ్డు పనులు జరుగుతుండటంతో రోడ్డు పనులు పూర్తి చేసే వరకు నగరంలో పలు రోడ్లలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారనుంది. ఈ రోడ్డు పనులతో పాటు ఇది వరకే సంగం సర్కిల్ నుంచి అనంతపురం రోడ్డు వరకు దాదాపు రూ.18 కోట్లతో చేపట్టిన తారు రోడ్డు పనులు పూర్తి చేయడంతో రోడ్డు సర్వాంగ సుందరంగా కనిపిస్తోంది. మొత్తం మీద నగరంలో ఇటీవల రోడ్డు వెడల్పు, తారు రోడ్డు పనులు జోరుగా సాగుతుండటం నగరాభివృద్ధికి దోహదం చేస్తుందని చెప్పవచ్చు.

మోకా రోడ్డులో ఆక్రమణల తొలగింపు

ముఖ్యంగా సత్యనారాయణ పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద శబరి హోటల్ నుంచి కేఈబీ సర్కిల్ వరకు దాదాపు ఒకటిన్నర కిలోమీటరు పొడవున రోడ్డు వెడల్పుతో పాటు తారు రోడ్డు పనులకు సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో దాదాపు రూ.8 కోట్లు వ్యయం చేస్తున్నారు. 10 రోజుల క్రితం రోడ్డు వెడల్పు పనుల పేరుతో రోడ్డుకు ఇరు వైపుల ఉన్న భవనాల్లో రోడ్డుకు ఆనుకుని ఉన్న ఆక్రమణలను కూల్చివేశారు. దీనిపై స్థానికుల నుంచి కొంత వ్యతిరేకత కూడా వ్యక్తమైంది. ప్రస్తుతం రెండు రోజుల నుంచి ఈ రోడ్డులో ఉన్న పెద్ద పెద్ద చెట్లను కూడా నరికివేశారు. ఈ రోడ్డులో పచ్చదనంతో అలరారుతున్న చెట్లను నేలకూల్చడంపై పర్యావరణ ప్రేమికులు విమర్శిస్తున్నారు. గతంలో ఇదే సిటీ కార్పొరేషన్ వారు చెట్లను నాటారని, ప్రస్తుతం వారే కూల్చుతున్నారని, ముందు చూపు లేకుండా రోడ్లలో ఎందుకు చెట్లను నాటాలి, ఎందుకు కూల్చాలని నగరవాసులు విమర్శిస్తున్నారు.



మోకా రోడ్డులో అభివృద్ధి పనులతో నేలమట్టమైన పచ్చని చెట్లు



కూల్చిన చెట్ల కొమ్మలను ముక్కలుగా నరికి ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే పీఏ ఇంటిపై ఈడీ దాడి

రాయచూరు రూరల్: రాష్ట్రంలో మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలిలో జరిగిన రూ.187 కోట్ల అవినీతిపై విచారణలో భాగంగా గురువారం నగరంలో మండలి అధ్యక్షుడు, గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ఆప్త సహాయకుడు పంపణ్ణకు చెందిన నగరంలోని ఆశాపూర్ రోడ్డులోని ఇంటిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు గురువారం సోదా చేశారు. అలాగే గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ అల్లుడు చెన్నబసవను కూడా అధికారులు విచారణ జరిపారు.

ఈడీ అధికారుల ప్రశ్నలకు షాక్

అవినీతి అంశంపై విచారణలో ఈడీ అధికారులు వేసిన ప్రశ్నలకు మండలి అధ్యక్షుడు, గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ ఆప్త సహాయకుడు పంపణ్ణ నీళ్లు నమిలారు. గురువారం నగరంలోని ఆశాపూర్ రోడ్డులోని ఇంటిలో అధికారులు సోదా చేశారు. రెండో రోజు కూడా శాఖాధికారులు ఎమ్మెల్యే ఇంటికి పంపణ్ణను పిలిపించుకొని ప్రశ్నించారు. ఉపాధ్యాయ వృత్తిని వదిలి బిచ్చాలి గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహించారు. తాలూకా పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఆప్త సహాయకుడిగా ఎమ్మెల్యే బసనగౌడ వద్దకు చేరారు.

బైక్ చోరీపై కేసు నమోదు

హుబ్లీ: హావేరిలోని ప్రైవేట్ హోటల్ వద్ద నిలిపిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన చోటు చేసుకుంది. హానగల్ తాలూకా దేవరహొసపేట గ్రామానికి చెందిన సిద్ధలింగేశ్వర మహారాజపేటె అనే వ్యక్తికి చెందిన హీరోహోండా బైక్ చోరీకి గురైంది. ఈ ఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు హావేరి టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వారేమైనా నిజాయితీపరులా?

- విచారణ ముగిసే వరకు ఓపిక పట్టలేరా!
- విద్యుత్ శాఖ మంత్రి జార్జ్ మండిపాటు



మాట్లాడుతున్న మంత్రి జార్జ్

సాక్షి,బళ్లారి: వాల్మీకి అభివృద్ధి మండలిలో అవినీతిపై సిట్ అధికారులతో దర్యాప్తు చేయిస్తున్నామని, విచారణ ముగిసేవరకు బీజేపీ నాయకులు ఓపిక పట్టాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి కే.జే జార్జ్ పేర్కొన్నారు. ఆయన గురువారం జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. మండలిలో జరిగిన అక్రమాలపై దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తున్న బీజేపీ నాయకులు ఎంతో మంది అవినీతి, అక్రమాలతో జైలుకు పోయి వచ్చారని, బెయిల్‌తో బయట రాజకీయాలు చేస్తున్నారని, వారేమైనా నిజాయితీపరులా అని ప్రశ్నించారు. బీజేపీ నేతల అక్రమాల పుట్ట దేశానికి తెలుసన్నారు. తమ పార్టీ నేతలు ఎలాంటి తప్పు చేయకపోయినా రాజకీయలబ్ధి కోసం ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. విచారణ పూర్తయిన తర్వాత వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. మాజీ మంత్రి నాగేంద్ర పాత్ర లేకపోయినా బీజేపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమంగా నగదు బదిలీకి సంబంధించి సిట్ బృందం సమగ్రంగా దర్యాప్తు చేస్తోందన్నారు. ఈడీ అధికారుల బృందం తనిఖీ చేయాల్సిన అవసరం లేదన్నారు. అయినా ప్రభుత్వం ఇందులో జోక్యం చేసుకోబోదన్నారు.

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు

ఈడీ, సిట్ దర్యాప్తు బృందాలు ఎలా తనిఖీ చేసినా ఎవరు తప్పు చేసి ఉంటే వారికి శిక్షపడుతుందన్నారు. సిట్‌కు మాజీ మంత్రి నాగేంద్ర సహకరించడం లేదన్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. అధికారులు ఎవరి పని వారు చేసుకు పోతారన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలని పగటి కలలు కంటోందన్నారు. తమకు జనం పూర్తి మెజార్టీ ఇచ్చారని, వారి ఆటలు సాగబోవన్నారు. సీఎం, డీసీఎం రాష్ట్ర ప్రజలు మెచ్చే విధంగా పాలన సాగిస్తున్నారన్నారు. బీజేపీ నాయకుల ఎత్తులు, జిత్తులు పని చేయబోవన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండటంతో మండలి అక్రమాలపై సీబీఐకి దర్యాప్తు అప్పగించాలని రాజకీయం చేశారని మండిపడ్డారు. ముడా అవినీతి ఎవరి హయాంలో జరిగిందో ప్రజలకు తెలుసన్నారు. బీజేపీ అధికారంలో ఉన్నప్పుడే ముడాలో ఎన్నో అవినీతి, అక్రమాలు జరిగాయన్నారు. నూరు అబద్ధాలు పదే పదే చెప్పి నిజం చేయాలని చూస్తున్నారని, ఇదే బీజేపీ సిద్ధాంతం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాటిళ్లలో నాసిరకం మద్యం.. అధిక ధరకు విక్రయం

- గుట్టురట్టు చేసిన కలఘటిగి పోలీసులు
- రూ.32 లక్షల విలువ చేసే సరుకు సీజ్
- అక్రమ నిల్వ కేసులో నలుగురు అరెస్ట్

హుబ్లీ: నాసిరకం మద్యాన్ని బాటిళ్లలో నింపి ఎక్కువ ధరకు విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా గోడౌన్లలో నిల్వ ఉంచిన సరుకుపై కలఘటిగి పోలీసులు దాడి చేసి రూ.32 లక్షల విలువ చేసే అక్రమ సారాయిని స్వాధీనం చేసుకున్నారు. కలఘటిగి తాలూకాలోని మిస్త్రికోటి క్రాస్ వద్ద గోడౌన్‌లో అక్రమంగా మద్యాన్ని నింపుతున్న వైనంపై విశ్వసనీయ సమాచారం మేరకు ధార్వాడ జిల్లా ఎస్పీ గోపాల్ బ్యాకోడ్ మార్గదర్శకత్వంలో ఏఎస్పీ నారాయణ బరమని, ధార్వాడ గ్రామీణ ఉపవిభాగం డీఎస్పీ ఎస్ఎం నాగరాజ్ నేతృత్వంలో కలఘటిగి సీఐ శ్రీశైల కౌజలిగి, ఎస్ఐ బసవరాజ యద్దలగుడ్డ బృందం ఈ దాడి చేసింది. కేసులో హుబ్లీ గోకుల్ రోడ్డు నివాసి వినాయక జిత్తూరి, ఆనంద్ నగర్ వినాయక సిద్ధలింగ, చెన్నపేట ఈశ్వర పవార్, రోహిత్ అరసిద్దిని అరెస్ట్ చేశారు. కాగా గోవా నుంచి తక్కువ ధరకు లిక్కర్ కొనుగోలు చేసి ఇక్కడకు తెచ్చి వేరే బాటిళ్లలో నింపి తిరిగి ప్యాక్ చేసి విక్రయించే కుట్రకు నిందితులు పాల్పడ్డారని జిల్లా ఎస్పీ గోపాల్ బ్యాకోడ్ తెలిపారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ గోవా నుంచి విస్కీని ప్రతి బాక్స్ రూ.1500 చొప్పున కొనుగోలు చేసి వాటిని అక్రమంగా ఇక్కడకు తెచ్చి వాటికి ఎసెన్స్ ద్రావకం, రంగు కలిపి కర్ణాటకలో విక్రయించేలా బాటిళ్లలో నింపుతున్నారన్నారు. ఒక్కో బాక్స్‌ను రూ.12,500 చొప్పున విక్రయించి ఎక్కువ లాభాలు పొందవచ్చని నిందితులు కుట్ర పన్నారన్నారు. కాగా కార్యాచరణలో పాల్గొన్న అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించారు.

గేమింగ్ యాప్‌లో డబ్బులు కోల్పోయి విద్యార్థి బలవన్మరణం



రాకేష్(ఫైల్)

హుబ్లీ: ఓ విద్యార్థి ఇక్కడి శిరిడి నగర డాక్టర్ అంబేడ్కర్ ప్రభుత్వ మెట్రిక్ అనంతర వృత్తివర బాలుర విద్యార్థి నిలయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం జరిగింది. విజయపుర రాకేష్ శ్రీశైల్ జంబలదిన్ని(22) ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి. రాకేష్ బుధవారం సాయంత్రం హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రాకేష్ బీవీబీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో 6వ సెమిస్టర్ చదువుతున్నాడు. జంట నగరాల పోలీస్ కమిషనర్ శశికుమార్ హాస్టల్‌కు వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అశోక్ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రాకేష్ మొబైల్ యాప్‌ల్లో గేమ్ ఆడేవాడు. అందులో డబ్బులు పోగొట్టుకున్నాడని అతడి స్నేహితులు తెలిపారు. ఈ విషయాన్ని అతడి తల్లిదండ్రులకు తెలియజేసి లోతుగా దర్యాప్తు చేపట్టినట్లు కమిషనర్ వివరించారు. ఈ నెల 8న పరీక్షలు ముగిశాయి. అతడి గదిలో ఉన్న ముగ్గురు విద్యార్థులు తమ ఊర్లకు వెళ్లిపోయారు. బుధవారం ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఫోన్ స్వీకరించలేదు. దీంతో గది తలుపులు వగులగొట్టి చూడగా రాకేష్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందని ఆ హాస్టల్ విద్యార్థి నచిన్ తెలిపారు.

భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వద్దు

హుబ్లీ: నగరంలోని సీటీఎస్ నెంబర్–13, 73, 74లలో భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వరాదంటూ విశ్వహిందూ పరిషత్ హుబ్లీ శాఖ పదాధికారులు నగర కార్పొరేషన్ మేయర్, కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. 2020లో యోజన విభాగం అనుమతి ఇచ్చింది. వీహెచ్‌పీ వ్యతిరేకించిన నేపథ్యంలో దీన్ని రద్దు చేశారు. తిరిగి మళ్లీ అదే స్థలంలో కట్టడ నిర్మాణానికి అనుమతి ఇవ్వడం క్షమించరాని నేరం అని వినతిపత్రంలో పేర్కొన్నారు. సున్నితమైన ఈ స్థలం వాణిజ్య కేంద్రంగా ఉంది. ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. అందువల్ల అనుమతి ఇవ్వరాదని కోరారు. ఒక వేళ అనుమతి ఇస్తే జరిగే విపరిణామాలకు పాలికెదే బాధ్యత అని వీహెచ్‌పీ నేతలు హెచ్చరించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ ప్రముఖులు సంజీవ పడస్కర్, రఘు, వివేకానంద, గంగాధర, చేనేత బాగలకోటి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి భార్య వేధింపులతో విద్యార్థిని ఆత్మహత్య



మృతురాలు అర్చన(ఫైల్), ఆమె రాసిన డెత్‌నోట్

హుబ్లీ: హావేరి జిల్లా హిరేకెరూరు తాలూకా దూద్దిహళ్లి గ్రామంలో మొరార్జీ రెసిడెన్సియల్ పాఠశాలలో ఓ విద్యార్థిని ఆ పాఠశాలలోని హిందీ ఉపాధ్యాయుడి భార్య వేధింపులతో విరక్తి చెంది డెత్ నోట్ రాసి పెట్టి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. మృతురాలిని 9వ తరగతి చదువుతున్న అర్చన గౌడన్నవర్‌గా గుర్తించారు. ఈ ఘటన ఈ నెల 2న జరగగా ఆ బాలిక డెత్ నోట్ వైరలైన నేపథ్యంలో ప్రస్తుతం బయటపడింది. బాలిక అదే రోజున చనిపోగా ఆమె కుటుంబ సభ్యులు అదే రోజు అంతిమ సంస్కారాన్ని నెరవేర్చారు. ఈ క్రమంలో దొరికిన ఆమె డెత్‌నోట్ ఆధారంగా ఈ స్కూల్‌లో గుసగుసలు మొదలయ్యాయి. దీంతో బాలిక కుటుంబానికి హిందీ టీచర్ రూ.1 లక్ష ఇచ్చి కేసును మూసివేసే ప్రయత్నం చేశారని తెలుస్తోంది. డెత్‌నోట్‌లో తన కుటుంబ సభ్యుల గురించి పేర్కొన్న బాలిక చివరిగా తన ఆవేదనను రాసింది.

ప్రజలకు దర్వేసి కంపెనీ కుచ్చుటోపీ



మాట్లాడుతున్న విరుపాక్షి

రాయచూరు రూరల్: నగరంలో దర్వేసి గ్రూప్ ఆఫ్ కంపెనీ రూ.500 కోట్ల మేర ప్రజలకు టోపీ వేసిందని జేడీఎస్ జిల్లాధ్యక్షుడు విరుపాక్షి ఆరోపించారు. గురువారం పాత్రికేయుల భవనంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 14 శాతం వడ్డీ చెల్లిస్తామంటూ ప్రజల నుంచి రూ.వేలల్లో, లక్షల్లో డబ్బులు వసూలు చేసుకొని రూ.500 కోట్ల మేర సొమ్ములు పోగేసుకొని కంపెనీ యజమాని మహ్మద్ హుసేన్ సుజా చాలా రోజుల నుంచి పరారయ్యాడన్నారు. అధిక వడ్డీ చెల్లిస్తామంటూ పేదలు, పోలీసులు, అధికారులు, ఉద్యోగులు, కార్మికులు తక్కువ వడ్డీకి డబ్బులు తెచ్చి అధిక వడ్డీ ఆశతో దర్వేసి కంపెనీలో పెట్టుబడి పెట్టారన్నారు. నెల రోజుల నుంచి పరారు కావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. దర్వేసి కంపెనీ యజమాని మహ్మద్ హుసేన్ సుజాపై సుమోటో కేసు నమోదు చేయాలని పోలీస్ అధికారులను ఒత్తిడి చేశారు.

ఇడపనూరు పాఠశాలకు కేంద్ర బృందం రాక



పాఠశాలను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

రాయచూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన, సౌకర్యాల పరిశీలనలో భాగంగా గురువారం తాలూకాలోని ఇడపనూరు పాఠశాలకు కేంద్రం బృందం విచ్చేసింది. బృందానికి నాయకత్వం వహించిన ఆస్తా సింగ్ తరగతి గదులను, వంటశాలను, మరుగుదొడ్లను పరిశీలించారు. బాల బాలికలతో సుదీర్ఘంగా చర్చించారు. ఈసందర్భంగా ఆమెకు అన్ని విషయాలను జిల్లా ప్రత్యేక విద్యాధికారిణి ఇందిరా వివరించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఆమెను సన్మానించారు.

జనాభా పెరుగుదలను అరికట్టాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: ప్రపంచంలో అతి ఎక్కువ జనాభా కలిగిన దేశంగా ప్రఖ్యాతి గాంచిన భారత దేశంలో జనాభా నియంత్రణ చేయాల్సిన అవసరం ఉందని జిల్లాధికారి అక్రం పాషా తెలిపారు. గురువారం తన కార్యాలయం ఆడిటోరియంలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలో 144 కోట్ల జనాభా ఉంది. చైనా దేశాన్ని వెనక్కు నెట్టి భారత దేశ జనాభా పెరుగుతోందన్నారు. దేశంలో 18–40 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన వారు అధికంగా ఉన్నారు. వీరిని క్రియాశీలురుగా, గుణాత్మక సంపన్మూల వ్యక్తులుగా చేయడానికి ఉత్తమ శిక్షణ, కౌశల్యం, పేదరిక నివారణ, వసతి, తదితర మౌలిక సౌకర్యాలను కల్పించినప్పుడే ఆర్థిక అభివృద్ధి సాధ్యం అన్నారు. జనాభాతో దుష్పరిణామాలైన పేదరికం, నిరుద్యోగం, వసతి, నీరు, విద్యుత్, అనారోగ్యంపై పాఠ్యపుస్తకాల్లో విద్యార్థులకు తెలియజేయాలన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ జగదీష్, డాక్టర్ చందన్‌కుమార్, జిల్లా కుష్టురోగ నివారణ అధికారి డాక్టర్ ఎన్‌సీ నారాయణస్వామి, జిల్లా సర్వేక్షణాధికారి డాక్టర్ చారిణి పాల్గొన్నారు.

ఫిర్యాదులపై విచారణతో 9 కేసులకు పరిష్కారం



విచారణలో సమస్యలను ఆలకిస్తున్న అధికారులు

హొసపేటె: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ టీ.శ్యాం భట్, సభ్యుడు ఎస్‌కే వంటిగోడి సమక్షంలో గురువారం ఫిర్యాదులపై విచారణ సమావేశం జరిగింది. జిల్లా పరిపాలన భవనంలోని ఆడిటోరియం హాల్‌లో జరిగిన సమావేశంలో ఫిర్యాదుదారులు, అధికారుల సమక్షంలో జిల్లాకు సంబంధించి కమిషన్‌కు సమర్పించిన మొత్తం 9 ఫిర్యాదులను విచారించి పరిష్కరించారు. హూవినహడగలి తాలూకా దాసనహళ్లికి చెందిన డెటా ఎంట్రీ ఆపరేటర్‌కు 12 నెలల జీతం ఇవ్వలేదన్న ఫిర్యాదుపై నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. కొట్టూరుకు చెందిన అజ్జప్ప తండ్రి విరుపాక్షప్ప వలి తన సోదరిని హత్య చేసి దాచి పెట్టిన నిందితుడిని అరెస్ట్ చేయాలని, తన సోదరిని కట్నం కోసం వేధించి ఇంటి నుంచి వెళ్లగొట్టాడని హొసపేటెకు చెందిన టీహెచ్.అశోక్ అభిషేక్ ఇచ్చిన ఫిర్యాదుపై సమావేశంలో చర్చించారు. ఈ రెండు కేసులపై ఇప్పటికే కమిషన్‌కు విచారణ నివేదిక అందజేశామని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. విజయనగర జిల్లా హడగలి తాలూకా సోవేనహళ్లిలో 1963లో కొత్త ప్లాట్లు కేటాయించి వాటి రద్దు చేసి మళ్లీ కేటాయించడంపై దాఖలైన ఫిర్యాదుపై సమావేశంలో చర్చ జరిగింది. కేసును సమీక్షించి అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేసేందుకు కమిషన్‌కు మధ్యంతర నివేదిక అందించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాధికారి దివాకర్, జెడ్పీ సీఈఓ నోంగ్‌జోయ్ మహమ్మద్ అలీ అక్రమ్ షా తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం వేయండి



వినతిపత్రం సమర్పిస్తున్న కార్యకర్తలు

రాయచూరు రూరల్: జిల్లాలో తుంగభద్ర, కృష్ణా నదుల నుంచి ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం వేయాలని మూల నివాసి అంబేడ్కర్ సంఘం డిమాండ్ చేసింది. గురువారం ఎస్పీ కార్యాలయం వద్ద కార్యకర్తలు వ్యక్తం చేసిన నిరసనలో సంచాలకుడు భరత్ కుమార్ మాట్లాడారు. దేవదుర్గ, రాయచూరు తాలూకాల్లో విచ్చలవిడిగా, యథేచ్ఛగా సాగుతున్న ఇసుక రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతూ జిల్లా ఎస్పీ పుట్టమాదయ్యకు వినతిపత్రం సమర్పించారు.

పాల ధర తగ్గింపు విరమించుకోవాలి



సమావేశమైన జేడీఎస్, బీజేపీ కార్యకర్తలు

కోలారు: పాడి రైతుల నుంచి పాల సేకరణ ధరను కోచిముల్ రూ.2 తగ్గించిన నేపథ్యంలో గురువారం నగరంలోని బీజేపీ నాయకుడు ఓంశక్తి చలపతి కార్యాలయంలో సమావేశమైన జేడీఎస్, బీజేపీ కార్యకర్తలు తగ్గించిన పాల సేకరణ ధరను వెంటనే తిరిగి పెంచాలని, కోచిముల్‌కు వారం రోజులు గడువు ఇస్తున్నామని, ఆలోగా తగ్గించిన పాల సేకరణ ఆదేశాలను వెనక్కు తీసుకోవాలని, లేనిపక్షంలో కోచిముల్‌కు వ్యతిరేకంగా తీవ్ర స్థాయిలో ఆందోళన చేయాలని నిర్ణయించారు. శుక్రవారం సాంకేతికంగా కోచిముల్ ఎండీ, జిల్లాధికారులకు వినతి పత్రం సమర్పించాలని తీర్మానించారు. వారం గడువు అనంతరం పాల సేకరణ తగ్గింపు ఆదేశాలను వెనక్కు తీసుకోకపోతే ఆందోళన బాట పట్టాలని సమావేశంలో తీర్మానం చేశారు. జేడీఎస్ నాయకుడు సీఎంఆర్ శ్రీనాథ్ మాట్లాడుతూ పాల సేకరణ ధరను తగ్గించడం వల్ల పాడి రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. కోచిముల్ తీసుకున్న నిర్ణయం వల్ల జిల్లాలో పాడి పరిశ్రమ ఉనికి ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్నారు. దీనిని ఖండిస్తూ బీజేపీ, జేడీఎస్ పార్టీలు సంయుక్తంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇరు పార్టీలు పాడి రైతులకు అండగా నిలవాలన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓంశక్తి చలపతి మాట్లాడుతూ పాల సేకరణ ధరను తగ్గించడం వల్ల కోలారు, చిక్కబళ్లాపుర ఉభయ జిల్లాల్లోని పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని, ఉభయ పార్టీలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా జేడీఎస్ తాలూకా అధ్యక్షుడు బాబు మౌని, కార్యాధ్యక్షుడు బణకనహళ్లి నటరాజ్, యలవార సొణ్ణేగౌడ పాల్గొన్నారు.

మొబైల్ పోతే పోర్టల్‌లో ఫిర్యాదు చేయండి

కేజీఎఫ్: ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని కేజీఎఫ్ ఎస్పీ కేఎం శాంతరాజు తెలిపారు. గురువారం ఎస్పీ కార్యాలయంలో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసిన వారికి సుమారు 5.25 లక్షల విలువ చేసే వివిధ కంపెనీలకు చెందిన మొబైల్ ఫోన్లను వారసుదారులకు అందించి మాట్లాడారు. మొబైల్ ఫోన్ల దొంగతనంపై ఫిర్యాదు అందిన వెంటనే పోలీస్ శాఖ తక్షణమే స్పందిస్తుందన్నారు. సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడం ద్వారా దొంగతనం జరిగిన ఫోన్‌ను వెంటనే కనుగొంటారన్నారు. ఇతరులు మొబైల్ ఫోన్‌ను దుర్వినియోగం చేయడాన్ని నివారించడానికి సాధ్యం అవుతుందన్నారు. ఇదే సమయంలో 50 ఫోన్లను వారసుదారులకు అందించారు. డీఎస్పీ ఎస్ పాండురంగ, సీఈఎస్ లక్ష్మీనారాయణ, ఉరిగాం సీఐ ఎస్టీ మార్కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు లేని బైక్‌లు స్వాధీనం

శ్రీనివాసపురం: ఆర్‌సీ, ఇన్సూరెన్స్ తదితర సరైన రికార్డులు లేని ద్విచక్రవాహనాలను పట్టణ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎం బి.గొరవనకొళ్ల మాట్లాడుతూ ద్విచక్రవాహనాలు నడిపే వారు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ప్రతి రికార్డును దగ్గర ఉంచుకోవాలన్నారు. తనిఖీ సమయంలో పోలీసులు అడిగినప్పుడు వాటిని చూపించాలన్నారు. ప్రతి ఒక్కరూ ద్విచక్రవాహనం నడిపే సమయంలో ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. పట్టణంలోని ఎంజీ రోడ్డు, కేఎస్ఆర్టీసీ బస్టాండు తదితర ప్రాంతాల్లో 50కి పైగా ద్విచక్ర వాహనాలను స్వాధీనపర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ జయరాం తదితర సిబ్బంది ఉన్నారు.